www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సొరంగంలో 5 చోట్ల మెత్తని భాగాలు!



3

ఆక్వా ఐ, జీపీఆర్ టెక్నాలజీతో గుర్తింపు

అవి మృతదేహాలు కావొచ్చు, కాకపోవచ్చు

ఆ ప్రాంతాల్లో బురదమట్టిని తవ్వుతున్న మైనర్లు

అసత్య వార్తలను ప్రచారం చేస్తున్నారు.. నమ్మొద్దు

కార్మికుల గుర్తింపులో ప్రగతి ఉంటే చెప్తాం: కలెక్టర్

టన్నెల్ బోరింగ్ మిషన్‌ను గ్యాస్ కట్టర్లతో వేరు చేస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్

శనివారం | 1-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 332 |
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా.12.10 తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.11.23 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.8.01-9.27; అమృతఘడియలు: తె.4.39-6.06; దుర్ముహూర్తం: ఉ.6.36-8.10, రాహుకాలం ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.36; సూర్యాస్తమయం: 6.18 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దక్షిణాది రాష్ట్రాల

తిరుగుబాటు తప్పదు

దక్షిణాదిలో బీజేపీకి బలం లేనందున ఇక్కడి రాష్ట్రాలకు కేంద్రంలో న్యాయమైన వాటా ఇవ్వకూడదన్నదే ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుత జనాభాను ప్రాతిపదికగా తీసుకొని, దక్షిణాది రాష్ట్రాలను ఆర్థికంగా, రాజకీయంగా నిర్వీర్యం చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోంది. - సీఎం రేవంత్‌రెడ్డి

జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లు పెంచే కుట్ర

దీంతో ఉత్తరాది రాష్ట్రాలకే భారీగా ప్రయోజనం

దక్షిణాది ఓట్లతో పనిలేకుండా గెలవాలని ఎత్తుగడ

జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాదికే శిక్ష

ఇప్పటికే పన్నుల వాటాలో తెలంగాణకు అన్యాయం

మేం రూపాయిస్తే 42 పైసలే వెనక్కి వస్తోంది

బిహార్‌కు రూ.7.60, యూపీకి రూ.3 ఇస్తున్నారు

మోదీ కుట్రను కచ్చితంగా తిప్పికొడతాం

ఇతర భాషలను బలవంతంగా రుద్దితే ఊరుకోం

విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు



శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవాల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటు సీట్లను పెంచకుండా శిక్షించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అలా జరిగితే దక్షిణాది రాష్ట్రాల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. దక్షిణాది సీట్లు తగ్గవంటూ అమిత్ షా చెబుతున్నారని, పెంచబోమన్న లాజిక్ అందులో కనబడుతోందని వ్యాఖ్యానించారు. ఉత్తరాది బీమారు(బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, యూపీ) రాష్ట్రాలకు సీట్లు పెంచుకుని, శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ పన్నాగం పన్నిందని ఆరోపించారు. కేంద్రం సూచనలు పాటిస్తూ జనాభాను నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుట్రను తప్పకుండా తిప్పికొడతామని ప్రకటించారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రేవంత్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి విలేకరులతో

మిగతా 13వ పేజీలో...

కిషన్‌రెడ్డి సైంధవుడు

13

తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు

వాళ్ల కేసీఆర్ దిగిపోయారని బాధపడుతున్నారు

ఆయన అడ్డుపడటం వల్లే మెట్రోరైలు ప్రాజెక్టు ఆగింది

ఆర్‌ఆర్‌ఆర్‌ను కేంద్ర క్యాబినెట్‌లో రాకుండా చేస్తున్నరు

ఏపీలో ముస్లిం కోటా రద్దు చేయించే ధైర్యముందా?

కేంద్ర మంత్రిపై సీఎం రేవంత్ ఫైర్.. బహిరంగ లేఖ

చేసింది చెప్పుకోవట్లేదు

ప్రభుత్వ విజయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం

కులగణన, ఎస్సీ వర్గీకరణ, ఉద్యోగాల భర్తీ, సంక్షేమ అమల్లో కొత్త ఒరవడి

కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్‌గా తెలంగాణ

కష్టపడి రాహుల్‌ని ప్రధానిని చేద్దాం

10 లోపు జిల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ

టీపీసీసీ విస్తృత స్థాయి భేటీలో సీఎం

ఫ్లెక్సీలతో కాదు.. ప్రజల్లో ఉంటేనే గెలుస్తాం: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు చెప్పుకుందామన్న ఆలోచనే మనం చేయట్లేదు. కులగణన, ఎస్సీ వర్గీకరణ, ఉద్యోగ, ఉపాధి కల్పన సహా అనేక అంశాల్లో కొత్త ఒరవడి సృష్టించాం. కాంగ్రెస్ పార్టీకి మోడల్ స్టేట్‌గా తెలంగాణ మారనుంది. బీజేపీ చెప్పే గుజరాత్ మోడల్‌కు ప్రత్యామ్నాయంగా తెలంగాణ మోడల్‌ను కాంగ్రెస్ తీసుకోవచ్చు. ఇది.. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్

మిగతా 12వ పేజీలో...



వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాగ్వాదం

నీ ఆట ముగిసింది!

కోట్లాది ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నావ్.. అమెరికాను అగౌరవపరిచావ్

మూడో ప్రపంచ యుద్ధం వస్తే నీ వల్లే!.. జెలెన్‌స్కీపై భగ్గుమన్న ట్రంప్, వాన్స్

శ్వేతసౌధంలో విలేకరుల ముందే అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షుల వాగ్వాదం

నేను మొదటి నుంచీ ఒంటరిగానే పోరాడుతున్నా

మీకు కాదు.. అమెరికా ప్రజలకు ధన్యవాదాలు: జెలెన్‌స్కీ

ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకుండానే వెళ్లిన ఉక్రెయిన్ అధ్యక్షుడు

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య శ్వేతసౌధంలో తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. శుక్రవారం ఇరువురు నేతలు ఓవల్ ఆఫీసులో 45 నిమిషాల పాటు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒక దశలో జెలెన్‌స్కీపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు కోట్లాది మంది ప్రజల ప్రాణాలతో జూదం ఆడుతున్నారు' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అమెరికాను అగౌరవపరిచారని మండిపడ్డారు. అమెరికా శాంతి నిబంధనలకు అంగీకరించాలని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యలకు జెలెన్‌స్కీ సమాధానం ఇచ్చిన తర్వాత నేతల మధ్య ఈ గొడవ మొదలైంది. జెలెన్‌స్కీ సమాధానం ఇవ్వబోగా.. 'మీకు మాట్లాడడానికి అనుమతి లేదు' అని ట్రంప్ అన్నారు. దానికి జెలెన్‌స్కీ.. యుద్ధం మొదలైనప్పుడు తాము ఒంటరిగానే ఉన్నామని బదులిచ్చారు. ఇద్దరు నేతల మధ్య సంభాషణ ఇలా..

ట్రంప్: మీ దగ్గర మా సైనిక సంపత్తి లేకపోతే యుద్ధం 2 వారాల్లోనే ముగిసేది..

మిగతా 2వ పేజీలో...

మామునూరు విమానాశ్రయానికి పచ్చ జెండా

వరంగల్ జిల్లాలో నిర్మాణానికి కేంద్రం ఓకే

ఏఏఐకి పౌరవిమానయాన శాఖ లేఖ

శంషాబాద్ నుంచి 150 కి.మీ. లోపు మరో విమానాశ్రయం ఉండరాదన్న నిబంధన ఉపసంహరణ

దీనిపై అప్పట్లోనే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

ఇప్పటికే భూసేకరణకు రూ.205 కోట్లు

రాష్ట్రంలో అందుబాటులోకి రానున్న రెండో విమానాశ్రయం

సీఎం ప్రత్యేక చొరవ వల్లే సాధ్యమైంది

మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ

మోదీ సహకారం వల్లే వచ్చింది: కిషన్‌రెడ్డి

తెలంగాణకు ఇదో గేమ్ చేంజర్

కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు



ఎయిర్‌పోర్టు నిర్మాణం కానున్న స్థలం

న్యూఢిల్లీ/హైదరాబాద్/వరంగల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్

మిగతా 10వ పేజీలో...



ఉత్తరాఖండ్ చమోలీలో క్షతగాత్రుల్ని మోసుకెళ్తున్న సైనిక సిబ్బంది

మంచులో 22 ప్రాణాలు!

ఉత్తరాఖండ్‌లో బీఆర్వో కార్మిక శిబిరంపై మంచు చరియలు

55 మంది కార్మికులు చిక్కుకోగా 33 మందిని రక్షించిన సైన్యం

మిగిలిన వారి కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు

డెహ్రాడూన్, ఫిబ్రవరి 28: ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ సమీపంలో ఘోర ప్రమాదం సంభవించింది. సరిహద్దు రహదారుల సంస్థ(బీఆర్‌వో)కు చెందిన ఓ కార్మిక శిబిరంపై శుక్రవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో మంచు చరియలు విరిగిపడ్డాయి. అప్పుడు ఆ శిబిరంలో ఉన్న 55 మంది కార్మికులు మంచులో చిక్కుకుపోయారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టిన భారత సైన్యం, బీఆర్‌వో బృందాలు కడపటి వార్తలందేసరికి 33 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. వీరిలో నలుగురి

మిగతా 2వ పేజీలో...

అసామాన్యురాలైన సామాన్యురాలు!

మీనాక్షి నటరాజన్‌కు గాంధీ మార్గమే స్ఫూర్తి



గత రాష్ట్ర ఇన్‌చార్జులకు పూర్తి భిన్నంగా ఆమె వైఖరి

నిరాడంబరతకు పట్టం

రైల్లో రాష్ట్రానికి రాక..

ప్రభుత్వ అతిథి గృహంలోనే బస

స్వాగతం పలికేందుకు స్టేషన్‌కు రావొద్దని ముందే స్పష్టం

ఆమె సూచనతో గాంధీభవన్ వద్ద కనిపించని ఫ్లెక్సీలు, కటౌట్లు

ఎన్ఎస్‌యూఐ నుంచి సీడబ్ల్యూసీ సభ్యురాలి దాకా..

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆమె కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్! రైల్లో కాచిగూడ స్టేషన్‌లో దిగారు. అక్కడికొచ్చిన కొద్ది మంది పార్టీనేతలు.. శాలువాలు కప్పబోతే.. బొకేలు ఇవ్వబోతే సున్నితంగా వారించారు. ఎవరైనా శాలువా కప్పినా కూడా వెంటనే తీసేశారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కదా? విమానంలో కాకుండా రైల్లో రావడం ఏమిటి? అంటారా! ఆమె నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం! సింపుల్‌గా పంజాబీ డ్రెస్సు, హవాయి చెప్పులు, సాదాసీదా కళ్లజోడు.. ఇదీ ఆమె ఆహార్యం. అడుగడుగునా గాంధీయిజాన్ని అనుసరించే ఆమె.. ఫ్లెక్సీలు, కటౌట్లతో ఆర్భాటంగా కనిపించే

మిగతా 12వ పేజీలో...

సీబీఎస్ఈ పదో తరగతిలో ఇంగ్లిష్, హిందీ తప్పనిసరా?

ముసాయిదాపై పలు సందేహాలు

2

ఈపీఎఫ్ వడ్డీ ఈసారీ 8.25 శాతమే

ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపే మరణిస్తే కుటుంబానికి కనీస బీమా రూ.50 వేలు

ఉద్యోగం మారినప్పుడు 2 నెలల విరామం వచ్చినా పూర్తి కాలం సర్వీసుగానే..

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ నిర్ణయాలు



షాపులో మంటలు.. భవనమంతటా వ్యాప్తి!

నాలుగేళ్ల చిన్నారి సహా ముగ్గురి మృతి.. ఒకరికి గాయాలు

2 కార్లు దగ్ధం.. ఒక కారులో పేలిన సిలిండర్.. ఇంట్లో పేలిన మరో రెండు

నార్సింగ్‌లో ఘటన

14



అది సజ్జల స్క్రిప్ట్!

దాని ప్రకారమే నేను మాట్లాడాను

భార్గవ్‌రెడ్డి దానిని వైరల్ చేశారు

పోలీసుల ముందు పోసాని అంగీకారం

ఆయనపై మొత్తం 15 కేసులున్నాయి

రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడి

రెండు వారాలు కస్టడీ విధించిన కోర్టు

రాజంపేట సబ్‌జైలుకు పోసాని తరలింపు

10

సండే నుంచి మంటలే!

మార్చి ప్రారంభంలోనే మండనున్న సూరీడు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్

14

వాహనం ఆచూకీ ఇక పక్కా!



అన్ని రవాణా, ప్రయాణికుల వాహనాల్లో 'లొకేషన్ ట్రాకింగ్ డివైజ్' పెట్టాల్సిందే!

మహిళా ప్రయాణికుల భద్రతకు భరోసా

కేంద్రానికి రాష్ట్ర రవాణా శాఖ ప్రతిపాదన

అనుమతి రాగానే పూర్తిస్థాయిలో అమలు

డివైజ్ ఏర్పాటుకు రూ.10 వేల దాకా ఖర్చు

కొత్త వాటికి కంపెనీలే అమర్చేలా చర్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. మహిళా ప్రయాణికులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. నిత్యం ఎక్కడో ఒకచోట కదులుతున్న వాహనాల్లో అకృత్యాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సర్కారు ఆదేశాల మేరకు రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని వాహనాలకు 'వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీడీ)'లు తప్పనిసరి చేయనుంది. ఇకపై సరుకు రవాణాతోపాటు ప్రయాణికుల వాహనాలు తప్పనిసరిగా వీఎల్‌టీడీలను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అనుమతి

మిగతా 14వ పేజీలో...



మార్కెట్లకు ఫిబ్రవరీ

ట్రంప్ దెబ్బకు సూచీలు ఢమాల్.. గత నెలంతా 'బేర్' పట్టు

సెన్సెక్స్ 4300 పతనం.. రూ.85 లక్షల కోట్లు హాంఫట్

బ్లాక్ ఫ్రైడే.. సెన్సెక్స్ 1,414, నిఫ్టీ 420 పాయింట్లు డౌన్

ఒక్కరోజులోనే రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నాయి. భారత ఈక్విటీ మార్కెట్‌లో భారీ ప్రకంపనలు చెలరేగాయి. సెన్సెక్స్ ఫిబ్రవరి నెలలో 4300 పాయింట్లు నష్టపోయింది.

11

అమెరికాలో కొనసాగుతున్న ఉద్యోగుల తొలగింపు

పలు విభాగాల్లో వందలాది మందికి ఉద్వాసన

2

ఉద్యోగుల తొలగింపుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు చట్ట విరుద్ధం

శాన్‌ఫ్రాన్సిస్కో జిల్లా జడ్జి విలియం అల్సప్

రూ.3.22 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్

పండంటి ప్రగతికి 10 సూత్రాలు!

'స్వర్ణాంధ్ర-2047' దిశగా తొలి అడుగు

రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక వృద్ధి లక్ష్యం

మూలధన వ్యయానికి రెట్టింపు నిధులు

వ్యవసాయానికి రూ.29వేల కోట్లు

పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, మౌలికానికి పెద్దపీట

3

వాతావరణ పరిశోధన కేంద్రం

దక్షిణభారత డీడీజీఎంగా అముద

» కేంద్రానికి నేతృత్వం వహించనున్న తొలి మహిళ



చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిశోధన కేంద్రం దక్షిణభారత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మేనేజర్ (డీడీజీఎం)గా డాక్టర్ బి.అముద నియమితులయ్యారు. ప్రస్తుతం డీడీజీఎంగా ఉన్న బాలచంద్రన్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో శనివారం డాక్టర్ అముద ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు. 18వ శతాబ్దం చివరిలో చెన్నైలో దక్షిణభారత వాతావరణ పరిశోధనా కేంద్రం ఏర్పాటు కాగా, ఈ కేంద్రానికి నేతృత్వం వహించనున్న తొలి మహిళ డాక్టర్ అముద కావడం విశేషం. అంతేగాక ఆమె తమిళనాట స్థిరపడిన తెలుగు కుటుంబీకురాలు కావడం మరో విశేషం. హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురం, అమరావతి పరిధిలో ఉన్న వాతావరణ కేంద్రాలన్నీ ఈ మండలం కిందకే వస్తాయి. డాక్టర్ అముద ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలపై విస్తృత పరిశోధనలు చేపట్టి డాక్టరేట్ పొందారు. 3 దశాబ్దాలుగా ఆమె వాతావరణశాఖలో సేవలందిస్తున్నారు.

సీబీఎస్ఈ పదో తరగతిలో ఇంగ్లిష్, హిందీ తప్పనిసరా?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఇక నుంచి ఏటా రెండు సార్లు పదో తరగతి పరీక్షలు నిర్వహించే విషయమై సీబీఎస్ఈ విడుదల చేసిన ముసాయిదా విధానంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని ప్రకారం ప్రథమ భాషగా ఇంగ్లిష్, ద్వితీయ భాషగా హిందీ, ఐచ్ఛికభాషలుగా ప్రాంతీయ, విదేశీ భాషలు ఉండనున్నాయి. దీన్ని చూస్తుంటే ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి భాషలుగా చదవాల్సి ఉంటుందన్న అనుమానాలు కలుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇంగ్లిష్, హిందీ పరీక్షలకు నిర్దీత తేదీలను కూడా ప్రకటించారు. మిగిలిన అన్ని భాషలకు ఒక్క రోజే పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. దీని ప్రకారం హిందీ తప్పనిసరి అన్న అభిప్రాయం కలుగుతోంది. ప్రాంతీయ భాషల జాబితాలో పంజాబీ లేకపోవడాన్ని అక్కడి ప్రభుత్వం ఎత్తిచూపింది. ఈ సందర్భంగానే ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి సబ్జెక్టులా అన్న చర్చ తలెత్తింది. దీనిపై సీబీఎస్ఈ వివరణ ఇస్తూ ఇది ఖరారు చేసిన జాబితా ఏమీ కాదని తెలిపింది. తుది జాబితాలో అన్ని భాషలకు చోటు ఉంటుందని పేర్కొంది. ఇంగ్లిష్‌ను ప్రథమ భాషగా, హిందీని ద్వితీయ భాషగా ఎందుకు పేర్కొన్నారనేదానిపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ ముసాయిదాపై మార్చి 9లోగా అభిప్రాయాలు చెప్పే అవకాశం ఉండడంతో మరికొన్ని రకాల సందేహాలు కూడా బోర్డు దృష్టికి వెళ్లే అవకాశం ఉంది.

రాష్ట్ర హక్కుల రక్షణ కోసం పోరాడదాం: స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కేంద్రంపై పోరాటం సాగించాల్సిన సమయం ఆసన్నమైందని తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం పేరుతో నిర్బంధ హిందీ అమలు, నియోజకవర్గాల పునర్విభజన పేరిట లోక్‌సభ స్థానాలు తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. శనివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పార్టీ కార్యకర్తలకు స్టాలిన్ బహిరంగ లేఖ రాశారు. పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకోవటం తనకు అలవాటు అని.., అయితే ఈసారి హిందీ వ్యతిరేకోద్యమం దిశగా ప్రేరేపించాల్సిన అవసరమున్నందున పార్టీ శ్రేణులందరిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అప్రమత్తంగా వ్యవహరించకపోతే రాష్ట్రంలో హిందీ రాజ్యమేలి తమిళభాష పత్తాలేకుండా పోతుందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, త్రిభాషా విద్యావిధానం అత్యంత అవసరమని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నారు.

కర్ణాటకలో బర్డ్ ఫ్లూ.. రాష్ట్రమంతా హై అలర్ట్

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్టు నిర్ధారణ కావడంతో రాష్ట్రమంతటా హై అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు నగరానికి సమీపంలో ఉండే చిక్కబళ్లాపుర తాలూకాలో ఇంత వరకు 36 కోళ్లు మృతి చెందాయి. బళ్లారి జిల్లా సండూరు, రాయచూరు జిల్లా మాన్వి తాలూకా పరిధిలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి మృత్యువాత పడుతున్నాయి. బెంగళూరులో శుక్రవారం వైద్యశాఖ అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. రాష్ట్రమంతటా అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మనుషులకి ఎక్కడా బర్డ్ ఫ్లూ సోకిన దాఖలాలు లేవని అధికారులు స్పష్టం చేశారు.

FORM IV

(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER ANDHRA JYOTHI

1. Place of Publication	:	Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupathi, Karimnagar, Ananthapur, Tadepalligudem, Warangal, Guntur, Kurnool, Nellore, Srikakulam, Rajamahendravaram, Khammam, Kadapa, Ongole, Nalgonda, Nizamabad, Mahaboobnagar.
2. Periodicity of its Publication	:	DAILY
3. Printer's name	:	KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of india	:	YES
(b) If a foreigner, The country of origin:		-
Address	:	Door No.: 8-2-293/82/J/68-B, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
4. Publisher's Name	:	KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of India	:	YES
(b) If a foreigner, The country of origin	:	-
Address	:	Door No.: 8-2-293/82/J/68-B,, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
5. Editor's Name	:	N.RAHUL KUMAR
Nationality	:	INDIAN
1 (a) Whether a citizen of India	:	YES
(b) If a foreigner, the country of origin:		-
Address	:	Plot.no.540, 2-105/111/540, Third Phase, Journalists Colony, AVN School, Gopanpally, Gachibowli, K.V.Rangareddy, Hyderabad - 500032, Telangana.
6. Name's and Addresses of individuals Who own the Newspaper and partners of Shareholding more than one percent of the total capital	:	
(a) Aamoda Publications Pvt. Ltd		Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(b) V.Radhakrishna		8-3-293/82/J III/211-1, Road No 76, Phase-III, Jubilee Hills Hyderabad - 500 033
(c) M.Prabhakara Rao		H.No. 8-2-293/82/A, Plot No.543, Road No.26, Jubilee Hills, Hyderabad - 500 033.
(d) D.Jai Ramesh		Plot No.173, Road No.13, Jubilee Hills, Hyderabad - 500 033.
(e) V.Aditya		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(f) Ch.Shruthi Keerthi		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(g) M/s Active Power Corporation Pvt Ltd		Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(h) Vemuri Anusha		8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.

I, KOGANTI VENKATA SESHAGIRI RAO, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
KOGANTI VENKATA SESHAGIRI RAO
Publisher

Date: 28.02.2025

నీ ఆట ముగిసింది!

విలేకరుల సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్ వాగ్వాదం



(మొదటి పేజీ తరువాయి)

జెలెన్‌స్కీ: రష్యా అధ్యక్షుడు మూడు రోజుల్లోనే ముగిసేదన్నారు. ఇప్పుడు అది రెండు వారాలైంది.

ట్రంప్: మీ దేశం భారీ కష్టాల్లో ఉంది. ఈ యుద్ధం మీరు గెలవబోవడం లేదు. ఇప్పటికైనా బయటపడే అవకాశాలు ఉన్నాయంటే అది మా వల్లే.

వాన్స్: మీ దేశ వినాశనాన్ని అడ్డుకోవాలని మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అమెరికా ఓవల్ ఆఫీసుకు వచ్చి మా ప్రభుత్వం మీద దాడి చేయడం గౌరవప్రదంగా ఉందని భావిస్తున్నావా? మేం చేస్తున్న ప్రయత్నాలకు కచ్చితంగా ధన్యవాదాలు తెలియజేయాలి.

జెలెన్‌స్కీ: నేను అమెరికా ప్రజలకు ధన్యవాదాలు చెప్పాను.

ట్రంప్: మీ దగ్గర ఆట కొనసాగించడానికి పేకల్లేవు. మా వల్లే ఇన్నాళ్లు ఆడగలిగావు. మీరు కోట్లాది మంది ప్రజల ప్రాణాలతో జూదం ఆడుతున్నారు. మూడో ప్రపంచ యుద్ధంతో ఆటలు ఆడుతున్నారు.

జెలెన్‌స్కీ: నేనే కార్డులూ ఆడడం లేదు.

ట్రంప్: మీరు అమెరికాను అగౌరవపరుస్తున్నారు. మీరు మాతో ఆడుకోలేరు. ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇక ఆపండి.

ఇరువురు నేతల మధ్య తీవ్ర వాగ్వాదంతో ప్రెస్‌మీట్ మధ్యలోనే జెలెన్‌స్కీ వెళ్లిపోయారు. ఓవెల్ ఆఫీసులో అమెరికా అధ్యక్షుడు, మరో దేశాధ్యక్షుడి మధ్య జరిగిన అతిపెద్ద వాగ్వాదం ఇదే కావడం విశేషం.

తొలుత సాదర స్వాగతం..

తొలుత శ్వేతసౌధంలో జెలెన్‌స్కీకి ఎదురెళ్లి మరీ ట్రంప్ ఆహ్వానం పలికారు. ఇద్దరూ కరచాలనం చేసుకొని లోనికి వెళ్లారు. రష్యాతో శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలంటే ఉక్రెయిన్ చాలా విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుందని ట్రంప్ చెప్పారు. అవసరమైతే కొంత భూభాగాన్ని కూడా రష్యాకు ఇవ్వాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. రాజీలు లేకుండా ఎలాంటి ఒప్పందాలూ జరగవని స్పష్టం చేశారు. అమెరికన్ కంపెనీలకు ఉక్రెయిన్‌లోని విలువైన ఖనిజ వనరులను అప్పగించే ఒప్పందంపై సంతకం చేయాలన్నారు. భవిష్యత్తులో అమెరికా మద్దతు అనేది దీనిపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఈ షరతుపై జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాలకు సంబంధించిన ఒప్పందంతో ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు చేకూరుతుందని ట్రంప్ అన్నారు. అయితే పుతిన్ ఓ హంతకుడని, ఆయనతో రాజీ పడే ప్రసక్తే లేదని జెలెన్‌స్కీ చెప్పారు. యుద్ధ సమయంలో రష్యా సైనికుల అకృత్యాలకు సంబంధించిన ఫొటోలను ట్రంప్‌కు చూపించారు. 'మా భూమి కోసం హంతకుడితో ఎలాంటి రాజీ పడబోం' అని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమవైపే ఉన్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. ట్రంప్ స్పందిస్తూ.. తాను శాంతిదూతగా గుర్తుండిపోవాలని ఆశిస్తున్నానన్నారు. "నేను ఇదంతా చేస్తున్నది ప్రాణాలను కాపాడేందుకే తప్ప మరో కారణం లేదు. ఇలాగే వదిలేస్తే మూడో ప్రపంచ యుద్ధానికి వెళుతుంది. వ్యవహారం తప్పుడు దారిలో వెళుతోంది" అని వ్యాఖ్యానించారు. కాగా, ఓవల్ ఆఫీసులో తీవ్ర వాగ్వాదం అనంతరం జెలెన్‌స్కీ ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకుండానే వెళ్లిపోయారు. కాగా, జెలెన్‌స్కీకి శాంతి చర్చలు ఇష్టం లేదంటూ ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. "దీన్ని నేను ఒక అవకాశంగా మలచుకోవాలని కోరుకోవడం లేదు. నేను శాంతినే కోరుకుంటున్నా. ఆయన శాంతికి సిద్ధమైతే తిరిగి రావచ్చు" అని పేర్కొన్నారు.

జెలెన్‌స్కీని నియంత అన్నానా?

» ఆయనంటే నాకు అత్యంత గౌరవం

» జెలెన్‌స్కీతో భేటీకి ముందు ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: జెలెన్‌స్కీని ఇటీవల నియంతగా అభివర్ణించిన ట్రంప్ మాట మార్చారు. ఈ ఇద్దరు దేశాధినేతల భేటీకి ముందు విలేకరులు ట్రంప్‌ను ఇదే అంశంపై ప్రశ్నించగా, "నేనలా అన్నానా? అలా అన్నానంటే నమ్మలేకపోతున్నా" అన్నారు. జెలెన్‌స్కీపై తాను చేసిన వ్యాఖ్య అంతగా పట్టించుకోవాల్సిన అంశం కాదని చెప్పారు. గురువారం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ శ్వేతసౌధంలో ట్రంప్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఇద్దరూ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగానే ట్రంప్ జెలెన్‌స్కీ గురించి పొడుగుతూ మాట్లాడారు. అతనంటే తనకు అత్యంత గౌరవమని అన్నారు. తాము ఆయుధాలు ఇచ్చి అండగా నిలిచినా జెలెన్‌స్కీ ధైర్యంగా నిలబడి రష్యా మీద పోరాడటం గొప్ప విషయమన్నారు.

లోకం తీరు



భార్య వేధింపులతో

మరో టెకీ ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బెంగళూరులో అతుల్ సుభాష్ ఆత్మహత్య ఘటన మరవక ముందే.. భార్య వేధింపులతో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో మరో టెకీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. 'దయచేసి.. మగవాళ్ల గురించి కూడా ఆలోచించండి..' అంటూ ఆత్మహత్యకు ముందు అతడు తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యూపీకి చెందిన 25 ఏళ్ల మానవ్ శర్మ ముంబైలోని టీసీఎస్‌లో మేనేజర్. ఏడాది క్రితం అతడికి వివాహమవ్వగా.. ఈనెల 24న తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నికితా శర్మ తీవ్ర వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు దాదాపు 7 నిమిషాల చివరి సెల్ఫీ వీడియోలో.. 'నా భార్య వేరొకరితో సంబంధం పెట్టుకొని నాపైనే కేసులు పెడతానంటూ వేధిస్తోంది. నన్నెప్పుడు ఓ మనిషిలా కూడా చూడలేదు.. దయచేసి మగవాళ్ల గురించి ఎవరైనా మాట్లాడండి' అని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే మానవ్ భార్య నికితా శర్మ స్పందించారు. 'మానవ్ మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. 3సార్లు నేనే కాపాడాను' అని చెప్పారు.

మేలో స్కైప్ మూసివేత: మైక్రోసాఫ్ట్

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ప్రపంచానికి వీడియో కాన్ఫరెన్సింగ్ అనే సదుపాయాన్ని పరిచయం చేసిన తొలినాటి ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన 'స్కైప్' త్వరలో మూతబడనుంది. ఈ విషయాన్ని స్కైప్ యాజమాన్య సంస్థ మైక్రోసాఫ్ట్ తన అంతర్గత వేదిక అయిన ఎక్స్‌డీఏలో వెల్లడించింది. మే నెల నుంచి స్కైప్ అందుబాటులో ఉండదని తెలిపింది. స్కైప్ యూజర్లు.. టీమ్స్‌కు (ఇది కూడా మైక్రోసాఫ్ట్‌కు చెందినదే) బదిలీ కావచ్చని, ఇప్పటికే పలువురు టీమ్స్‌ను ఉపయోగించుకుంటున్నారని పేర్కొంది. 2003లో స్కైప్ ఆవిర్భవించింది. 2011లో ఆ ప్లాట్‌ఫాంను మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది.

అమెరికా వాతావరణ విభాగాల్లో వందలాది ఉద్యోగుల తొలగింపు

» నేషనల్ వెదర్ సర్వీస్‌లో 375 మంది

» ఎన్‌వోఏఏలో ఐదు వందల మంది

» ఫెడరల్ ఉద్యోగుల తొలగింపుపై ట్రంప్ ఆదేశాలు చట్ట విరుద్ధమన్న ఫెడరల్ జడ్జి

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: అమెరికా వాతావరణ విభాగాల్లోని వందలాది మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఫెడరల్ విభాగాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించి ఖర్చులను ఆదా చేయాలన్న డోజ్ విభాగం సూచనల మేరకు ఈ చర్యకు పూనుకొన్నారు. దీంతో పాటు, నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌వోఏఏ) విభాగంలోనూ వందలాది మందిని తొలగించారు. అయితే, వాతావరణ అంచనాల విభాగంలో(ఎన్‌డబ్ల్యూఎస్) తొలగించిన ఉద్యోగులంతా(375 మంది) ప్రొబేషనరీ ఉద్యోగులు. ఇక, ఎన్‌వోఏఏలో దాదాపు ఐదు వందల మందిని తొలగించారు. ఈ విభాగంలో మళ్లీ తొలగింపులు ఉంటాయని, తర్వాతి రౌండ్‌లో 800మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికాలోని సామాజిక భద్రతా(సోషల్ సెక్యూరిటీ) విభాగంలో పనిచేస్తున్న 7వేల మందిని సెలవులపై పంపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ విభాగంలో 60వేల మంది పనిచేస్తున్నారు. ఇందులో దాదాపు 50% సిబ్బందిని తొలగించే అవకాశం ఉందని అందులో పనిచేసే ఓ అధికారి చెప్పారు. డోజ్ సూచనలతో ఇప్పటికే పలు ఫెడరల్ విభాగాల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించారు.

ట్రంప్ ఆదేశాల నిలిపివేత

పలు విభాగాల్లో ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని శాన్‌ఫ్రాన్సిస్కో డిస్ట్రిక్ట్ జడ్జి(ఫెడరల్) అల్సప్ అడ్డుకున్నారు. ట్రంప్ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఫెడరల్ విభాగాల్లోని ఉద్యోగులను తొలగించే అధికారం పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇతర విభాగాల్లోని ప్రొబేషనరీ ఉద్యోగులను సైతం అది తొలగించలేదన్నారు.

ఈపీఎఫ్ వడ్డీ 8.25 శాతమే

ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపే మరణిస్తే ఉద్యోగి కుటుంబానికి కనీస బీమా రూ.50వేలు

» సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో నిర్ణయాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) నిల్వలపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25శాతం వడ్డీ రేటునే కొనసాగించాలని ఈపీఎఫ్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) సమావేశం నిర్ణయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే వడ్డీ రేటు అమలైంది. ఈ ఏడాదీ ఇదే రేటును కొనసాగించాలన్న సీబీటీ నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు పంపనున్నారు. ప్రభుత్వ ఆమోదం తర్వాత వడ్డీ రేటును ఈపీఎఫ్‌వో నోటిఫై చేయనుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వడ్డీరేటు ఖరారుతోపాటు పలు కీలక అంశాలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఉద్యోగుల డిపాజిట్లకు అనుబంధంగా ఉన్న బీమా(ఈడీఎల్ఐ) పథకం కింద అందుతున్న ప్రయోజనాలను పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపు ఈపీఎఫ్ సభ్యులు మరణిస్తే.. వారి కుటుంబాలకు కనీస జీవిత బీమా ప్రయోజనం కింద రూ.50వేలు అందించాలన్న ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అలాగే, చివరిగా చందా చెల్లించిన ఆరు నెలల్లోగా సభ్యుడు మరణిస్తే.. ఈడీఎల్ఐ ప్రయోజనాలను అమలు చేయాలని సమావేశం నిర్ణయించింది. కాగా, ఉద్యోగం మానేసి మరో ఉద్యోగంలో చేరినప్పుడు ఈపీఎఫ్ సర్వీసుకు ఒక్క రోజు విఘాతం ఉన్నా.. ప్రస్తుతం ఈడీఐఎల్ ప్రయోజనాలు అందించడం లేదు. ఇకపై.. రెండు నెలల వ్యవధి వచ్చినా వారు నిరంతరం సర్వీసులో ఉన్నట్టే పరిగణించనున్నారు. అలాంటి ఉద్యోగులు మరణిస్తే.. ఆయా కుటుంబాలకు కనీస బీమా కింద రూ.2.5లక్షలు అందించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాల మూలంగా ఏటా 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఈపీఎఫ్‌వో వర్గాలు తెలిపాయి. కాగా, తాము వడ్డీరేటును 8.30 శాతానికి పెంచాలని కోరగా, 8.25 శాతానికే సీబీటీ అంగీకరించిందని ట్రేడ్ యూనియన్ కో ఆర్డినేషన్ కమిటీ తెలిపింది. ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపు మరణించిన వారికీ.. ఈడీఎల్ఐ పథకాన్ని వర్తింపజేయడం చరిత్రాత్మకమని ప్రశంసించింది. ఈపీఎఫ్ చందా కట్టడం మానేసిన తర్వాత ఆరు నెలల్లోపు మరణిస్తే ప్రయోజనాలు చేకూర్చాలని నిర్ణయించడం, రెండు నెలల్లోపు కొత్త ఉద్యోగంలో చేరితే పూర్తికాలం ఉద్యోగంలో ఉన్నట్టే భావించి ప్రయోజనాలు సమకూర్చడం చెప్పుకోదగ్గ నిర్ణయాలని పీయూసీసీ ప్రధాన కార్యదర్శి తివారీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మంచులో 22 ప్రాణాలు!

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి విషమంగా ఉంది. మరో 22 మంది మంచులోనే ఉండగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారత్- టిబెట్ సరిహద్దులో చివరి గ్రామం, సముద్రమట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో, బద్రీనాథ్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మనా అనే గ్రామంలో ఈ శిబిరం ఉంది. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా మంచు విపరీతంగా కురుస్తుంది. అయితే, భారత్-టిబెట్ సరిహద్దు మార్గంలో సైనిక కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు.. బీఆర్‌వోకు చెందిన కార్మికులు కొద్ది రోజులుగా అక్కడ పని చేస్తున్నారు. రహదారిపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్నారు. ఈ క్రమంలో వారు బస చేసిన శిబిరంపై మంచు చరియలు విరిగి పడడంతో మంచు కింద ఉండిపోయారు. ఆ శిబిరంలో మూడు కంటెయినర్లు, ఓ షెడ్ ఉన్నాయని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. నిరంతరాయంగా మంచు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. కాగా, ఉత్తరాఖండ్‌లోని ఛమోలీ, ఉత్తర్‌కాశీ, రుద్రప్రయాగ్ జిల్లాల్లో 2,400 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే అవకాశముందని చండీగఢ్‌లోని డిఫెన్స్ జియో ఇన్ఫర్మేటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీజీఆర్ఈ) గురువారం సాయంత్రమే హెచ్చరికలు జారీ చేసింది. 3,500 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షం, మంచు కురిసే అవకాశముందని డెహ్రాడూన్‌లోని వాతావరణ కేంద్రం శుక్రవారం ఉదయం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినా ఉపయోగం లేకపోయింది.

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

ఈ ఏడాది చివరి నాటికి పూర్తి

ఈయూ చీఫ్ ఉర్సులా వాన్ డేర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: భారత్‌తో సైనిక, రక్షణ ఒప్పందాలు కుదుర్చుకోవాలని భావిస్తున్నామని యూరోపియన్ యూనియన్(ఈయూ) చీఫ్ ఉర్సులా వాన్ డేర్ లెయెన్ అన్నారు. సైనిక సామర్థ్యాలు పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని కొనియాడారు. ఈ అంశంలో ఈయూ- భారత్ పరస్పరం చేదోడును అందించుకోగలవని నమ్ముతున్నానని, సైబర్ దాడులు, సీమాంతర ఉగ్రవాదం, సముద్ర భద్రత వంటి అంశాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో ఉర్సులా భేటీ అయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మోదీతో సమావేశం సందర్భంగా 6జీ, ఏఐ, సెమీకండక్టర్లు తదితర అంశాలపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరిగితే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఒప్పందంగా నిలుస్తుందని అని ఉర్సులా భేటీకి ముందు పేర్కొన్నారు.

మహిళా జడ్జిల సంఖ్య పెరగాలి

అప్పుడే స్త్రీల కేసుల్లో పరిష్కారం సులువవుతుంది : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో మహిళా న్యాయమూర్తుల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని, దీనివల్ల మహిళలకు సంబంధించిన కేసుల్లో పరిష్కారం సులభమవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. మధ్యప్రదేశ్‌లో పనితీరు సరిగా లేదన్న కారణంతో ఇద్దరు మహిళా న్యాయాధికారులను తొలగించిన కేసుపై విచారణను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం కొనసాగించింది. తొలగించిన ఆ న్యాయాధికారులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. పని తీరుకు లింగబేధానికి సంబంధం లేదని, అయితే మహిళల ప్రత్యేక సమస్యలను అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. తొలగింపునకు గురైన ఒక న్యాయాధికారి.. గర్భస్రావంతో ఇబ్బంది పడుతున్నారని, ఫలితంగా తీవ్రమైన శారీరక నొప్పే కాకుండా, మానసిక ఒత్తిడి కూడా ఉంటుందన్నారు. అదే సమయంలో ఆమె సోదరుడు బ్లడ్ క్యాన్సర్‌తో ఉన్నట్టు తేలిందని, అప్పుడే ఆమె కొవిడ్ బారిన పడ్డారని, ఇలా.. ఏకకాలంలో ఒక మహిళ ఎంతో వేదనకు గురయ్యారని, ఇవన్నీ పరిగణలోకి తీసుకోకుండా ఆమెను విధుల్లో నుంచి తొలగించడం సరి కాదన్నారు.

బంగ్లా విముక్తి పోరాటంలో

భారత్ పాత్రను తగ్గించేశారు!

» బంగ్లాదేశ్ పాఠ్యపుస్తకాల్లో సమూల మార్పులు

ఢాకా, ఫిబ్రవరి 28: బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో భారతదేశ పాత్రను తగ్గిస్తూ ఆ దేశం మధ్యంతర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేసింది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించడంలో కీలక పాత్ర పోషించిన ముజీబుర్ రెహ్మాన్, ఆయన కుమార్తె, మాజీ ప్రధాని షేక్ హసీనాల భాగస్వామ్యాన్ని కూడా పూర్తిగా తగ్గించి చూపేలా పుస్తకాలను మార్చేసింది. రానున్న విద్యా సంవత్సరం కోసం 40 కోట్ల కొత్త పాఠ్యపుస్తకాలను ముద్రించారు. అన్ని పాఠ్య పుస్తకాల నుంచి మాజీ ప్రధాని షేక్ హసీనా పేరును పూర్తిగా తొలగించారు. దీంతో పాటు బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్, భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రాలను కూడా తొలగించడం గమనార్హం. కాగా, బంగ్లాదేశ్‌ను స్వతంత్ర దేశంగా తొలుత భారత్ 1971, డిసెంబరు 6న గుర్తించినట్లుగా గతంలో పేర్కొన్నారు. తాజాగా, తొలుత భూటాన్ (1971, డిసెంబరు 3న) బంగ్లాను స్వతంత్ర దేశంగా గుర్తించినట్లు మార్పులు చేయనున్నారు.

మయన్మార్ 'సైబర్' ముఠాల్లోని 526 మంది భారతీయులకు విముక్తి

హైదరాబాద్,ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లో సైబర్ నేర కేంద్రాలు నిర్వహిస్తోన్న చైనా ముఠాల నుంచి ఇప్పటిదాకా 526మంది భారతీయులను విడిపించామని మయన్మార్ పోలీసులు భారత రాయబార కార్యాలయానికి తెలియజేశారు. స్వదేశానికి వెళ్లేందుకు ఇష్టపడని భారతీయులు దాదాపు 1500 మంది ఆ ముఠాల్లో ఇంకా ఉన్నారని కూడా పేర్కొన్నారు. మయన్మార్‌లో రక్షించిన వారిని ప్రస్తుతం థాయ్‌లాండ్ సరిహద్దులోని శిబిరానికి తరలించారు. వీరిని అక్కడి నుంచి భారతదేశం పంపించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరుగుతోంది. కాగా, ఏపీ, తెలంగాణ చెందిన దాదాపు 30 మంది ఈ శిబిరంలో ఉన్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

కేరళ కాంగ్రెస్ నేతల భేటీకి థరూర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేరళలో కాంగ్రెస్ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి తోడ్పడాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎంపీలతో పాటు కేరళ సీనియర్ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శశి థరూర్ కూడా హాజరయ్యారు. థరూర్ కాంగ్రెస్‌ను వీడుతారన్న ఊహాగానాల నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకొంది. కాగా, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా బహిరంగ ప్రకటనలు చేయరాదని ఖర్గే ఈ సందర్భంగా పరోక్షంగా శశిథరూర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

అమెరికాలో 'గుడ్డు' సంక్షోభం

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: హెచ్5ఎన్1 ఏవియన్ ఫ్లూ విజృంభణ కారణంగా అమెరికా గుడ్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ వైరస్ కారణంగా దేశంలో 2022 నుంచి 14 కోట్లకు పైగా కోళ్లు మృత్యువాత చెందాయి. ఈ నేపథ్యంలో గుడ్ల సరఫరాను స్థిరీకరించేందుకు, ఆకాశాన్నంటున్న ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం బిలియన్ డాలర్లు(సుమారు రూ.8,378 కోట్లు) కేటాయించింది. తుర్కియే నుంచి ఈ ఏడాది 42 కోట్ల మేర గుడ్లను దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది.

బీచ్‌లో ఇడ్లీ-సాంబార్.. విదేశీయులెలా వస్తారు?

పణజీ, ఫిబ్రవరి 28: గోవాకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గడానికి బీచ్‌లో ఇడ్లీ-సాంబార్, వడ-పావ్ అమ్మడమే కారణమని రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే మైఖెల్ లోబో ఆరోపించడం రాజకీయ దుమారాన్ని రేపింది. 'బెంగళూరు నుంచి వచ్చిన కొందరు ఇడ్లీ-సాంబార్, వడ-పావ్ అమ్ముతున్నారు. అందుకే రెండేళ్లుగా అంతర్జాతీయ టూరిజం తగ్గింది' అని అన్నారు. దీనిపై విమర్శలు రావడంతో.. బీచ్‌లో సంప్రదాయ గోవా వంటకాలైన చేపలు, ఇతర సీ-ఫుడ్‌ను విక్రయించాలని, సరైన తినుబండారాలు లేకపోవడం వల్లే టూరిస్టులు రావడం లేదని వివరణ ఇచ్చారు.

గోదావరిలో మునిగి ఇద్దరు యువకుల మృతి

- భద్రాద్రిలో దైవదర్శనానికి వెళ్లగా విషాదం
- మరో ఘటనలో రిజర్వాయర్‌లో పడి ఇద్దరు అన్నదమ్ముల మృతి


హరిప్రసాద్, పవన్ కుమార్ (ఫైల్)

భద్రాచలం/ ధరూరు/ చందంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య దర్శనానికి వెళ్లి గోదావరి నదిలో స్నానం చేస్తూ నీట మునిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతులిద్దరూ బావ బావమరదులు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం హరిదాస్‌పల్లికి చెందిన పత్తి నర్సింహులు కుమారుడు హరిప్రసాద్ (18) కొత్తగూడెంలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. అయితే నర్సింహులు చెల్లెలు రేపాకుల మంజుల ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రేగులచిలకలో ఉండటంతో భార్య భీమమ్మ, కొడుకు హరిప్రసాద్‌తో అక్కడికి వచ్చాడు. మంజులకు కుమారుడు పవన్‌కుమార్ (19) ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే వీరంతా రామయ్య దర్శనానికి శుక్రవారం సాయంత్రం భద్రాచలం చేరుకున్నారు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగగా నర్సింహులు, హరిప్రసాద్, పవన్ కుమార్ మునిగిపోసాగారు. గజఈతగాళ్లు నర్సింహులును రక్షించారు. గల్లంతైన హరిప్రసాద్, పవన్ కోసం నదిలో గాలించగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

ఆడుకుంటూ వెళ్లి రిజర్వాయర్ నీటిలో మునిగి అన్నదమ్ములు మృతి చెందారు. శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా చందంపేట మండలం నక్కలగండితండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా ఉండే కాట్రావత్ రూప్ల, సరోజ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు హరిప్రసాద్ (12), రెండో కుమారుడు బిట్టు (8) తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు వెళ్లారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా పిల్లలిద్దరూ ఆడుకుంటూ సమీపంలోని నక్కలగండి రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. నీళ్లలోకి దిగి ఆడుకుంటూ మునిగి మృతి చెందారు.

పైసా లేదుగానీ.. ప్రాజెక్టులు కావాలా..?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నేత ప్రభాకర్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర పైసా లేదు గానీ.. కొత్త ప్రాజెక్టులు కావాలా..?' అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్.. రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్‌కు ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. కిషన్‌రెడ్డిపై సీఎం రేవంత్ చేసిన విమర్శలు ఉత్తివే అని, వాటికి విలువ లేదని అన్నారు. బీఆర్ఎస్ రాజకీయ హత్యలకు పాల్పడుతోందని ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్రంలో జరిగిన కొన్ని హత్యల వెనుక కుట్ర, కుంభకోణం ఉందని విమర్శించారు.

సొరంగంలో 5 చోట్ల మెత్తని భాగాలు!

ఆక్వా ఐ, జీపీఆర్ టెక్నాలజీతో గుర్తింపు.. అవి మృతదేహాలు కావొచ్చు, కాకపోవచ్చు

- ఆ ప్రాంతాల్లో బురద మట్టిని తవ్వుతున్న సింగరేణి మైనర్లు
- అసత్య వార్తలను ప్రచారం చేస్తున్నారు.. నమ్మొద్దు
- కార్మికుల గుర్తింపులో ప్రగతి ఉంటే చెబుతాం: కలెక్టర్


టన్నెల్లో కొనసాగుతున్న డీవాటరింగ్ ప్రక్రియ

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/ దోమలపెంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రమాదంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆక్వా ఐ సోనార్ టెక్నాలజీ, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్)తో టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నించారు. ఈ క్రమంలో బురదలో ఐదు చోట్ల 13.500 కిలోమీటర్ల నుంచి 80-100 మీటర్ల పరిధిలో 6 అడుగుల లోతులో కొన్ని మెత్తని భాగాలను ఎన్‌జీఆర్ఐ బృందాలు గుర్తించినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతాలను మార్కింగ్ చేసి, సింగరేణి మైనర్స్‌తో తవ్విస్తున్నారు. ఆ ప్రదేశాల్లో నాలుగు మీటర్ల మేర మట్టి, బురద ఉందని, డీవాటరింగ్ చేస్తున్నా నీటి ఊట వస్తూనే ఉందని సమాచారం. ఆ ఐదు ప్రాంతాల్లో తవ్వుతున్న బృందాలకు దుర్వాసన కూడా వచ్చినట్లు సమాచారం. అవి మృతదేహాలు కావొచ్చు, కాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం మీడియాలో వైరల్‌గా మారడంతో నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అది ఫేక్ న్యూస్ అని చెప్పారు. జీపీఆర్ ఆధారంగా ఎన్‌జీఆర్ఐ అధికారులు కొంత సమాచారం ఇచ్చారని, దాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయాలు వాస్తవం కాదని పేర్కొన్నారు. సహాయక చర్యల్లో భాగంగా ప్రస్తుతం బురద తొలగింపు, టీబీఎం కటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని, కార్మికుల గుర్తింపును మొదటి ప్రాధాన్యంగా తీసుకొని పనిచేస్తున్నామని, ఎలాంటి ప్రగతి ఉన్నా మీడియాకు తెలియజేస్తామని చెప్పారు. అప్పటివరకు ఫేక్ న్యూస్ ప్రచారం చేయకుండా, సహకరించాలని సూచించారు. జీపీఆర్ పరికరం విడుదల చేసే విద్యుదయస్కాంత రేడియో తరంగాలు బురద మట్టిలోకి ప్రవేశించి, అక్కడున్న వస్తువులు, భాగాలను గుర్తిస్తాయి. వాటి ఆధారంగా నమూనా చిత్రాలు అందుతాయి. మనిషి ఆకారాన్ని పోల్చిన చిత్రం వస్తే ఆ ప్రాంతంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీస్తారు. కాగా, సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలపై శుక్రవారం సింగరేణి సీఎండీ బలరాం విలేకరులతో మాట్లాడారు. సొరంగంలో చిక్కుకున్న వారి జాడను ఇంకా గుర్తించలేదని తెలిపారు. 13.9 కి.మీ. దూరంలో టీబీఎం ముందు భాగం ఉందని, మిషన్ కటింగ్, బురద తొలగింపు ప్రక్రియ జరుగుతోందని, మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెప్పారు. సోషల్ మీడియాలో నకిలీ సమాచారాన్ని నమ్మొద్దని కోరారు.

సొంతూళ్లకు కార్మికులు

ఖర్చులకు పైసా ఇవ్వని కంపెనీ!

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పనిచేస్తున్న జేపీ కంపెనీ కార్మికులు ప్రాణ భయంతో సొంతూళ్లకు పయనమవుతున్నారు. సొరంగంలో జరిగిన ప్రమాదంలో తమ సహచరులను కోల్పోయామనే బాధతో వారి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. టన్నెల్‌లో ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. తమకు కంపెనీ 3 నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేదని వాపోతున్నారు. ఊర్లోనే కూలి పనులు చేసుకొని తల్లిదండ్రులు, భార్యాబిడ్డలతో కలిసి బతుకుతామని చెబుతున్నారు. రవాణా ఖర్చులు అడిగితే కంపెనీ చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని తెలిపారు. కుటుంబ సభ్యుల ద్వారా డబ్బులు స్థానికుల ఖాతాలకు పంపించుకొని, వాటితో శుక్రవారం సొంతూళ్లకు బయలుదేరారు.

నేడు ఎస్ఎల్‌బీసీ వద్దకు బీజేపీ బృందం

బీజేపీ ఎమ్మెల్యేల బృందం శనివారం ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లనుంది. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని బృందం మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఎల్‌బీసీ వద్దకు చేరుకుంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి.


బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం: జూపల్లి

ఎస్ఎల్‌బీసీపై కేసీఆర్ శ్రద్ధ పెట్టలేదు: గుత్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు ఉనికి కాపాడుకునేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సహా ప్రకృతి విపత్తును సైతం రాజకీయం చేసి పబ్బం గడుపుకొనేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నారని, మంత్రులుగా తాము క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు రెస్క్యూ టీంలు శతవిధాల ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. కాగా, కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని, దానిపై పెట్టిన శ్రద్ధలో 25%ఎస్ఎల్‌బీసీపై పెడితే ఎప్పుడో పూర్తయ్యేదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయంగా విమర్శలు మాని, ఘటనపై అన్ని పక్షాలు కలిసి ముందుకెళ్లాలని సూచించారు. ఘటన దురదృష్టకరమని, ప్రమాదాలకు భయపడి ప్రాజెక్టులు మూసుకుంటామా? అవాంతరాలు ఎదురైనా పూర్తిచేయాల్సిందేనన్నారు.

పదేపదే మూత్రవిసర్జనకు 'ఐటీఇండ్'తో చెక్

- బ్లాడర్ నెక్ వద్ద ప్రత్యేక పరికరం ఏర్పాటుతో సమస్యకు పరిష్కారం
- హైదరాబాద్‌లోని ఏఐఎన్‌యూలో ఓ రోగికి ఆ పరికరాన్ని అమర్చిన వైద్యులు


బ్లాడర్ నెక్ వద్ద ఏర్పాటు చేసిన ఐటీఇండ్ పరికరం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదేపదే మూత్ర విసర్జన సమస్యతో సతమతమవుతున్న ఓ రోగి సమస్యను హైదరాబాద్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు అరుదైన శస్త్రచికిత్స ద్వారా పరిష్కరించారు. రోగి బ్లాడర్ హెడ్ వద్ద ఐటీఇండ్ అనే పరికరాన్ని అమర్చి ఉపశమనం కల్పించారు. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన 55 ఏళ్ల వ్యక్తి మూత్రవిసర్జనకు చాలా ఇబ్బంది పడుతున్నారు. పదేపదే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం, తీరా వెళ్లాక సరిగా విసర్జన కాకపోవడం, మళ్లీ బ్లాడర్ నిండుగా ఉన్నట్లు అనిపించడం తదితర సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ తరహా సమస్యను 'ప్రైమరీ బ్లాడర్ నెక్ అబ్‌స్ట్రక్షన్ (పీబీఎన్‌ఓ)' అంటారని యూరాలజిస్టు డాక్టర్ మద్దూరి విజయ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ పీబీఎన్‌ఓ సమస్య పరిష్కారానికి రోగి మూత్రనాళంలో బ్లాడర్ నెక్ వద్ద ఐటీఇండ్ అనే ఆధునిక పరికరాన్ని అమర్చామని చెప్పారు. ఐటీఇండ్ పరికరం ప్రోస్టేట్‌ను, బ్లాడర్ నెక్‌ను తెరుస్తుందని, బ్లాడర్ నెక్ వద్ద మూత్రం సులభంగా పోయేందుకు వీలుగా మూడుచోట్ల ఛానల్స్ ఏర్పాటవుతాయని వివరించారు. ఈ పరికరం అమర్చిన ఐదు నుంచి 7 రోజుల్లో మూత్రనాళంలో మూసుకుపోయిన ప్రాంతాన్ని తెరుస్తుందన్నారు. అనంతరం ఈ పరికరాన్ని తొలగిస్తామని తెలిపారు. కాగా, ఐటీఇండ్ అమరిక వల్ల లైంగిక సామర్థ్యం తగ్గడం వంటి దుష్ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ తరహా సమస్యలకు సంప్రదాయ చికిత్సల్లో ప్రోస్టేట్‌ను కొంత తొలగిస్తామని, అందువల్ల వీర్యస్ఖలనం సామర్థ్యం పోవచ్చునన్నారు. కానీ, ఐటీఇండ్‌లో కోతలే ఉండవు కనుక లైంగిక సామర్థ్యం అలాగే ఉంటుందని చెప్పారు. ఈ శస్త్రచికిత్స చేయించుకున్న రోజునే రోగి ఆస్పత్రి నుంచి వెళ్లిపోవచ్చునని విజయ్‌కుమార్ శర్మ పేర్కొన్నారు.

ఎక్కువ సేపు మూత్రం లోపలే ఉంటే కిడ్నీలకు ముప్పు

మూత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 55 ఏళ్లలోపు పురుషుల్లో 35 -45 శాతం మందికి పీబీఎన్‌ఓ ఉంటుందని డాక్టర్ మద్దూరి విజయ్ కుమార్ శర్మ తెలిపారు. దిగువ మూత్రనాళ లక్షణాలు (ఎల్‌యూటీఎస్) ఉన్నవారికీ పీబీఎన్‌ఓ ఎక్కువగానే కనిపిస్తుందని అన్నారు. పురుషులు రోజులో నాలుగైదు సార్లు మూత్రానికి వెళ్తే, ఈ సమస్య ఉన్నవారు ప్రతి గంటకీ వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎక్కువ సేపు మూత్రం లోపలే ఉంటే మూత్రపిండాలు దెబ్బతినే ముప్పు ఉందని, ఈ తరహా సమస్య ఉన్న వారు వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఏపీ బడ్జెట్ రూ. 3.22 లక్షల కోట్లు

'స్వర్ణాంధ్ర-2047' దిశగా తొలి అడుగు.. దాని మేరకే కేటాయింపులు

- రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక వృద్ధి లక్ష్యం
- అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత

(అమరావతి - ఆంధ్రజ్యోతి)


బడ్జెట్ ప్రతుల బ్యాగ్‌తో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఆర్థిక మంత్రి పయ్యావుల

అభివృద్ధి... సంక్షేమం... ఏడాదికి కేటాయింపులు... దీర్ఘకాలిక లక్ష్యాలు! 'స్వర్ణాంధ్ర-2047' సాధన దిశగా తొలి అడుగు! ఏపీలోని కూటమి సర్కారు ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌కు ఇదే దిశా, దశ! 3,22,359 కోట్ల రూపాయల భారీ మొత్తంతో 2025-26 వార్షిక బడ్జెట్ రూపుదిద్దుకుంది. పేరుకు ఇది.. ఒక్క సంవత్సరానికి జమా ఖర్చుల పద్దు! కానీ... 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన దిశగా తొలి అడుగు వేశారు. అందుకు 'పది సూత్రాలు' నిర్దేశించుకున్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, వ్యవసాయం-అభివృద్ధి, రవాణా సదుపాయాల మెరుగుదల, తక్కువ ఖర్చు తో ఇంధన ఉత్పత్తి, స్వచ్ఛాంధ్ర, టెక్నాలజీ విస్తృత వినియోగం, తక్కువ ధరలతో అత్యుత్తమ నాణ్యమైన ఉత్పత్తుల తయారీ... ఈపది సూత్రాలతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలని నిర్ణయించారు. ఈ దీర్ఘకాలిక ప్రణాళికకు అనుగుణంగా 2025-26బడ్జెట్‌ను రూపొందించారు. శుక్రవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో మూలధన వ్యయానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. 2014-19మధ్య టీడీపీ ప్రభుత్వం మూలధన వ్యయం కోసం 59 శాతం ఖర్చు చేస్తే, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం 22 శాతం ఖర్చు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెట్టుబడుల వ్యయాన్ని రెట్టింపు చేసి... ఏకంగా రూ.40,635 కోట్లు కేటాయించింది.

ప్రగతి బాటలు...

పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యం పెంపు, ఉపాధి కల్పన... ప్రగతి సాధనకు ఇవి కీలకం. వీటి కోసం ఈ బడ్జెట్‌లో రూ.12,112 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా... విశాఖ - చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ.837 కోట్లు ఖర్చు చేయనున్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాల కోసం రూ.1400 కోట్లు, పీపీపీలో వీజీఎఫ్ (వయబులిటీ గ్యాప్ ఫండింగ్) కోసం రూ.2,000 కోట్లు కేటాయించారు. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన - ఆజీవికా కోసం రూ.745 కోట్లు, ఐటీఐ, ఐఐఐటీ, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (కాకినాడ) కోసం రూ.210 కోట్లు ఖర్చు చేయనున్నారు.

రథ చక్రాలు...

ఆర్థిక, సాంకేతిక ప్రగతితో రాష్ట్రాభివృద్ధి వేగిరమవుతుందనే ఉద్దేశంతో సంబంధిత రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వీటికి ఏకంగా 55,730 కోట్లు కేటాయించారు. అమరావతిని 'గ్రోత్ ఇంజిన్'గా భావిస్తున్న నేపథ్యంలో... నూతన నగరాభివృద్ధికోసం బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు వెచ్చించనున్నారు. మానవ వనరులను పెంపొందించడం... వారిని నిపుణులుగా తీర్చిదిద్దడం... పేదరిక నిర్మూలన... శుభ్రమైన పరిసరాల్లో నివాసానికి 'స్వచ్ఛాంధ్ర' సాధనకు సంబంధించిన పద్దులకు ఏకంగా రూ.1,42,349 కోట్లు కేటాయించింది. ఇందులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసమే 27,518 కోట్లు ఖర్చు చేయనుంది. తల్లికి వందనం పథకం కోసం రూ.9,407 కోట్లు, స్వచ్ఛాంధ్ర కోసం రూ.820 కోట్లు కేటాయించారు. ఇక, సాగు బాగుంటే దుర్భిక్షం ఉండదు! అందుకే. వ్యవసాయం, నీటి సంరక్షణ పద్దులకు రూ.29,655 కోట్లు కేటాయించారు. ఇందులో 'అన్నదాత సుఖీభవ' పథకం వాటాయే రూ.6300 కోట్లు.

ఏపీ, తెలంగాణ బాంధవ్యాలు విడిపోలేదు

- తిరుమలలో మాజీ మంత్రి జానారెడ్డి


తిరుమలలో జానారెడ్డి

తిరుమల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ ప్రజలు పరిపాలనపరంగా విడిపోయారే తప్పా బాంధవ్యాలు, ఆత్మీయత పరంగా విడిపోలేదని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రజలు ఐక్యతగా ఉండి అభివృద్ధితో సుసంపన్నం కావాలని ఆశిస్తున్నానని చెప్పారు. ఐదారేళ్ల తర్వాత శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చానన్నారు. తన అనుభవాన్ని తెలంగాణ, ఏపీలకు అందించి అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.

రైల్వే గేటు వద్ద రెండు ఆర్టీసీ బస్సుల ఢీ

- ఎన్నికల విధుల్లో పాల్గొన్న 19 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, చికిత్స పొందుతున్న డ్రైవర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లను బస్సుల్లో కరీంనగర్‌కు తరలించి తిరుగు ప్రయాణంలో ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ఎన్నికల సిబ్బంది గాయపడ్డారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ జిల్లాకు చెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో అక్కడి బ్యాలెట్ బాక్స్‌లను ఎన్నికల సిబ్బంది గురువారం రాత్రి కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో స్ట్రాంగ్‌రూంకు చేర్చారు. అనంతరం తిరిగి నిర్మల్‌కు వెళుతున్న క్రమంలో వేకువజామున 3 గంటల ప్రాంతంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తురుకకాశీనగర్ ప్రాంతంలోని రైల్వేగేట్ వద్ద బస్సులు ఒక దాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. దీంతో వెనుక బస్సులో ఉన్న 19 మందికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ ఎండీ నయీమొద్దీన్ కాలు విరిగింది. రెవెన్యూ ఉద్యోగి పురుషోత్తం కడుపు, ఛాతీ భాగంలో దెబ్బలు తగలడంతో ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగతా 17 మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలు కాగా, వారికి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ కరీంనగర్ ఆసుపత్రిలో పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పునర్విభజన లొల్లి

దక్షిణాది మెడమీద పునర్విభజన కత్తివేలాడుతున్నదంటూ హెచ్చరిక చేసి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పెద్ద వివాదమే రేపారు. జనాభా నియంత్రణలో ఘన విజయాలు సాధించిన దక్షిణాది రాష్ట్రాలు ప్రతిఫలంగా పెద్దఎత్తున లోక్‌సభ సీట్లను కోల్పోబోతున్నాయని హెచ్చరించారాయన. కోయంబత్తూరులో మహాశివరాత్రినాడు ఒక ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనడానికి వచ్చిన హోంమంత్రి అమిత్ షా, ఏమిటీ అసత్యప్రచారాలంటూ స్టాలిన్ మీద విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ ఎప్పుడో ఇచ్చిన వాగ్దానం మేరకు దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రోరేటా విధానంలో ఒక్క పార్లమెంట్ స్థానం కూడా తగ్గదని, దక్షిణాదికి అన్యాయం జరగబోదని అమిత్ జీ హామీ ఇచ్చారు. మార్చి ఐదున స్టాలిన్ ఓ విస్తృతస్థాయి సమావేశానికి సంకల్పిస్తున్న నేపథ్యంలో, అమిత్ షా తనకు తానుగా ఈ అంశాన్ని ప్రస్తావించి, హామీ ఇవ్వడం మంచిదే. అయితే, దక్షిణాదికి ఎందుకు అన్యాయం జరగదో, జరగకుండా తాము చేయబోతున్నదేమిటో ఆయన కాస్తంత వివరణగా చెప్పివుంటే, హామీ అనంతరం కూడా వెల్లువెత్తుతున్న అనుమానాలకు ఆస్కారమే ఉండేది కాదు.

దేశ భవిష్యత్తుకోసం జనాభా తగ్గించుకోండని ఐదుదశాబ్దాల క్రితం కేంద్రం చెబితే, చిన్న కుటుంబం చింతలు లేనిదనీ, మేమిద్దరం మాకిద్దరనీ, బడిలో ఒకరు ఒడిలో ఒకరనీ విభిన్నరీతుల్లో విస్తృతప్రచారం చేసి, భయపెట్టీ బతిమాలీ మొత్తానికి జనాభా నియంత్రణలో దక్షిణభారతం మంచివిజయాలు సాధించింది. వృద్ధిలో, విద్యలో ఉత్తరాది కన్నా ఓ మెట్టుపైనే ఉన్నందువల్ల ప్రభుత్వాల కృషి, పడుతున్న తాపత్రయం ప్రజలకు కూడా అర్థమైంది. ఎక్కువమందిని కంటే పోషించలేమనీ, రత్నాల్లాంటి బిడ్డలు ఒకరిద్దరు ఉంటే వారిని వృద్ధిలోకి తేవచ్చునని తమకు తాముగా సామాన్యజనం కూడా తెలుసుకున్నారు. చివరకు ఇద్దర్ని కూడా వద్దనుకొని, ఒక్కరే ముద్దు అన్న దశకు దక్షిణాది చేరుకుంటే, అవిద్య, పేదరికం అధికంగా ఉన్న ఉత్తరాదికి ఆ ఊసు పెద్దగా పట్టలేదు. జనాభానియంత్రణలోనూ, అభివృద్ధిలోనూ వెనకబడిన ఉత్తరాది రాష్ట్రాలకు వాటి వైఫల్యాలే అర్హతలుగా రకరకాల మేళ్ళు జరుగుతూండటం సహజంగానే దక్షిణరాష్ట్రాలకు ఆగ్రహం కలిగిస్తుంది. ఆకలి, దారిద్ర్యం, అభివృద్ధిలేమి కారణంగా వాటికి ఒనగూరే ప్రత్యేక కేటాయింపులు, రాయితీలు, పథకాలను దక్షిణాది అనాదిగా సహనంగా భరిస్తోంది, పరోక్షంగా పోషిస్తోంది.

తాము ఎదిగి, దేశాన్ని ప్రగతిపథంలో నిలిపిన దక్షిణాదికి సభా ప్రాతినిధ్యంలోనూ అన్యాయం జరగబోతోందన్న అనుమానాలు చాలాకాలంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన జరిగే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనలో, తక్కువమంది సంతానాన్ని కన్న తమిళనాడుకు నష్టం జరగబోతోందని స్టాలిన్ వాదన. ఆయన స్వరాష్ట్రానికి సంబంధించిన లెక్కలు విప్పినప్పటికీ, ఇది దక్షిణాది బాధ. రెండేళ్ళక్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు సందర్భంలోనే ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు దక్షిణాదికి అన్యాయం జరగనివ్వబోమని ప్రధాని నిండుసభలో కనిమొళికి హామీ ఇచ్చారు. ఇప్పుడు అమిత్ షా కూడా దానినే మరింత గట్టిగా పునరుద్ఘాటించారు.

నియోజకవర్గాల పునర్విభజన ఏ ప్రాతిపదికన, ఏ విధంగా జరిగితే తమకు ఏ మేరకు నష్టం వాటిల్లుతుందో దక్షిణాదిరాష్ట్రాలకు అవగాహన ఉంది. సీట్లు కోల్పోతామన్న అనుమానాలకు ఆధారాలున్నాయి. పునర్విభజన కసరత్తు ఫలితంగా మొత్తం స్థానాల సంఖ్య 543నుంచి మరో మూడువందలు హెచ్చినా, ఆ పెరుగుదలలో దక్షిణాదికి జరగబోయే అన్యాయం మీద కూడా అవగాహన ఉంది. 80 స్థానాలున్న ఉత్తర్‌ప్రదేశ్ అదనంగా మరో అరవైస్థానాలతో లాభపడుతుందని, బీమారు బిహార్ రెట్టింపు స్థానాలతో బాగుపడుతుందనీ వాదనలున్నాయి. ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా, అవి ఉన్నవాటిని కోల్పోకుండా పునర్విభజన ఉంటుందని అమిత్ షా హామీ ఇచ్చినంతమాత్రాన దక్షిణాదికి న్యాయం చేసినట్టు కాదు. దక్షిణాదికి అన్యాయం జరగకుండా తాము ఏ ప్రాతిపదికలతో ముందుకు పోబోతున్నామో కేంద్రపాలకులు ఇప్పటికైనా స్పష్టంచేయాలి. ఎక్కువమంది పిల్లలను కనని పాపానికి దక్షిణాదిని శిక్షించి, బండెడు సంతానం ఉన్న ఉత్తరాదిని అత్యధిక ప్రాతినిధ్యంతో సత్కరిస్తే ఎవరూ ఊరుకోరు. ఉత్తరాది పార్టీగా ముద్రపడిన బీజేపీ, దక్షిణాదిలోనూ బలపడి విస్తరిస్తున్న తరుణంలో ఉత్తర, దక్షిణ విభేదాలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

త్రిభాషా విద్యలో హిందీ తప్పనిసరా?

నిష్కారణ యుద్ధాలు ఒక ఉన్నత లక్ష్య సాధనకు సంకల్పించినవి కావు, కాబోవు. అవి పక్షపాత పూరితమైనవి అవడం కద్దు. తాము విశ్వసించే భావజాలానికి మద్దతుగా చేసే యుద్ధాలవి. భారతీయ జనతా పార్టీకి ఇటువంటి నిష్కారణ యుద్ధాలు ప్రారంభించే ప్రవృత్తి బాగా ఉన్నది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అందుకు మంచి ఉదాహరణలు. ఒక అవసరాన్ని తీర్చేందుకు ఉద్దేశించబడినవి కావు ఆ చట్టాలు. హిందువులు, హిందూయేతర మతస్థుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టడం, విభేదాలు సృష్టించే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌— భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఆ చట్టాలకు ఎనలేని ప్రాధాన్యమిచ్చాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

కేంద్ర ప్రభుత్వం మరో నిష్కారణ యుద్ధానికి శంఖారావం చేసింది. ఈ తాజా యుద్ధం భాషమీద. 'త్రిభాషాసూత్రం' (టీఎల్‌ఎఫ్) పేరున ఉన్న పాఠశాల విద్యా విధానాన్ని తొలుత రాధాకృష్ణన్ కమిటీ ప్రతిపాదించింది. ఏ రాష్ట్రమూ దానిని అంగీకరించలేదు, అమలుపరచలేదు. ప్రతిపాదన ప్రతిపాదనగానే ఉండిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలో పాఠశాలల నిర్మాణానికి, ఉపాధ్యాయుల నియామకానికి ప్రభుత్వాలు సహజంగా ప్రథమ ప్రాధాన్యమిచ్చాయి. బాలలు అందరినీ బడులల్లో చేర్పించేందుకు, వారి విద్యాభ్యాసం పాఠశాల విద్య పూర్తయ్యే దాకా కొనసాగేలా చేసేందుకు ద్వితీయ ప్రాధాన్యమిచ్చారు. ఆ తరువాత, కేవలం భాషలు నేర్పడంలోనే కాకుండా గణితం, విజ్ఞానశాస్త్రం, చరిత్ర, భూగోళశాస్త్రం, సాంఘికశాస్త్రం మొదలైన విషయాలలో కూడ బోధన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అధిక ప్రాధాన్యమిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా ఆ విద్యా కర్తవ్యాలు అసంపూర్ణంగా, అసఫలంగా మిగిలిపోలేదూ?

భాషా బోధన ఒక ప్రమాదకర అంశంగా పరిణమించింది. అందుకు కారణం విద్యా సంబంధితమైనది కాదు. రాజ్యాంగ అధికరణ 343 వల్ల ఆ సమస్య ఏర్పడింది హిందీ దేశ అధికార భాషగా ఉంటుందని, అయితే ఇంగ్లీషు 15 సంవత్సరాల వరకు పాలన, బోధనా భాషగా కొనసాగుతుందని ఆ అధికరణ పేర్కొంది. ఆ 15 సంవత్సరాల గడువు 1965లో ముగిసింది. ఆ నాటి కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా జనవరి 26, 1965 నుంచి హిందీ ఏకైక అధికార భాష అవుతుందని ప్రకటించింది. హిందీయేతర భాషల వారు తక్షణమే తీవ్రంగా ప్రతిస్పందించారు. నిరసించారు. ఉద్యమించారు. హిందీ వ్యతిరేకత దావానలమయింది. తమిళనాడు భగ్గుమంది. ఒక ద్రావిడ పార్టీ అధికార కేతనం ఎగురవేసింది. హిందీయేతర భాషాలవారు కోరుకున్నంతవరకు ఇంగ్లీషు సహా అధికార భాషగా కొనసాగుతుందని దేశ ప్రజలకు జవహర్‌లాల్ నెహ్రూ హామీ ఇచ్చారు. 1965లో అధికార భాషా సంక్షోభం ముమ్మరమయిన దశలో ఇందిరాగాంధీ, అపును ఆమె ఒక్కరు మాత్రమే, ధైర్యంగా, సాహసోపేతంగా హిందీ దురభిమానులను ధిక్కరించారు. విజ్ఞతతో వ్యవహరించారు. దేశ ప్రజలకు తన తండ్రి నెహ్రూ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఆ హామీకి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. విజ్ఞత ఉన్న రాజనీతిజ్ఞత అది.

అది నెహ్రూ హామీయే అయినా అంతకంటే ఎక్కువగా, ముఖ్యంగా పరిపాలనా ఆవశ్యకతలు అధికారభాషలుగా హిందీ, ఇంగ్లీషుకు కట్టుబడి ఉండేలా చేశాయి. ఇతర భారతీయ భాషల వలే హిందీ కూడా సమగ్రంగా వికసించిన భాష కాదు. సైన్స్, న్యాయశాస్త్రం, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు, ఇంజనీరింగ్, విదేశీ సంబంధాలు, అంతర్జాతీయ వ్యవహారాలు మొదలైన వాటిని సమర్థంగా నిర్వహించేందుకు వెసులుబాటు లేని భాష. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శాసన నిర్మాణానికి, పాలనా వ్యవహారాల నిర్వహణకు ఇంగ్లీషు మీదనే ఆధారపడ్డాయి.

ఇదిలావుండగా ప్రభావశీలమైన పర్యవసానాలు బహుముఖీనంగా ఉన్న మూడు పరిణామాలు సంభవించాయి. అవి: ఒకటి— 1975లో 'విద్య'ను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు మార్చడం. దీనివల్ల పాఠశాల విద్యకు సంబంధించినంతవరకు రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగింది; రెండు— 1991లో మన దేశం ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఆమోదించి, అనుసరించడం; దీనివల్ల ఇంగ్లీష్ భాష ప్రాబల్యాన్ని అంగీకరించడం అనివార్యమయింది; మూడు— మరిన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నేర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేయడం. ఈ డిమాండ్ మరింత అధికంగా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

సరే, ప్రస్తుత వివాదం నూతన విద్యా విధానం–2020 లోని వివిధ విషయాలకు, ముఖ్యంగా త్రిభాషా సూత్రంకు సంబంధించినది. ఈ త్రిభాషా సూత్రం ప్రకారం ప్రాంతీయ/ రాష్ట్ర భాషను పాఠశాలల్లో 'ప్రథమ' భాషగా బోధించాలి. ఇంగ్లీషు 'ద్వితీయ' భాష. అయితే 'మూడో' భాష ఏమిటి? కేంద్ర విద్యామంత్రి చిత్తశుద్ధి లేని వాగాడంబర వాదన ఒకటి చేశారు. నూతన విద్యా విధానం ఒక జాతీయ విధానం కనుక ప్రతి రాష్ట్రమూ ఆ విధానాన్ని అమలుపరచడం రాజ్యాంగ విహితమైన బాధ్యత అని ఆయన అన్నారు. అంతేకాకుండా పాఠశాల బాలలకు మూడో భాష కూడా బోధించాలని నూతన జాతీయ విద్యా విధానం నిర్దేశించిందని. అయితే ఆ మూడో భాష విధిగా హిందీ అని స్పష్టీకరించలేదని పేర్కొన్నారు. మరి తమిళనాడు జాతీయ విద్యా విధానాన్ని అమలుపరిచేందుకు, మూడో భాష బోధించేందుకు తమిళనాడు ఎందుకు వ్యతిరేకిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నించడంలో ఆయన చాలా అమాయకత్వాన్ని అభినయించారు.

ధర్మేంద్ర ప్రసాద్ ప్రశ్నకు సమాధానాలు స్పష్టమే: (1) నూతన విద్యా విధానం ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానం మాత్రమే. అది రాజ్యాంగ నిర్దేశితమైనది కాదు; (2) తమిళనాడులో ప్రభుత్వాలు మొదటి నుంచి అనుసరిస్తున్న విధానం ప్రభుత్వ పాఠశాలల్లో రెండు భాషల బోధన, మూడు కాదు. రెండు భాషల బోధన మాత్రమే జరగాలని తమిళనాడు ప్రభుత్వాలే కాకుండా తమిళ పౌర సమాజమూ గట్టిగా కోరుతున్నది. అయితే ప్రైవేట్ పాఠశాలలు మూడో భాషగా హిందీ బోధించడం పట్ల తమిళనాడు ప్రభుత్వాలు ఎప్పుడూ ఎటువంటి అభ్యంతరం తెలుపలేదు. అవరోధమూ కల్పించలేదు.



> త్రిభాషా సూత్రాన్ని అంగీకరించి అమలుపరచాలని తమిళనాడును కేంద్ర ప్రభుత్వం సతాయిస్తోంది. దక్షిణాది రాష్ట్రంపై ఇటువంటి ఒత్తిడి తెచ్చే ముందు కేంద్రం దేశ వ్యాప్తంగా రెండు భాషల (ప్రాంతీయ భాష, ఇంగ్లీషు) బోధనను పరిపూర్ణంగా విజయవంతం చేయాలి. రెండో భాషగా అంగీకృతమైన ఇంగ్లీషును ఉత్కృష్ట ప్రమాణాలతో నేర్పడంలో ఘోరంగా విఫలమయిన ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాలలకు మూడో భాష నేర్పడంలో సంపూర్ణంగా సఫలమయ్యేందుకు ఎందుకు ఆరాటపడుతోంది?

తమిళనాడులో సీబీఎస్‌ఈ (642), ఐసీఎస్‌ఈ (77), ఐబీ(8)కి అనుబంధంగా ఉన్న అన్ని పాఠశాలల్లోను మూడో భాషగా హిందీ బోధిస్తున్నారు. వేలాది బాలలు హిందీ నేర్చుకుంటున్నారు. దక్షిణ్ భారత్ హిందీ ప్రచార్ సభ ఇత్యాది విద్యా సంస్థల ద్వారా లక్షలాది బాలలు హిందీ నేర్చుకోవడానికి తమిళనాడు ప్రభుత్వాలు ఏ విధంగాను అడ్డుపడడం లేదు.

నూతన విద్యా విధానం–2020లో మంచి అంశాలూ ఉన్నాయి, అంగీకారయోగ్యం కాని విషయాలూ ఉన్నాయి. ఎన్‌ఈపీలోని వివాదాస్పద విషయాలలో ఒకటి త్రిభాషా సూత్రం. దీన్ని హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలలో అమలుపరచడం లేదు. అయితే హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలలో ఈ త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు ప్రయత్నిస్తున్నారు, కాదు, అమలు జరిపేలా ఒత్తిడి చేస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాలలలో హిందీ మాత్రమే బోధించే ఏక భాషా విధానాన్ని సార్థకంగా అనుసరిస్తున్నారని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ ఉత్తరాది రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న బాలలు మరే ఇతర భాషను నేర్చుకోవడం లేదు. కారణమేమిటి? ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు కొద్ది మంది మాత్రమే ఉండగా హిందీయేతర భారతీయ భాషలను బోధించే ఉపాధ్యాయులు అసలు లేనేలేరని చెప్పడం సత్య దూరం కాదు. ప్రైవేట్ పాఠశాలలు సైతం సంతోషంగా ప్రభుత్వ పాఠశాలలనే అనుసరిస్తున్నాయి. హిందీ భాషను మాత్రమే బోధిస్తున్నాయి. ఆంగ్ల భాష బోధిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ఉన్నప్పటికీ అవేవీ బాలలకు మూడో భాషను నేర్పడం లేదు. మూడో భాష బోధిస్తున్న పాఠశాలలూ లేకపోలేదు. ఆ మూడో భాష ప్రతి చోటా నిశ్చయంగా సంస్కృతమే. పంజాబ్, గుజరాత్, మహారాష్ట్రలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో భాషగా హిందీ బోధిస్తున్నారు. పంజాబీ, గుజరాతీ, మరాఠీ భాషలకు హిందీ సన్నిహిత బంధుత్వం ఉన్నదనే విషయం అందరికీ తెలిసిందే. సరే, ఈ విషయాలు అలా ఉంచితే ఆంగ్ల భాషా బోధన ప్రమాణాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. నాణ్యత పూర్తిగా కొరవడిన బోధనా పద్ధతులతో మన బాలలు ఆ అంతర్జాతీయ భాషను ప్రశస్తంగా నేర్చుకోవడం ఎలా సాధ్యమవుతుంది? ఇంగ్లీషు బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలలు ఆంగ్ల భాషా తరగతి గది వెలుపల ఆ భాషను ఒక్క ముక్క కూడా మాట్లాడలేరు, చదవలేరు, అర్థం చేసుకోలేరు, రాయలేరు. ఇదొక కఠోర సత్యం. తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాలకూ ఈ సత్యం వర్తిస్తుంది.

త్రిభాషా సూత్రాన్ని అంగీకరించి అమలుపరచాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ సతాయిస్తున్నారు. త్రిభాషా సూత్రం పేరిట మూడో భాషగా హిందీ నేర్పాలన్నదే ఆయన ఉద్దేశం, నిర్దేశం కూడా. దక్షిణాది రాష్ట్రంపై ఇటువంటి ఒత్తిడి తెచ్చే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రెండు భాషల (ప్రాంతీయ భాష, ఇంగ్లీషు) బోధనను పరిపూర్ణంగా విజయవంతం చేయాలి. మన సమాజంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యాలు ప్రశస్తంగా ఉన్నవారు చాలా చాలా తక్కువ. వ్యవహారిక ఇంగ్లీషు మాట్లాడగలిగే వారే తక్కువ కాగా మంచి ఇంగ్లీషు మాట్లాడగలిగేవారు చాలా అరుదు. త్రిభాషా సూత్రం ప్రకారం రెండో భాషగా అంగీకృతమైన ఇంగ్లీషును ఉత్కృష్ట ప్రమాణాలతో బోధింపచేయడంలో ఘోరంగా విఫలమయిన ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాలలకు మూడో భాష నేర్పడంలో సంపూర్ణంగా సఫలమయ్యేందుకు ఎందుకు ఆరాటపడుతోంది?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సిద్ధాంతం వేరు, సైన్స్ వేరు!

మార్క్స్ సిద్ధాంతాన్ని నమ్మి, దానిని సామాన్యులు సైతం సరళంగా అర్థం చేసుకోవడానికి వీలుగా మార్క్స్ రచనలను అనువదించి, కృషి చేసిన వారిలో రంగనాయకమ్మ ప్రథములు. ఎంతటి గొప్ప మేధావులైనా అప్పుడప్పుడూ తడబడతారు. 'కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలు!' (ఫిబ్రవరి 20, -2025) అనే వ్యాసంలో ఇదే జరిగినట్లు అనిపించింది.

కృత్రిమమేధ ఎన్నో పనులు చేస్తూ పెట్టుబడిదారులకు, వ్యాపారులకు లాభాలను గడించి పెడుతుందంటూ ఒక పది రకాల పనులను ఉదాహరించారు రంగనాయకమ్మ. నిజమే, కృత్రిమమేధ అనేది సైన్స్‌కు చెందిన ప్రక్రియ. సైన్స్ ఎప్పుడు కఠినమైన ప్రక్రియలను సరళం చేస్తుంది. మార్క్స్ ఉత్పత్తి — లాభాలు అంశాన్ని మిగులువిలువ సిద్ధాంతం కోణంలో చూసినట్లు మనం సైన్స్‌ను సైన్స్ అప్‌గ్రేడేషన్ కోణంలో చూడాలి. అనేక సిద్ధాంతాలకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాలు వచ్చాయి. కానీ ఉత్పత్తి ప్రక్రియలో మార్క్స్ వెలుగులోకి తెచ్చిన మిగులు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం లేదు, రాదు కూడా. సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం రావచ్చు, రాకపోవచ్చు. సైన్స్‌కు మాత్రం ప్రత్యామ్నాయం ఉండదు, కేవలం అప్‌గ్రేడేషన్ మాత్రమే ఉంటుంది. అలా వచ్చిందే కృత్రిమమేధ.

కృత్రిమమేధపై పెట్టుబడి లాభం రంగనాయకమ్మ కోణంలో చూద్దాం. ఫ్రెంచ్ ఆర్థికవేత్త జెబి సే సూత్రం ప్రకారం— "సప్లయ్ తనకు తానే తన డిమాండ్ సృష్టించుకుంటుంది". ఈ సిద్ధాంతం ప్రకారం పెట్టుబడిదారుల విపరీత లాభాపేక్షతో ఉత్పత్తిలో యాంత్రీకరణ ప్రవేశపెట్టడం వల్ల ఉత్పత్తులు పెరిగి లాభాలు రావాలి. కానీ పారిశ్రామిక చరిత్రలో ఇలా జరగలేదు. యంత్రాల ద్వారా డిమాండ్‌ను మించి మిగులు ఉత్పత్తులు పెరగడంతో అమ్మకాలు లేవు. నష్టాలపాలైన పెట్టుబడిదారులు ఫ్యాక్టరీలను నడపకపోవడం వలన కార్మికులు ఉపాధి కోల్పోయారు. లాభాల ఆశతో విపరీత ఉత్పత్తితో పెట్టుబడిదారులకు లాభాలు వస్తాయనేది కూడా ఒక భ్రమ అని ప్రపంచవ్యాప్తంగా 1928–33 మధ్య వచ్చిన ఆర్థికమాంద్య పరిస్థితులు రుజువు చేసినవి. కార్ల్ మార్క్స్ యాంత్రీకరణ వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికవర్గం పెట్టుబడిదారి వ్యవస్థపై తిరుగుబాటు చేస్తుందన్నారు. యాంత్రీకరణ వలన మిగులు ఉత్పత్తితో నష్టాల పాలైన పెట్టుబడిదారులు, వేతనాలు చెల్లించలేని స్థితిలో కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించినప్పటికీ, ఎక్కడా మార్క్స్ చెప్పినట్టు కార్మికులు తిరుగుబాటు చేయలేదు. ఆనాటి ఆర్థికమాంద్య ఉపద్రవం నుండి పెట్టుబడిదారులను కాపాడి వారికి లాభాల మార్గం చూపి ఆర్థిక వ్యవస్థను బయటపడేయడానికి కృషిచేసిన వారిలో ఆర్థర్ సిసిల్ పిగూ ఒకరు. ఆయన చెప్పిన వేతనాల తగ్గింపు సిద్ధాంతం (వేజ్ కట్ పాలసీ), ఇటు లాభాలను గాని అటు డిమాండ్‌ను కానీ పెంచలేకపోయింది. ఇక్కడ ఆచరణలో జెబి సే, కార్ల్ మార్క్స్ ఆర్థర్ సిసిల్ పిగూ సిద్ధాంతాలు మూడూ విఫలం అయినాయి. ప్రపంచం తీవ్రమైన ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు బ్రిటిష్ ఆర్థికవేత్త జె.ఎమ్. కీన్స్ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం చేసుకొని పని సృష్టించాలని, తద్వారా ప్రజల్లో కొనుగోలుశక్తి పెరిగి వస్తువులకు డిమాండ్ ఏర్పడి పరిశ్రమలు పునఃప్రారంభం అవుతాయని, ఇందుకుగాను ప్రభుత్వాలు రాబడిని మించి వ్యయం చేయాలంటూ లోటుబడ్జెట్ విధానాన్ని సూచించాడు. నేటికీ అనేక దేశాలు రాబడికి మించి వ్యయం చేస్తున్నాయి. ఈ అంశాలను బట్టి ఒక సిద్ధాంతం విఫలమైనప్పుడు నష్టనివారణకు ప్రత్యామ్నాయ సిద్ధాంతం కూడా వస్తుంది అనేది రుజువైంది.



మొత్తం మానవ పరిణామ క్రమమంతా కఠినత్వం నుంచి సరళత్వం వైపు ప్రయాణం మాత్రమే. అందులో భాగమే పెట్టుబడి లాభం. పరిశోధనలన్నీ పెట్టుబడి లేకుండా జరగవు. పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు. ఆశలేకపోతే ప్రగతికి ఆస్కారం లేదు. కృత్రిమమేధ పనితీరు పట్ల అనుమానాలు, భయాలు అర్థరహితం.

భారతదేశంలో వ్యవసాయరంగంలో ట్రాక్టర్ లాంటి యంత్రాల వినియోగం లేకుంటే ఇప్పటి జనాభాకు సరిపడా ఆహారధాన్యాల ఉత్పత్తిలేక సగం మంది ఆకలితో చచ్చిపోయేవారు. జనాభా ఇంతగా పెరిగినా గ్రామాల్లో కూలీల కొరత స్పష్టంగా కనపడుతున్నది. యంత్రీకరణను వ్యతిరేకిస్తూ, శ్రామికులకు పనిలేదని వాపోయేవారు తెలంగాణ పల్లెలను చూస్తే బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుండి వ్యవసాయకూలీల వలసలను గమనించవచ్చు. వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం సృష్టిస్తున్న ఉత్పత్తి ఫలాలు ఎన్నో ఉన్నాయి. మహారాష్ట్రలో బారామతి ప్రాంతంలో మైక్రోసాఫ్ట్ వ్యవసాయ పరిశోధనలు చేస్తున్నది. ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో లేని, నీటిఎద్దడి కలిగిన మారుమూల పల్లెల్లో కృత్రిమమేధను ఉపయోగిస్తూ పంటలకు ఆశిస్తున్న తెగుళ్ళను గుర్తించి సకాలంలో నివారణ చర్యలను చేపట్టి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకొంటున్నారు. జన్యువుల రహస్యం ఛేదించి, కణనిర్మాణం గుట్టును పసిగట్టి, జీనోమ్ మ్యాప్ రూపుదిద్దిన మానవుడు, శిశువు పిండదశలో ఉన్నప్పుడే ఏ జన్యువు లోపంతో ఏ రకమైన వ్యాధులు వస్తాయో గుర్తించి జన్యులోపాలను సరిచేయగలుగుతున్నాడు.

ఇలా సైన్స్ సృష్టించిన అద్భుతాలు ఎన్నెన్నో ఉన్నాయి. సాధారణ మొబైల్ స్థానంలో ఆండ్రాయిడ్ మొబైల్ వచ్చిన తర్వాత వాచ్, కెమెరా, టేప్ రికార్డర్ వంటి ఎన్నో పరికరాల ఉపయోగం తగ్గింది. అంతమాత్రాన ఆండ్రాయిడ్ మొబైల్ నిరుద్యోగం సృష్టిస్తున్నదని దాని వాడకం నిలిపివేయలేం కదా. కృత్రిమమేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ. కేవలం అది ఒక దశ మాత్రమే. మళ్ళీ దానిలో అప్‌గ్రేడేషన్ ఉండనే ఉంటుంది. మొత్తం మానవ పరిణామ క్రమమంతా కఠినత్వం నుంచి సరళత్వం వైపు ప్రయాణం మాత్రమే. అందులో భాగమే పెట్టుబడి లాభం. పరిశోధనలన్నీ పెట్టుబడి లేకుండా జరగవు. పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు. ఆశ లేకపోతే ప్రగతికి ఆస్కారం లేదు. సైన్స్ ఏ వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందనే వాదన అర్థరహితం. సైన్స్ సార్వజనీనమైంది. కృత్రిమమేధ పనితీరు పట్ల అనుమానాలు, భయాలు అర్థరహితం.

• మామిడి నారాయణ
సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించని జమిలి!

దేశంలో జమిలి ఎన్నికలు జరపడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. మాజీ రాష్ట్రపతి కోవింద్ నాయకత్వంలో ఒక కమిటీ వేసి, రిపోర్టు తెప్పించుకుంది. లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టబడి, జేపీసీ పరిశీలనలో ఉంది. బిల్లు ప్రస్తుత రూపంలో న్యాయస్థానాల్లో నిలబడదని, ఎన్నికలు జమిలిగా నిర్వహించే లక్ష్యంతో ఆయా అసెంబ్లీల కాలవ్యవధిని కుదించడమన్నది రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి వ్యతిరేకమని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్ ఇటీవల జేపీసీ ముందు తన అభిప్రాయాన్ని ప్రకటించినట్టుగా వార్తలు వచ్చాయి. ఫెడరల్ వ్యవస్థకు జమిలి ప్రమాదకరమని అనేక రాజకీయ పార్టీలు, సంస్థలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, ఒకే దేశం—ఒకే ఎన్నిక విధానాన్ని ఎలాగైనా అమలులోకి తేవాలన్న కృతనిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

రాజ్యాంగంలో ఐదేళ్ళకు ఒకసారి ఎన్నికలు జరగాలని ఉంది గానీ, ఎన్నికైన ప్రభుత్వం ఐదేళ్ల ఖచ్చితంగా అధికారంలో ఉండాలని ఎక్కడా పేర్కొనలేదు. ఆయా సభల ఆమోదం ఉన్నంత వరకు మాత్రమే ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అధికరణకు అనుగుణంగా రద్దు చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి.

జమిలి ఎన్నికలకై ప్రభుత్వం చేస్తున్న మూడు ప్రధాన వాదనలలో మొదటిది ఎన్నికల ఖర్చు తగ్గుతుందని. మన దేశంలో ఎన్నికల ఖర్చు రెండు రకాలుగా ఉంటోంది. ఒకటి ప్రభుత్వం పెట్టేది, రెండోది రాజకీయ పార్టీలు గానీ, పోటీ చేసే అభ్యర్థులు గానీ పెట్టేది. 2024లో జరిగిన ఎన్నికలలో 98 కోట్ల మంది ఓటర్లు, ఖర్చు సుమారు పది వేల కోట్ల రూపాయలని ఎన్నికల కమిషన్ పేర్కొంది. అంటే ఒక్కో ఓటరుకు ఐదేళ్ళకు వంద, సాలుకు ఇరవై రూపాయల ఖర్చు. జమిలి ఎన్నికల ద్వారా ఏటా ఐదు వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని కోవింద్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక బడ్జెట్ సుమారు రూ.90లక్షల కోట్లు. అంటే ప్రతి ఏటా ఎన్నికలు జరిగినా ఖర్చు మొత్తం బడ్జెట్‌లో 0.0005 శాతం, అంటే వంద రూపాయలలో ఐదు పైసలు. ఇంత స్వల్ప మొత్తాన్ని ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశం ఖర్చు పెట్టలేదనడం సముచితం కాదు. గత సంవత్సరం కార్పొరేట్ల 1.7 లక్షల కోట్ల రూపాయల బ్యాంకు ఋణాలను మోదీ ప్రభుత్వం మాఫీ చేసింది. దానితో పోలిస్తే ఈ ఖర్చు అసలు లెక్కే కాదు. అయినా ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి ఎన్నికలను డబ్బుతో కొలవడం సహేతుకం కూడా కాదు.

అదే సందర్భంలో 2024 ఎన్నికలలో లక్ష కోట్ల రూపాయలకు పైగా వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఖర్చు పెట్టారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే సంస్థ నివేదించింది. అంటే ప్రభుత్వ ఖర్చుకు పది రెట్లకు పైగా పార్టీలు ఖర్చు పెట్టాయి. ఒక్కో పార్లమెంటు అభ్యర్థి కనీసంగా వంద నుండి రెండు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చును వారు రాజకీయ వ్యాపారానికి పెట్టుబడిగా చూస్తున్నారు. ఎన్నికల ఖర్చు ప్రభుత్వానికి నామమాత్రమే గానీ, అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు మాత్రం భారీగానే ఉంటోంది.

> ఎన్నికల సందర్భంలో అనేక మందికి ఉపాధి లభిస్తుంది. లేబర్ డిమాండు అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఇది ఒక రకంగా సంపద పునః పంపిణీ కింద లెక్క. ఎన్నికల ముందు ప్రభుత్వాలు ధరలను పెంచవు. అందువల్ల తరచూ ఎన్నికల వల్ల ప్రజలకు లాభమే. ఏ రకంగా చూసినా జమిలి ఎన్నికల ప్రతిపాదన వెనుక కార్పొరేట్, రాజకీయ ప్రయోజనాలే తప్ప, సామాన్యుల ప్రయోజనాలు కానరావు.



వాస్తవంగా ఎన్నికల సందర్భంలో పార్టీల ప్రచారం, ఇతరత్రా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. లేబర్ డిమాండు అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఇది ఒక రకంగా సంపద పునః పంపిణీ కింద లెక్క. అలాంటప్పుడు సామాన్యులకెందుకు బాధ. ఇంకో రకంగా చూస్తే, ఎన్నికల ముందు ప్రభుత్వాలు ధరలను సాధారణంగా పెంచవు. 2024 ఎన్నికల ముందు మోదీ ప్రభుత్వం గ్యాస్ ధరను రెండు వందల రూపాయలు, పెట్రోల్ ధరను తగ్గించింది. అందువల్ల ఎలా చూసినా తరచూ ఎన్నికల వలన ప్రజలకు లాభమే కానీ నష్టమేమీ కాదు.

ఇక రెండో వాదన ఎన్నికల నియమావళి ప్రజలకు ఇబ్బంది కలగజేస్తోందనేది. వాస్తవంగా ఈ సమయంలో కూడా సాధారణ ప్రజలకు అసౌకర్యం ఏమీ ఏర్పడదు. వారి రోజువారీ జీవితం యథాతథంగానే సాగుతూ ఉంటుంది. ఇక్కడ కూడా ఇబ్బంది అధికార పార్టీలకే. ఎందువల్లనంటే ఎన్నికల ముందు ప్రజలపై భారాలు వేస్తే ఓడిపోతామనే భయంతో ధరలు పెంచడం, సౌకర్యాలను కుదించడం వంటి చర్యలు చేపట్టరు. భారాలకు భిన్నంగా సంక్షేమ చర్యలు సైతం చేబడతారు. దీనివల్ల కూడా ప్రజలకు లాభమే కదా. వాస్తవంగా ప్రతి ఏటా దేశంలో ఏదో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూ ఉంటేనే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయి.

మూడో వాదన ఎన్నికైన ప్రజాప్రతినిధులు తరచూ ఎన్నికల వలన అభివృద్ధిపై దృష్టి పెట్టలేకపోతున్నారన్నది. వాస్తవంగా గెలిచిన మరునాటి నుండే వచ్చే ఎన్నికలలో ఎలా గెలవాలన్నదే ప్రజాప్రతినిధులు ఆలోచిస్తూ ఉంటారు. ప్రజలను మంచి చేసుకుంటూ ఉంటారు. అందువల్ల ఎన్నికలు జరుగుతూ ఉంటేనే అభివృద్ధి చర్యలు చేపడతారు.

అలాగే జమిలి ఎన్నికల ప్రతిపాదనలో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జతచేశారు. మన దేశంలో ప్రజల ప్రాధాన్యతలు వేర్వేరు స్థాయి ఎన్నికలలో వేర్వేరుగా ఉంటాయి. ఉదాహరణకు స్థానిక సంస్థల ఎన్నికలలో వీధిలైట్లు, మంచి నీటి సరఫరా, పౌర సేవలు వంటివి ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక్కడ దేశ సమస్యలు, ఆయా దేశ నాయకుల చరిష్మా వంటివి పని చేయవు. అలాగే అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఆయా రాష్ట్రాలలోని శాంతి భద్రతలు, విద్య, వైద్యం, సంక్షేమం వంటి స్థానిక సమస్యలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. పార్లమెంటు ఎన్నికలలో ఒక పార్టీ గెలిచి, వెంటనే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మరో పార్టీ మహారాష్ట్ర, హర్యానా, కర్నాటక, ఢిల్లీ, కేరళ వంటి రాష్ట్రాలలో గెలవడం దీనికి నిదర్శనం. జమిలి ఎన్నికలలో కేంద్ర రాజకీయాలు ముందుకు వచ్చి, ఆచరణలో ప్రజల ఈ స్థానిక ఆకాంక్షలను ప్రతిబింబించవు. అందువల్ల జమిలి ఎన్నికల వలన మొట్టమొదట నష్టపోయేది ప్రాంతీయ పార్టీలే. దీనివల్ల అధికార కేంద్రీకరణ జరిగి ఫెడరలిజానికి విఘాతం కలుగుతుంది. నియంతృత్వానికి దారితీస్తుంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

వీటికితోడు, దీనికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేసే అంత బలం నేడు మోదీ ప్రభుత్వానికి ఉందా అన్నది ప్రధాన అంశం. రాజ్యాంగ సవరణలు జరగాలంటే పార్లమెంటు ఉభయ సభలలో 2/3 వంతు సభ్యుల ఆమోదం కావాలి. అలాగే సగం రాష్ట్రాలలో సవరణలు అదే రెండొంతుల మెజారిటీతో ఆమోదం పొందాలి. మన లోక్‌సభలో 543 సభ్యులలో 362 మంది సభ్యుల ఆమోదం అవసరం. కానీ ఎన్డీయే కూటమి బలం 293. అంటే 69 తక్కువ. అలాగే రాజ్యసభలో 245 సభ్యులలో ఎన్డీయే బలం 125 మాత్రమే. రాజ్యాంగ సవరణకు ఇంకా 39 మంది సభ్యులు అవసరం. ఈ మద్దతు ప్రభుత్వం ఎలా సంపాదిస్తుంది అన్నది ప్రశ్న.

వీటన్నింటికీ మించి అసలు ఒకేసారి ఎన్నికలు జరపగలిగేంత యంత్రాంగం ఎన్నికల కమిషన్ వద్ద ఉందా అన్నది పెద్ద ప్రశ్న. ఇటీవల వివిధ రాష్ట్రాలకు అనేక దశలలో ఎన్నికలు జరిపినప్పుడు ఒక సమాచారహక్కు ప్రశ్నకు సమాధానమిస్తూ, తమ వద్ద ఒకేసారి ఎన్నికలు జరపగలిగేంత పాలనాపర యంత్రాంగం, సెక్యూరిటీ, లాజిస్టిక్స్ వంటివి లేవని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఒక్క రాష్ట్రంలోనే జరపలేనివారు, ఇక దేశమంతా ఒకేసారి ఎలా జరపగలరు?

ఇలా ఎన్నో అంశాలు, ఆటంకాలు ఉన్నా ఎందుకు మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికల అమలుకు అంత ఆరాటపడుతోందీ అంటే— వారనుకున్నంత స్పీడుగా నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుకు తరచూ ఎన్నికలు అవరోధంగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ అనుకూల విధానాలు వారనుకున్న స్థాయిలో జరగడం లేదు. మతం పేరున ప్రజలను ఎంత రెచ్చగొట్టినా ఎన్నికలలో వారు ఆశించినంత ఫలితాలు రాలేదు. దీనితో ఇప్పుడు మరో కొత్తబాట పట్టారు. ఏ రకంగా చూసినా జమిలి ఎన్నికల ప్రతిపాదన వెనుక కార్పొరేట్, రాజకీయ ప్రయోజనాలే తప్ప, సామాన్యుల ప్రయోజనాలు ఇసుమంత కూడా కానరావు. ప్రభుత్వం ఇస్తున్న 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' వంటి ఆకర్షణీయ నినాదం మాటున ఉన్న అసలు లక్ష్యాలను, ప్రమాదాన్ని ప్రజలు అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

■ ఎ. అజశర్మ



ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు.. ఇప్పుడు ఓరుగల్లు రాజకీయాలను వేడెక్కిస్తోంది. మార్చిలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా.. శాసనసభలో బలాబలాల దృష్ట్యా కాంగ్రెస్ కూటమికి నాలుగు.. బీఆర్ఎస్‌కు ఒకటి దక్కే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి పలువురు ముఖ్యనేతలు మండలిలో అడుగు పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ఎమ్మెల్సీ దంగల్‌లో ఆయా పార్టీల నుంచి ఎవరికి ఆ ఛాన్స్ దక్కుతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే నేతల అధిపత్య పోరుతో అట్టుడుకుతున్న ఓరుగల్లు కాంగ్రెస్‌లో... ఎమ్మెల్సీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న నేతలు ఒకరికి రాకుండా మరొకరు చెక్ పెట్టుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో తొలుత మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శనిగపురం ఇందిరా, మామిండ్ల ఝాన్సీరెడ్డి పేర్లు కాంగ్రెస్ వర్గాల్లో వినిపించాయి. కానీ ఆ తర్వాత అనూహ్యంగా వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య పేర్లు తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. ఇక బీఆర్ఎస్‌కు దక్కే ఒకే ఒక సీటు కోసం మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోందని సమాచారం. ఆయా పార్టీల నుంచి నేతలు ఎవరి ప్రయత్నాల్లో వారుండగా.. ఇటు కుల సమీకరణలు.. అటు రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుని అధినాయకత్వాలు ఎవరికి అవకాశమిస్తాయోనన్న ఉత్కంఠ సర్వత్రా కనిపిస్తోంది.



ఎమ్మెల్సీ దంగల్!

ఎమ్మెల్యే కోటా సీటుపై కన్నేసిన ఓరుగల్లు నేతలు

- కులాల సమీకరణలో మండలిలో అడుగు పెట్టేదెవరో?
- అధికార కాంగ్రెస్‌లోని ముఖ్యుల మధ్య పోటాపోటీ
- ముమ్మర ప్రయత్నాల్లో కొండా మురళి, కొమ్మూరి, ఝాన్సీరెడ్డి, ఇందిర
- అనూహ్యంగా తెరపైకి వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి పేర్లు
- సాంబయ్య పేరును సూచిస్తూ పలువురు ఎమ్మెల్యేల లేఖలు
- బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతికి అవకాశం?
- ఓరుగల్లు రాజకీయాలను వేడెక్కిస్తున్న పెద్దల సీటు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఓ కాంగ్రెస్ నేతకు సీటు దక్కుతుందనే చర్చ ఆపార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఆ ఒక్కరు ఎవరు అనే ఉత్కంఠ కేడర్‌లో నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్ఠానం ఇచ్చిన హమీలు, ఎన్నికల్లో ఓడిపోయిన నేతలు ప్రయత్నాలతో పాటు అనూహ్యంగా కొత్త పేర్లు తెరపైకి రావటంతో కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ సీటు హాట్ హాట్‌గా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి మండలిలో అవకాశం లభిస్తుందనే చర్చ జరుగుతుండగా.. మొదటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న వేం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా తీసుకుని, మంత్రి మండలిలో చోటు కల్పిస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మరొకరికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఇందుకు వేం పేరును పరిశీలిస్తున్నారని సమాచారం. ఇప్పటికే ఎస్టీ, బీసీల నుంచి ఇద్దరు మంత్రులు ఉండగా, ఓసీ సామాజిక వర్గం నుంచి నరేందర్‌రెడ్డిని తీసుకునేందుకు ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వొచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఇక సీనియర్ నేత దొమ్మాటి సాంబయ్య పేరు కూడా ఎమ్మెల్సీ ఆశావాహుల జాబితాలో చేరింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురైదుగురు ఎమ్మెల్యేలు ఇటీవల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలో అప్పటి ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిసి దొమ్మాటికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయటం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొత్తగా వేం నరేందర్‌రెడ్డి, సాంబయ్య పేర్లు తెరపైకి రావటంతో ఏడాదికాలంగా ఎమ్మెల్సీ సీటుపై కన్నేసిన నేతలు మరింత సీరియస్‌గా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీకి గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ సీటుపై హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేం నరేందర్‌రెడ్డికి సీటు ఇస్తే కొండాకు అనుమానమేనన్న చర్చ ఉంది. దీంతో మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలతో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఏఐసీసీలో కీలకమైన నేతలతో సురేఖ ఇటీవల ఢిల్లీ పర్యటనలో మురళీ ఎమ్మెల్సీ సీటుపై గతంలో అధిష్ఠానం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. ఇక పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సైతం ఎమ్మెల్సీ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఓసీ కోటా నుంచి భారీగా క్యూ ఉండటంతో తనకు ఎమ్మెల్సీ సీటు కాదంటే జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో పాటు జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని ఝాన్సీరెడ్డి అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన జనగామ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శనిగపురం ఇందిర పేర్లు కూడా ఎమ్మెల్సీ సీటు ఫైట్‌లో వినిపిస్తున్నాయి.

కులాల సమీకరణలు.. ఆధిపత్య పోరు..

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరుకు తోడు రాష్ట్ర కాంగ్రెస్‌లో కులాల సమీకరణలతో ఎవరికి ఎమ్మెల్సీ సీటు దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీకి ఎమ్మెల్సీ సీటు దక్కకుండా కాంగ్రెస్‌లోని ఓ వర్గం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే కొత్త పేర్లను తెరపైకి తీసుకొచ్చారనే చర్చ ఉంది. ఇది గమనించే మంత్రి కొండా సురేఖ

మిగతా 6వ పేజీలో...



ఎయిర్‌పోర్టుకు.. రైట్ రైట్

ఏఏఐకి కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ లేఖ

- అనుమతుల రాకతో ఇక వేగంగా వరంగల్ విమానాశ్రయ పనులు
- ఇప్పటికే భూసేకరణకు రూ.205కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- 253 ఎకరాల సేకరణకు రైతులతో ప్రభుత్వం చర్చలు
- 150కి.మీల నిబంధన సడలింపుపై ఎన్‌వోసీ ఇచ్చిన హెచ్ఐఏఎల్
- కేంద్ర ప్రభుత్వం వద్ద ఫలించిన రాష్ట్ర సర్కారు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానశ్రాయానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర విమానాయమంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్‌కుమార్ ఝా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) చైర్మన్‌కు శుక్రవారం లేఖ పంపడం, ఎయిర్‌పోర్టుకు ఉన్న ప్రధాన అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలిగిపోతుండటంతో ఓరుగల్లులో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే 253 ఎకరాల భూ సేకరణకు ప్రభుత్వం రూ.205కోట్ల నిధులు విడుదల చేసింది. 150కి.మీల నిబంధన సడలింపుపై హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (హెచ్ఐఏఎల్) నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ సానుకూల అంశాల నేపథ్యంలో ఇక వరంగల్‌లో విమానం ఎగరటం పక్కా అనే చర్చ జరుగుతోంది.

వరంగల్ ఎయిర్‌పోర్టుకు సై

2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్(ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే,

మిగతా 6వ పేజీలో...





మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆస్ట్రోలిస్ ఈవెంట్‌లో విద్యార్థుల ప్రదర్శన



నిట్ ఆడిటోరియంలో స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, నిట్ అధికారులు

జీవితం ఒక ఆట.. ఆడుతూనే ఉండాలి..

- చదువుకు పేదరికం అడ్డు కారాదు
- గొప్పవాళ్లంతా పేదరికాన్ని జయించినవారే
- గమ్యాన్నే కాదు.. మార్గాన్నీ ప్రేమించాలి
- మంచి ఆలోచనలు, పనుల్లోనే దేవుడున్నాడు
- ప్రముఖ సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం
- వరంగల్ నిట్ స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభానికి హాజరు
- జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలకు శ్రీకారం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

7



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించిన సీఎస్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణతో పాటు ఎల్ఆర్ఎస్‌పై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీ నుంచి జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేయగా ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 4,967, ఒకేషనల్ 848 విద్యార్థులు మొత్తం 5,815 విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5,739, ఒకేషనల్ 767 మొత్తం 6,506 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 9240205555 ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీవో విజయలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, విద్యుత్, ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజా ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కాజీపేట ఆర్‌వోబీ పనుల పరిశీలన

కాజీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో సీఎం సహకారంతో పశ్చిమ నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. పనులలో జరుగుతున్న జాప్యాన్ని పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రావాల్సిన మెటీరియల్ ఆలస్యం కావడంతో పనులు వేగవంతం కావడం లేదని కాంట్రాక్టర్ తెలపడంతో విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానన్నారు. త్వరలోనే బ్రిడ్జి అందుబాటులోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే కాజీపేట బస్‌స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని, రైల్వే శాఖ నుంచి అనుమతులు రాగానే పనులు వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన ఏడాది కాలంలో పశ్చిమ నియోజకవర్గంలో ఎలాంటి భూకబ్జాలు, అల్లర్లు లేవని, అభివృద్ధి పనులు సాఫీగా సాగుతున్నాయన్నారు. అయితే గిట్టని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చెందుతున్నాయని ఎద్దేవా చేశారు. సొంత పార్టీలో ఉంటూ పార్టీ ప్రతిష్ఠకు వ్యతిరేకంగా పని చేస్తున్న వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధికి సహకరించాల్సిన బాధ్యత మరిచి ప్రభుత్వంపై, పార్టీపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. పార్టీకి నష్టం వాటిల్లే పరిస్థితి వస్తే.. అటువంటి వారిని జిల్లా అధ్యక్షుడిగా సస్పెండ్ చేయడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవిందర్‌యాదవ్, అంకూస్, మనోహర్, రజాలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఇండో అమెరికన్ ఇంపాక్ట్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి రవి
- భారత, అమెరికా వ్యాపార సంబంధాలపై అవగాహన సదస్సు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార, వాణిజ్య రంగాలలో యువత రాణించాలని, ఇందుకు అందుబాటులో ఉన్న వసతులను వినియోగించుకోవాలని ఇండో అమెరికన్ ఇంపాక్ట్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి రవి సూచించారు. గురువారం రాత్రి వరంగల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో భారత్ అమెరికా వ్యాపార సంబంధాల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా కౌన్సిల్ జనరల్ ఆఫ్ అమెరికా ఇన్ ఇండియా మిస్ జెన్నీఫర్ లారెన్స్, ఇండో అమెరికన్ ఇంపాక్ట్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పులి రవి మాట్లాడుతూ.. పస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్నిరంగాల్లో పోటీతత్వం ఉందన్నారు. మన దేశ యువత అమెరికాలో విద్య అభ్యసించి అక్కడే ఉపాధి పొందుతున్నారని అన్నారు. అయితే మన దేశ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి, అక్కడి నాణ్యమైన ఉత్పత్తులను మన దేశానికి దిగుమతి చేయడానికి యువత కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, రవాణా ఇతర రంగాలలో అభివృద్ధి జరుగుతోందని, ముఖ్యంగా వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ వస్తోందని, అంతర్జాతీయ హోటల్ రంగం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు.

తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాపార, పర్యాటక, వైద్య, నిర్మాణ, పరిశ్రమల రంగాలలో అమెరికాతో పాటు ఇతర దేశాలతో భాగస్వాములై తమ వ్యాపారాలను విస్తరించుకోవాలని కోరారు. ఇందుకోసం అమెరికా రాయబార కార్యాలయ ప్రతినిధులు, ఇండో అమెరికన్ ఇంపాక్ట్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి రవి సేవలను వినియోగించుకోవాలని సదస్సుకు హాజరైన వ్యాపారులకు సూచించారు.

కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కోశాధికారి అల్లె సంపత్, కాటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్ కుమార్, గ్రౌండ్‌నట్ టర్మరిక్ సెక్షన్ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ గంటా రాంరెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్, ఆదిత్య హాస్పిటల్ ఎండి. రాకేష్‌రెడ్డితో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దంగల్!

(5వ పేజీ తరువాయి)

ఏఐసీసీ స్థాయిలో ఎమ్మెల్సీ సీటుపై ఒత్తిడి తీసుకవస్తున్నారనే చర్చ జరుగుతుంది. కొండా మురళీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత వి.హనుమంతరావు సైతం ఎమ్మెల్సీ బరిలో ఉన్నారని, అలాగే మాజీ ఎంపీ మధు యాష్కీ కూడా బీసీ కోటాపై కన్నేసినట్టుగా తెలుస్తోంది. అలాగే గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారినా పార్టీ కోసం సాంబయ్య పని చేశారనే అభిప్రాయం పార్టీలో ఉంది. దీంతో సాంబయ్యకు ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేల విజ్ఞప్తి చేసినా ఎస్సీ సామాజిక వర్గం నుంచి అద్దంకి దయాకర్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ పోటీలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినవారికి ఈసారి ఎమ్మెల్సీ ఇవ్వొద్దని అధిష్ఠానం షరతు పెట్టినట్టుగా పార్టీలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరితో పాటు ఇందిరాలకు అవకాశాలు దక్కేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఓసీ సామాజిక వర్గం నుంచి మాత్రం సీఎంకు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ సీటు దక్కేందుకు ఎలాంటి అవరోధాలు లేకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా కులాల సమీకరణలు ఎవరికి కలిసి వస్తాయో.. కాంగ్రెస్‌లో ఏ నేతను ఎమ్మెల్సీ సీటు వరిస్తుందో అనే ఉత్కంఠ శ్రేణుల్లో నెలకొంది.

గులాబీ ఎమ్మెల్సీ ఎవరో..?

ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానం మాత్రం బీఆర్‌ఎస్‌కు పక్కాగా దక్కే అవకాశాలున్నాయి. రెండో స్థానానికి కావాల్సిన ఎమ్మెల్యేల బలం లేకపోవటంతో దక్కే ఒక్క సీటు ఎవరికి అనేది పార్టీలో ఆసక్తికరంగా మారింది. అయితే ఇటీవలే మండలి విప్‌గా డోర్నకల్‌కు చెందిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌ను కేసీఆర్ నియమించారు. పదవీకాలం పూర్తవుతున్న సమయంలో సత్యవతిని విప్‌గా నియామించారంటేనే.. మరోసారి ఆమెకే ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వనున్నట్లుగా పార్టీ సంకేతాకాలు ఇచ్చిందనే చర్చ జరుగుతోంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎదురవుతున్న సవాళ్లను గట్టిగాఎదుర్కొని ప్రజల్లో తిరుగుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎమ్మెల్సీ సీటు ఇవ్వొచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఎర్రబెల్లి అయితేనే మండలిలో పార్టీ వాణిని బలంగా వినిపించే అవకాశం ఉంటుందని, అధిష్ఠానం దయాకర్‌రావు వైపే మొగ్గు చూపుతుందనే చర్చ గులాబీ పార్టీలో ఉంది. మొత్తానికి ఎమ్మెల్సీ సీటు ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లో హాట్‌హాట్‌గా మారింది.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- హైదరాబాద్‌లో పారిశ్రామిక వేత్త రౌండ్ టేబుల్ సమావేశం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన కార్యాచరణను రూపొందించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. శుక్రవారం ఐటీ శాఖామంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో హైద్రాబాద్‌లోని ఇండస్ట్రీస్ భవనంలో జరిగిన మైక్రో, స్మాల్ అండ్ మీడియం పారిశ్రా వికవేత్తల పాలసీలపై రాష్ట్రానికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో పాటుగా పారిశ్రామిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 9 అంశాలు రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు లోబడి అమలుకు అనుకూలంగా ఉన్నాయని వాటన్నింటికి ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించారు. తెలంగాణతో పోలిస్తే కర్ణాటకలో అమలు చేస్తున్న పాలసీలు బాగున్నాయని అదే తరహాలో తెలంగాణలో అమలు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించా రు. టీ ప్రైడ్ ద్వారా 2016 నుంచి చాలామంది ఎస్సీ, ఎస్టీల యువకులు జేసీబీలు, కార్లు, ట్రాక్టర్లు, చిన్న చిన్న పరిశ్రమలను స్థాపించి సబ్సిడీ అందక తీవ్రంగా నష్టపోయారని సూచించారు. ఎంఎస్‌ఎంఈ స్కీం ద్వారా ప్రస్తుతం కోటి మంది మహిళలకు కేవలం రూ. 1.20 కోట్లు మాత్రమే సబ్సిడీ ఉందని దాన్ని రూ.20కోట్లకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్, డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువకులు స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉండటమే కాకుండా వాటిలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా హుజూరాబాద్‌లో డెయిరీ ఏర్పాటుకు ఒక్కో యూనిట్‌కు రూ.10లక్షల లెక్కన 10వేల యూనిట్లను ఏర్పాటు చేసిందన్నారు. ఒక్కో యూనిట్‌కు 10గేదెల లెక్కన లక్ష గేదెలు వచ్చాయని అయితే వాటికి అవసరమైన వసతులు, మార్కెటింగ్ వ్యవస్థ, పశువైద్య వ్యవస్థను ఏర్పాటుపై దృష్టి సారించకపోవడం వల్ల ప్రస్తుతం 10వేల గేదెలు కూడా లేకపోయాయన్నారు. ఈవిషయాన్ని అప్పట్లో అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగడం వల్ల ఎస్సీ, ఎస్టీలు ఎలాంటి ప్రయోజనం పొందకుండా నష్టపోయారన్నారు. రాష్ట్రంలో లిడ్ క్యాప్‌ను పునరుద్ధరించాల్సిన అవశ్యకత ఉందని, తాను సోషల్ వెల్ఫేర్ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు మెగా మధ్యతరహా లెదర్ పార్కుల అభివృద్ధికి కృషి చేసినట్లు రౌండ్ టేబుల్ సమావేశంలో తెలిపారు. రాష్ట్రంలో లెదర్ పార్కులకు అవసరమైన భూములు భవనాలు ఉన్నాయని వాటిని కాపాడుకోవడంతో పాటుగా లెదర్ పార్క్ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేశ ప్రగతిలో సైన్స్‌దే కీలక పాత్ర

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ప్రగతిలో సైన్స్‌దే కీలకపాత్ర అని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కేయూ సెనెట్ హాల్‌లో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం ప్రపంచానికి అనేక మంది శాస్త్రవేత్తలను అందించిందన్నారు. ఆర్యభట్ట, వరహమిర, భాస్కర, చరక లాంటి శాస్త్రవేత్తలు ఉన్నారని పేర్కొన్నారు. సీవీ రామన్ నోబుల్ పురస్కారాన్ని సాధించారని వివరించారు. ఉత్సుకతతో ఏదైనా సాధించవచ్చునని పునరుద్ఘాటించారు. అందుబాటులో ఉన్న వనరులతో గొప్ప సమాజహిత పరిశోధనలు చేశారని తెలిపారు.

హైదరాబాద్ సిమెట్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఆర్ మునిరత్నం మాట్లాడుతూ.. తక్కువ ఖర్చు, దేశీయ టెక్నాలజీతో సమాజానికి ఉపయోగపడే నూతన అవిష్కరణలు చేయవచ్చునని సూచించారు. పిన్నిస్‌లాంటి చిన్న వస్తువులు మొదలుకుని అనేకం సృజనతోనే వచ్చాయన్నారు. దేశంలో 120 యూనికార్న్ కంపెనీలు, స్టార్టప్‌లున్నాయని వివరించారు. యువ పరిశోధకులు పరిశోధనపై స్వాట్ ఎనాలసిస్ చేయాలని అన్నారు. దేశీయంగా అనేక ఆవిష్కరణలు జరిగాయన్నారు. పరిశోధన సామర్థ్యాలను పెంచుకుంటే అవకాశాలు అనేకంగా వస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్‌ఐ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ పి.సెంథల్‌కుమార్ మాట్లాడుతూ.. ఖగోళశాస్త్రంపై ఎన్నో నూతన అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. గ్రహాల కదలిక, నివాసయోగ్యత, వాతావరణంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. భూమిపై మానవ మనగడ సాధ్యమన్నారు. భూమిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం బహుమతులు అందచేసి అభినందించారు. ఈ సదస్సులో డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, సదస్సు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమతలు మాట్లాడారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ భారవీశర్మ స్వాగతం పలుకగా, పీఆర్‌ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేశారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ కె.అనితారెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, షమిత, మంజుల, పద్మజ, సీజే శ్రీలత, కనీజ్ ఫాతిమా, సుజాత, టి. శాస్త్రి, డాక్టర్ శ్రీనివాస్ ముంజం తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సైన్స్‌డేలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం తదితరులు

7వ తేదీ నుంచి పలు రైళ్ల రద్దు

డోర్నకల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీ నుంచి 13 వరకు గొల్కొండ, కాకతీయ, సింగరేణి, ప్యాసింజర్ రైళ్లను, ఇంటర్‌సిటీ, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తిరుపతి నుంచి బిలాస్‌పూర్ 9న, బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు వెల్లడించింది. అలాగే మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో మూడోలైన్‌నిర్మాణం, విద్యుదీకరణ కారణంగా 9నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్ వైపువెళ్లే మణుగూరు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్, గౌతమి ఎక్స్‌ప్రెస్, సింహపురి ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, కృష్ణా ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్- నాగర్‌సోల్, చెన్నై ఎక్స్‌ప్రెస్, అండమాన్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, లక్నో ఎక్స్‌ప్రెస్, ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌లను మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ రైళ్లన్నింటికీ డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 12, 13 తేదీల్లో విజయవాడ వైపు వెళ్లే మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉన్న ప్రతీ రైలును డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

డీసీసీబీని సందర్శించిన నాబార్డ్ అధికారులు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాబార్డు హెడ్ ఆఫీస్ ముంబయి జీఎం రమేశ్‌బాబు, మేనేజర్ హరిహరన్, నాబార్డు డీడీఎం చంద్రశేఖర్, రవి, అధికారులు శుక్రవారం డీసీసీబీ బ్యాంకును సందర్శించారు. బ్యాంక్ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంక్‌కు సంబంధించిన ఐదు సొసైటీలు పీఏసీఎస్ నందనం, నర్సంపేట, ధన్నసరి, మహబూబాబాద్, నల్లబెల్లిలను సందర్శించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి కోసం పాక్స్ ఆక్సిలేటర్ ప్రోగ్రామ్ నాబార్డు తీసుకువచ్చిందని, ప్రోగ్రామ్ ప్రాముఖ్యతను వివరించారు. బిజినెస్ యాక్టివిటీస్, రుణమంజూరు, డిపాజిట్స్ సేకరణ, ఎంఎస్‌సీ కొత్త యాక్టివిటీస్ గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. సొసైటీ ఫంక్షన్ హాల్, మార్ట్‌ని సందర్శించి సొసైటీ బిజినెస్ అభివృద్ధి కోసం సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుతో సమావేశమైన అధికారులు

ఎయిర్‌పోర్టుకు.. రైట్ రైట్!

5వ పేజీ తరువాయి

సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరోసారి గత ఏప్రిల్ నెలలో ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు సాయిల్ టెస్టింగ్ నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమారు రెండు వారాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇటీవలే ఈ సర్వేల రిజల్టు కూడా ఏఏఐ విడుదల చేసింది. వరంగల్ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపేందుకు అనుకూలంగా ఉందని సర్వే రిపోర్టులు రావటంతో ఆ దిశగా ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఏఏఐ అధికారులు ఫోకస్ చేస్తున్నారు. ప్రస్తుతం మామునూరులో ఉన్న పాత 1.8 కి.మీ రన్‌వేను ఇటీవల ఏఏఐ అధికారులు పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. విగతా 253 ఎకరాల భూమిని కేటాయిస్తే ఎయిర్ బస్‌లను నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు.

తొలగిన అడ్డంకులు.. కేంద్రం గ్రీన్‌సిగ్నల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి పెట్టింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగి అడ్డంకిగా ఉన్న 150కిలోమీటర్ల నిబంధనపై హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (హెచ్ఐఏఎల్)తో చర్చించారు. ఈ క్రమంలో హెఐఏఎల్ నుంచి 150కిలో మీటర్ల నిబంధనపై నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌వోసీ)ఇప్పించారు. ఇక ఇప్పటికే 669ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉండగా.. ఇప్పుడున్న రన్‌వేను విస్తరించటంతో పాటు టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్టుమెంట్, ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టేందుకు ఎయిర్‌పోర్టుకు మరో 253 ఎకరాల భూమి అవసరంగా ఏఏఐ గుర్తించింది. దీంతో ఎయిర్‌పోర్టుకు భూసేకరణ కోసం ప్రభుత్వం గత నవంబరులో రూ205 కోట్లు కేటాయించింది. ఇప్పటికే జిల్లా రెవెన్యూ అధికారులు ఎయిర్‌పోర్టు భూసేకరణ కోసం రైతులతో సంప్రదింపులు జరపగా.. సమస్య ఓ కొలిక్కి వస్తోంది. ఈ రెండు అంశాలను కేంద్ర విమానాయ మంత్రిత్వశాఖకు ఏఏఐ నివేదిక ద్వారా తెలియజేసింది. దీంతో వరంగల్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే వరంగల్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి సుమారు రూ. 450కోట్ల వరకు నిధులు అవసరంగా అంచనా వేస్తున్నారు. ఈ మొత్తాన్ని కూడా కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. వరంగల్‌ఎయిర్ పోర్టు త్వరగాపూర్తయితే తెలంగాణకు రెండోవిమానాశ్రయం ఏర్పడినట్టవుతుంది.

ఫలించిన ప్రభుత్వ ప్రయత్నాలు..

వరంగల్‌లో ఎయిర్‌పోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో పదేళ్లుగా హెచ్ఐఏఎల్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించటంలో విఫలం కావటంతో వరంగల్ ఎయిర్ పోర్టుకు అడుగులు ముందుకు పడలేదనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా భూసేకరణ కోసం ఏఏఐ పలుమార్లు గత ప్రభుత్వానికి లేఖలు రాసింది. అయితే ప్రభుత్వ భూమితో పాటు రైతుల నుంచి భూసేకరణ చేయాల్సి ఉండగా, గత ప్రభుత్వం ఎయిర్‌పోర్టు భూసేకరణపై చేసిన ప్రయత్నాలు ఫలించకపోవటంతో మూడు దశాబ్దాల గగనయానం ఓరుగల్లువాసులకు కలగానే విగులుతూ వచ్చింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ ఎయిర్ పోర్టు ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 253 ఎకరాల భూసేకరణకు రూ.205కోట్లు కేటాయించారు. అంతేకాకుండా కేంద్ర విమానాయశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసి తెలంగాణలో కొత్తగా ఆరు ఎయిర్‌పోర్టుల అవసరంపై వివరించటంతో పాటు వరంగల్‌లో అన్ని అర్హతలు ఉన్న ఎయిర్‌పోర్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం వరంగల్ ఎయిర్ పోర్టుపై ఏఏఐ నివేదికలను పరిశీలించి శుక్రవారం అనుమతులు మంజూరు చేసింది.

ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్‌పై హర్షం

మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఎంపీ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి గతంలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖకు లేఖలు అందచేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఎయిర్‌పోర్టు కోసం, ఇందుకున్న అడ్డంకులు తొలగించడంలో సీఎం చర్యలు తీసుకున్నారన్నారు.ఎయిర్ పోర్టు భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు.



వడ్లకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన అన్నదాత

- ఎండిన వరి కర్రలతో రాస్తారోకో
- జనగామ మండలం వడ్లకొండలో ఘటన

జనగామరూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాల ద్వారా పంట పొలాలకు నీరు అందించాలని రైతులు ఎల్లబోయిన హరీశ్, నామాల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా జనగామ మండలంలోని వడ్లకొండ రైతులు ఎండిపోయిన వరి కర్రలతో శుక్రవారం జనగామ-నర్మెట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూగర్భ జలాల రోజు రోజుకూ అడుగంటుతుండడంతో బోరుబావుల్లో నీళ్లు లేక యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంట పొలాల ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతి కొచ్చే దశలో పంట పొలాలకు నీరు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం స్పందించి బొమ్మకూర్ రిజర్వాయర్ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నీరు లేక ఎండిన పంట పొలాలను పశువులకు మేతగా వదిలిపెట్టే పరిస్థితి నెలకొందన్నారు. పంటలు ఎండిపోవడంతో పెట్టుబడి మీదపడి రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప తమకు మరో దిక్కు లేదన్నారు. కార్యక్రమంలో నామాల భాస్కర్, కాసర్ల అశోక్ పాల్గొన్నారు.

ఎండితున్న వరి చేలను కాపాడాలి

ఎండితున్న వరి పంటలను కాపాడి రైతులను అందుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శుక్రవారం వడ్లకొండలో ఎండిన పంటను పరిశీలించారు. రాజారెడ్డి మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు రైతుల సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. అధికారుల సమన్వయ లోపంతో పంట పొలాలు ఎండి పోతున్నాయన్నారు. కార్యక్రమంలో మోటి శ్రీశైలం, ఆది సాయన్న, సొప్పరి సోమయ్య, బెదిగం చంద్రయ్య, కృష్ణ పాల్గొన్నారు.

పంచకళ సంస్థ హ్యాండీ క్రాఫ్ట్స్‌కు రెండు రాష్ట్ర అవార్డులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన పంచకళ హస్త కళల సంస్థకు రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు దక్కాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర హస్త కళా కార్పొరేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థకు చెందిన ఎడ్ల సుజాత, నీరటి మేరీ బాబీ లేస్, క్రాస్ స్టిచ్ అంశాల్లో రాష్ట్ర వ్యవసాయ, టెక్స్‌టైల్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా పంచకళ సంస్థ కార్మి కుల సంఘంఅధ్యక్షుడు జె.ప్రసాద్ మాట్లాడారు. గతంలో కూడా సంస్థకు 13అవార్డులు దక్కాయని, ఇప్పుడు 2 అవార్డులు గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కొన్ని వేల మందికి చేతి వృత్తుల ను నేర్పించిన ఫాదర్ కొలంబో చలవ వల్లనే కార్మికులు రాణిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎండీ శైలజా రామయ్యార్, నాబార్డ్ జీఎం బి.ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల నుంచి అవార్డు అందుకుంటున్న సుజాత



రంజాన్ కా.. మహినా ఆగయా..

రేపటి నుంచి ఉపవాస దీక్షలు షురూ

- ఉమ్మడి జిల్లాలో ముస్తాబవుతున్న మస్జీద్‌లు
- మనో నిగ్రహానికి ప్రతీక ఈ మాసమే..
- ఎన్నో ప్రత్యేకతలతో ఆధ్యాత్మికత పెంపు

మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : యావత్ ముస్లింలు భక్తిశ్రద్ధలతో కఠోర నియమాలతో చేపట్టే ఉపవాస దీక్షల రంజాన్ మాసం మార్చి 2 నుంచి ఆరంభమవుతోంది. లూనార్ ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ముస్లింలు ఈ పండుగను నిర్ణయించుకుంటారు. ఆ క్రమంలోనే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ముస్లింలు శనివారం నెలవంక దర్శనం చేసుకుని, రాత్రి మసీద్‌లో తరావీహ్‌నమాజ్‌ల ద్వారా రంజాన్ ఉపవాస దీక్షల మాసాన్ని ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించుకోనున్నారు. పండుగ ఆరంభాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మసీద్‌లను రంగులు, విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబవుతున్నాయి. ఏటేటా మాసం తగ్గుతూ వివిధ రుతువులను సృషిస్తూ వచ్చే రంజాన్ మాసం ఈ సారి మండుటెండల మార్చి ఆరంభం 2వ తేదీ నుంచి మొదలవుతుంది. అయినా అంతా అల్లాహ్‌పై భారం వేసుకుని లాలాజలాన్ని కూడా మింగకుండా కఠోర దీక్షతో సూర్యోదయానికి ముందే ఆరంభించే ఉపవాస దీక్షలకు అంతా సన్నద్ధమైపోయారు.

కఠోర ఉపవాస దీక్షలు

ముస్లిం సోదరులు వయో, లింగబేధాలు లేకుండా పాటించే రంజాన్ మాసంలోని కఠోర ఉపవాస దీక్షల వెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. సూర్యోదయానికి ముందే తెల్లవారుజామున నిర్దీత వేళలో సహర్ పేరిట భోజనం ముగించుకుని అప్పట్నుంచే ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. తిరిగి సూర్యాస్తమయం అయ్యాక సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్షను డ్రైఫ్రూట్ లేదా పండ్లు, ఫలాలతో విరమిస్తారు. ఆపై యథావిధిగా భోజనం తీసుకుంటారు. దీక్షా సమయంలో కఠోర నియమాలు పాటించడంతో పాటు ప్రతిరోజు నిత్యం ఐదుసార్లు నమాజ్ చేయడం అనవాయితీగా కొనసాగిస్తారు. ప్రతీ సెకను కూడా అల్లాహ్ నామస్మరణతో తమ విధుల నిర్వహణల్లో నిమగ్నమవుతారు. చంద్ర దర్శనాన్ని బట్టి ఈ మాసం 29 లేక 30 రోజుల పాటు కొనసాగుతుంది.

పండుగ మాసంలో మనో నిగ్రహం..

రంజాన్ పండుగ మాసానికి వెనుక విశిష్ట ప్రాధాన్యత ఉంది. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ నెల రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపచేయడం ద్వారా ఆత్మప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్ష 'రోజా'ను అరబిక్ భాషలో 'సౌమ్', 'సియామ్' అని అంటారు. సౌమ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని 'సాయమ్' అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వ సమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ప్రవక్త హజ్రత్ మహ్మద్ ఖర్జూరం పళ్లతోనే ఉపవాస దీక్ష విరమించేవారని విశ్వసించే ముస్లింలు రంజాన్‌లో ఆచరిస్తారు. దివ్య ఖుర్ఆన్ అవతరించిన ఈ మాసంలోనే హజ్రత్ దావూద్ అలైకు జబూర్ గ్రంథం, హజ్రత్ మూసా అలైకు తౌరాత్ గ్రంథం, హజ్రత్ ఈసా అలైకు బైబిల్ గ్రంథం ప్రసాదించబడిందని నమ్ముతారు.

ఉపవాసాలతో ఆరోగ్యం కూడా..

రమజాన్ మాసంలో ఉపవాస దీక్షలు దైవ భక్తికోసమే కాకుండా ఆరోగ్య రీత్యా కూడా మేలైనదని వైద్య శాస్త్రం పేర్కొంటోంది. ఉపవాస దీక్షలో పగలంతా ఆహారం తీసుకోకపోవడం వల్ల కొంతకాలం జీర్ణవ్యవస్థకు విశ్రాంతి లభించి జీర్ణక్రియ క్రమబద్ధీకరించబడుతుంది. మితహారానికి అలవాటు పడడంతో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఉపవాస దీక్ష నిత్య జీవితంలో క్రమశిక్షణాయుత జీవన శైలిని అలవాటు చేస్తుంది. పగలంతా కనీసం నీరు కూడా తాగకపోవడం వల్ల శరీరంలోని వివిధ రసాల ఉత్పత్తి క్రమబద్ధీకరించబడుతుంది. స్వీయ క్రమశిక్షణ, మార్గదర్శకం, డైట్ కంట్రోల్‌కు మూలం. తగిన మోతాదులో ఫలాలు, మాంసకృత్తులు తీసుకోవచ్చు. ఉపవాసదీక్ష వల్ల రక్తపోటు కొలస్ట్రాల్ తగ్గిస్తుందని వైద్య పరిశోధనల్లో తేలింది. బాహ్య సంబంధమైన అంశాలతో పాటు అంతరంగిక మనసు ప్రశాంతంగా ఉంటుంది. సూక్ష్మ గ్రాహ్యమైన బుద్ధి అభివృద్ధి చెందుతుంది. ఇంద్రీయ వాంచనలను అదుపులో పెట్టుకున్న కారణంగా మృదువుగా మాట్లాడడం, దురలవాట్లకు, ఘర్షణలకు దూరంగా ఉండడం, నేర ప్రవృత్తి తగ్గించడం సాధ్యమవుతుంది. రాత్రివేళ తరావీహ్ నమాజ్ చేయడం వల్ల ఒక్కొక్క రకాత్‌కు పది క్యాలరీల శక్తి ఉత్పన్నమై, ఆహారం జీర్ణమై సంపూర్ణ శక్తిగా మారుతుంది. కీళ్ల కదలిక మంచి వ్యాయామంగా ఉపకరిస్తుంది. బ్లడ్ షుగర్ ఉన్నవారు వైద్యుల పర్యవేక్షణలో ఉపవాస నెలలో ఒకటి రెండు సార్లు రక్త పరీక్ష చేయించుకుంటే ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్ పరిమాణం తెలుస్తుంది. రాండమ్ బ్లడ్ గ్లూకోజ్ పరీక్షలో గ్లూకోజ్ పరిమాణం 70 ఎంజి శాతం ఎక్కువగా ఉంటే ఉపవాసం ఉండవచ్చు. తక్కువగా ఉంటే అపవాసం కొనసాగించవద్దని వైద్యులు చెబుతారు.



ఈ నెలలో ప్రత్యేకతలివే..

రంజాన్ మాసంలో సహృదయంతో దైవభక్తి ఒక సత్కార్యం చేసే వ్యక్తికి ఇతర మాసాల్లో చేసిన విధి (ఫరజ్)కి వచ్చే పుణ్యఫలం లభిస్తుంది. ఒక విధిని నిర్వహిస్తే ప్రతిఫలంగా దేవుడు ఇతర మాసాల్లో లభించే 70 విధులకు సమానమైన పుణ్యఫలాలను ప్రసాదిస్తాడంటారు. దివ్య ఖుర్ఆన్ ఈ మాసంలోనే అవతరించింది. హజ్రత్ దావూద్ అలై సలాంకు ఈ మాసంలోనే జబూర్ గ్రంథం ఇవ్వబడింది. హజ్రత్ మూసా అలైసలాంకు తౌరాత్ గ్రంథం ప్రసాదించబడింది. హజ్రత్ ఈసా అలై సలాంకు బైబిల్ గ్రంథం ప్రసాదించబడింది. హజ్రత్ జిబ్రాయిల్ అలై సలాంకు ప్రతీ సంవత్సరం ఈ మాసంలోనే మహా ప్రవక్తకు దివ్య ఖుర్ ఆన్ సంపూర్ణంగా వినిపించే వారు. ఉపవాసాలు (రోజా) విధిగా నిర్వహించబడ్డాయి. రంజాన్ ఆరంభం కాగానే 'తరావీహ్' నమాజ్ ఆదేశించబడింది. వేయి రాత్రులకంటే పుణ్య ప్రదమైన రాత్రి 'లైలతుల్ ఖద్ర్' ఈ మాసంలోనే ఉంది. ఆర్థిక ఆరాధనైన 'జకాత్' చెల్లించడం. నిరుపేదల హక్కు అయిన 'ఫిత్రా' చెల్లించడం. దైవ ప్రసన్నత చూరగొనే మౌనవ్రతం (ఏతెకాఫ్) పాటించడం. మహాప్రవక్తకు రమజాన్ మాసం 21వ తేదీన ప్రవక్త పదవి లభించింది. దివ్య ఖుర్ఆన్‌లోని బఖరా సూరాలోని తొలి ఐదు ఆయతులు ఆవతరించాయి. మొట్టమొదటిదైన బదర్ యుద్ధం ఈనెలలోనే జరిగింది.

రంజాన్ మాసం ప్రత్యేకత ఉపవాస దీక్ష



యావత్ ప్రపంచ ముస్లింలకు అత్యంత పవిత్రమాసం రంజాన్. ఈ మాసంలోనే మహ్మద్ ప్రవక్త పేరిట ఖురాన్ అవతరించింది, అందుకే రంజాన్ నెలకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుని ఉంటుంది. నెలవంక దర్శనాన్ని బట్టి 29 లేదా 30 రోజుల పాటు ముస్లింలంతా ఉపవాస దీక్షలు (రోజా) చేస్తారు. ఈ దీక్షలతో నిరుపేదల ఆకలి బాధలు తెలుస్తాయి. సుమారు 15 గంటలు చుక్క నీరు ముట్టకుండా ఉపవాసదీక్షల్లో ఉంటాం. అల్లా అన్ని చూస్తుంటారని విశ్వసిస్తాం.

- మౌలానా సయిుద్ అహ్మద్ రిజ్వీ, మత పెద్ద, మహబూబాబాద్

క్షమార్హగుణం నేర్పేదే రంజాన్



ఆ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది అనే శత్రువుల మధ్య కూడా క్షమార్హ గుణం నేర్పేదే రంజాన్ మాసం. ఈ నెలలోనే ఎవరైనా ఆ శత్రుత్వాన్ని వీడి స్నేహ సౌభ్రాతుత్వాన్ని ఆస్వాదించాలి. ఇదే విషయాన్ని ఖురాన్ చెబుతుంది. ఎదుటి వారు ఎన్ని తప్పులు చేసినా వారిని పెద్ద మనసుతో క్షమించాలి. మళ్లీ పొరపాట్లు జరగకుండా జీవితాన్ని సాగిస్తామని ప్రతిజ్ఞ చేయాలి.

- ఎమ్డీ. ఎక్బాల్, ఇస్లాహె మాషిరా కమిటీ మానుకోట జిల్లా అధ్యక్షుడు

సహన గుణాలు అలవర్చుకుంటారు



ఆకలి బాధలను గుర్తెరిగే ఉపవాస దీక్షలతో దప్పికల నుంచి ఓర్పు, సహనసుగుణాలను అలవర్చుకుంటారు. ఆకలితో ఉన్న వారిని ఆదుకోవాలనే తత్వాన్ని స్వీకరిస్తారు. ఈ నెల రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనతో చేసిన ఉపవాసాలను 11 నెలల పాటు స్ఫూర్తిగా కొనసాగించి వచ్చే రంజాన్‌కు మరింత భక్తి శ్రద్ధలను పెంచుకునే దిశగా ముందుకు సాగాలని నిశ్చయించుకుంటారు.

- మహ్మద్ చాంద్ పాషా, సెక్రెటరీ సదర్, మదర్సా గుల్షాన్ ఖాజా గరీబ్ నవాజ్, మహబూబాబాద్



ప్రారంభ వేడుకకు హాజరైన నిట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు



జీవితం ఒక ఆట.. ఆడుతూనే ఉండాలి..

- ప్రముఖ సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం
- వరంగల్ నిట్ విద్యార్థులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం
- జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్ స్ప్రీకి ప్రారంభోత్సవం

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవితం ఒక ఆట.. దానితో ఆటాడాల్సిందేనని ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ గ్రహీత, డాక్టర్ బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లోని పాత ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025)ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. తాను ఒకప్పుడు లెక్చరర్‌నని, పేదరికం అధిగమించి ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడ్డానన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు. తనలాగే ఇక్కడి విద్యార్థుల్లో ఎంతో మంది పేదవారు ఉండొచ్చని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని, ఇలాంటివారికి ధైర్యం చెప్పడానికే తాను ఇక్కడికి వచ్చానన్నారు. చదువుకోవాలనే కాంక్ష ఉన్నప్పుడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా లెక్క చేయకూడదన్నారు. మనం లక్ష్యాన్ని ప్రేమించాలి. ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలని ఉద్బోధించారు. గమ్యాన్ని ఒక్కదాన్నే కాకుండా మార్గాన్ని కూడా ప్రేమించాలని పిలుపునిచ్చారు. మనం ఎంచుకున్న మార్గంలో రకరకాల ఇబ్బందులు వస్తూనే ఉంటాయన్నారు.

'ఒకప్పుడు మాది చాలా పేద కుటుంబం. మా కుటుంబంలో ఎనిమిది మంది సంతానం. ఆ రోజుల్లో మమ్మిల్ని చదివించాలంటే చాలా కష్టపడేవాడు మా నాన్న. ఆ పరిస్థితుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎన్ని అవమానాలు జరిగినా పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలని అనుకున్నాను. లక్ష్యాన్ని సాధించాను.' అని గతాన్ని గుర్తు చేసుకున్నారు బ్రహ్మానందం. పేదరికం నుంచి ఎదగాలంటే లాల్ బహదూర్ శాస్త్రి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం, రైల్వేస్టేషన్‌లో చాయ్‌లమ్మి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన నరేంద్ర మోదీ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వీరంతా పేదరికంలో పుట్టి చదువుకొని పైకి వచ్చినవారన్నారు. అట్లాగే కష్టపడి పైకి వచ్చిన తాత్వికుల్లో రామక్రిష్ణ పరమ హంస, వివేకానందుడు, జిడ్డు క్రిష్ణమూర్తి వంటి వారు కూడా ఉన్నారన్నారు. వీరు ఆర్థికంగా పేదవారు కావచ్చు. కానీ మేధోపరంగా ఎంతో ఉన్నతులని శ్లాఘించారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడంతోనే సరిపెట్టుకోవద్దని, మనలో దాగి ఉన్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకోవడం ద్వారా కిష్టమైన రంగంలోనూ రాణించాలని పిలుపునిచ్చారు.

చదువుకు పేదరికం అడ్డుకారాదు..

తాను లెక్చరర్‌గా పని చేస్తున్న కాలంలోనే ఇంకేదో చేయాలన్న తపన తనలో ఉండేదని బ్రహ్మానందం అన్నారు. దేవుడు తనను నటన వైపు మళ్లించాడని చెప్పారు. దేవుడు ప్రతీ ఒక్కరికి ఒక అవకాశం ఇస్తాడని, మనకు ఏది కావాలో చెబుతాడు తప్ప.. అన్నిటినీ మన ముందుంచి ఏది తీసుకోవాలో చెప్పడన్నా రు. ఇచ్చిన దానిని సద్వినియోగ పరుచుకో వాలని అన్నారు. తనకు సినిమాల్లో నటించే అవకాశం వచ్చిందని, దానిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ స్థాయిలో ఉన్నానని బ్రహ్మానందం ఎంతో ఉద్వేగంగా వివరించారు. 'ఏ రిచ్‌మెన్ జోక్ ఈజ్ ఆల్వేస్ ఫన్నీ' అనే ఇంగ్లీష్ సామెతను ప్రస్తావిస్తూ డబ్బుకున్న ప్రాధాన్యతను వివరించారు. డబ్బు ఉంటేనే మనల్ని గౌర విస్తారన్నారు. పేదరికం నుంచి బయట పడి ఈ స్థితికి వచ్చి వందల మంది విద్యార్థుల ముందు నిలబడగలిగానంటే ఇందుకు కారణం పట్టుదల అన్నారు. జీవి తంలో ఎప్పుడూ రాజీపడరాదు. అనుకు న్నది సాధించే వరకు ప్రయాణం సాగి స్తూనే ఉండాలని పిలుపు నిచ్చారు.

చిన్నతనంలో అమ్మనాన్నలు నేర్పిన మంచి మాటలు, వారు చూసిన సన్మార్గంలో నడిచాను కనుకనే ఒక పద్మశ్రీ బ్రహ్మానందంగా, ఒక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు బ్రహ్మానందంగా, ఒక డాక్టర్ బ్రహ్మానందంగా మీ ముందున్నానన్నారు. స్ప్రింగ్ స్ప్రీ విజయవంతం కావాలని, మీ ముఖాలు బ్రహ్మానందంగా వెగిలిపోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. కాగా, బ్రహ్మానందం ప్రసంగాన్ని విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. మధ్య మధ్యలో చప్పట్లు కొడుతూ ఆస్వాదించారు. అనంతరం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ డాక్టర్ బ్రహ్మానందకు శాలువా కప్పి సత్కరించారు. స్ప్రింగ్ స్ప్రీ జ్ఞాపికను అందచేశారు. బ్రహ్మానందం రాక సందర్భంగా గట్టి భద్రత ఏర్పాటు చేశారు. బ్రహ్మానందం నిట్ క్యాంపస్‌లో సుమారు 3 గంటలు ఉన్నారు.

తొలుత వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. స్ప్రింగ్ స్ప్రీ ఉద్దేశ్యాన్ని, దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, కల్చరల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి.శ్యామ్, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, స్టూడెంట్ ఆక్టివిటీ (ఎస్ఏటీ) కల్చరల్ సొసైటీ ప్రతినిధి రణదీర్, ఎస్ఏటీ టెక్నికల్ సొసైటీ ప్రతినిధి ఇషాన్ శర్మ, సాక్ స్పోర్ట్స్ సొసైటీ ప్రతినిధి అథర్వ దేశ్‌పాండే, సాక్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీ ప్రతినిధి జి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడూరి రేణుక బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో అలరించాయి.

'ప్రయత్నిస్తూ మరణిస్తే అది విజయం... ప్రయత్నం విరమిస్తే అది మరణం అన్న తెలుగులోని ఒక సూక్తిని బ్రహ్మానందం ఈ సందర్భంగా ప్రస్తావించారు. తాను నిరంతరం ప్రయత్నిస్తున్నాను కనుకనే సినిమా రంగంలో 40 ఏళ్లగా 1250కి పైగా చిత్రాల్లో నటించానన్నారు. ఇక్కడున్న విద్యార్థులెవరూ తాను సినిమా రంగంలో ప్రవేశించే నాటికి పుట్టి ఉండరన్నారు. అయినా తన ప్రస్థానం మరింత కాలం కొనసాగాలంటే వారి ఆశీస్సులు కావాలని కోరారు. ఆశీర్వదించడానికి వయసు కాదు.. మనసు ముఖ్యం అన్నారు. ఇతరులను మనం గౌరవించినప్పుడే.. వారు మనల్ని గౌరవిస్తారన్నారు. ఎదుటి వారు ఎలా ఉండాలని మనం కోరుకుంటామో భగవంతుడు ముందు మనల్ని అలాగే ఉంచుతాడన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యవంతంగా జీవించాలని, మనం ఆరోగ్యంగా ఉంటేనే మన ఆలోచనలు కూడా బాగుంటాయని, మన ఆలోచనలు బాగుంటే మనం మంచి పనులు చేస్తామని, మంచి పనులు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని, మంచి ఫలితాలు వస్తే దేవుడు సంతోషిస్తాడని, దేవుడు సంతోషిస్తే మనకు మోక్షం ప్రసాదిస్తాడని, మంచి పనులు చేస్తే మోక్షం వస్తుందని వివరించారు.

సినిమాల నిర్మాణంలో కొత్త పోకడలు

- కొత్తదనం కోరుకుంటున్న ప్రేక్షకులు
- షార్ట్ ఫిలిమ్స్‌లో నిట్ విద్యార్థుల అద్భుత ప్రతిభ
- సినీ దర్శకుడు వశిష్ట
- ఆకట్టుకున్న డైరెక్టర్ కట్స్ ఈవెంట్



డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌లో విద్యార్థులను ఉద్దేశించి మట్లాడుతున్న దర్శకుడు వశిష్ట

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సినిమా నిర్మాణంలో కొత్త పోకడలు చోటు చేసుకుంటున్నాయని, ప్రేక్షకుల అభిరుచి మేరకు చిత్రాల నిర్మాణం జరుగుతోందని బింబిసారా, విశ్వంభర చిత్రాల దర్శకుడు వశిష్ట అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో ప్రారంభమైన వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ-2025)లో భాగంగా నిర్వహించిన డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌లో ముఖ్యఅతిథిగా వశిష్ట పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వశిష్ట మాట్లాడుతూ.. ప్రేక్షకులు కథ, కథనం, నిర్మాణంలో కొత్తదనం కోరుకుంటున్నారన్నారు. ప్రేక్షకుల అభిరుచి మేరకే బింబిసారా తీశానని అన్నారు. విశ్వంభర కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వశిష్ట తన సినీ ప్రయాణం, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థుల్లో కూడా గొప్ప దర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ఇష్టాగోష్టి ఆద్యంతం ఉల్లాస భరితంగా సాగింది. చర్చలు, హాస్యపూరిత సంభాషణలు, సినీ పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. వశిష్ట తీసిన చిత్రాల గురించిన ప్రశ్నలు అడగ్గా, ఆయన వాటికి జవాబులు చెప్పారు. అంతకుముందు విద్యార్థులు రూపొందించిన రెండు షార్ట్‌ఫిల్మ్‌లు కృష్ణుడివారుసులంతా, అలాగే మకర చిత్రాలను ప్రదర్శించారు. వీటిని చూసిన వశిష్ట.. విద్యార్థులను ప్రశంసించారు. వారిలో సృజనాత్మకత అబ్బురపరిచిందన్నారు. చిత్ర నిర్మాతలకు మార్గదర్శనం చేశారు. ఈ రెండు లఘు చిత్రాలు ప్రేక్షకుల నుంచి సైతం ప్రశంసలు అందుకున్నాయి. తొలుత స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య స్వాగతం పలికారు. డైరెక్టర్ కట్స్ ఈవెంట్ విశిష్టతను వివరించారు.

ఆస్ట్రాలిస్ ఈవెంట్‌లో విద్యార్థుల ప్రదర్శన



ఆకట్టుకున్న ఆస్ట్రాలిస్


- ఆటపాటలతో దద్దరిల్లిన నిట్ క్యాంపస్
- చిందులేసిన విద్యార్థులు

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) వరంగల్ నిట్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆస్ట్రాలిస్ ఈవెంట్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. స్ప్రింగ్ స్ప్రీ-2025 (వసంతోత్సవం)లో భాగంగా నిట్ క్యాంపస్‌లోని స్టేడియంలో నిర్వహించిన ఈ సంగీత విభావరి ఆద్యంతం దద్దరిల్లిపోయే సంగీతం, పాత, కొత్తపాటల మేళవింపుతో విద్యార్థులను ఆద్యంతం ఉర్రూతలూగించింది. నియాన్‌లైట్ల వెలుగులో విద్యార్థులు పాడిన పాప్ సాంగ్స్‌కు అనుగుంగా విద్యార్థులు చిందులేశారు. సాంస్కృతికోత్సవంలో భాగంగా యేటా మ్యూజిక్ క్లబ్ నిర్వహించే ఈ సంగీత కార్యక్రమంలో విద్యార్థులు మాత్రమే పాల్గొంటారు. ఆస్ట్రాలిస్ పేరుతో రెండేళ్లుగా నిర్వహిస్తున్న ఈ మ్యూజిక్ హంట్ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఈవెంట్‌గా ప్రశంసలు అందుకుంటున్నది.

నేటి ఈవెంట్లు

వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న స్ప్రింగ్ స్ప్రీలో భాగంగా శనివారం రెండవ రోజు నిర్వహించే ఈవెంట్లు.. డ్యాన్స్ రష్, తానాబానా, ట్రెజర్ హంట్, అన్‌సాల్వ్, సోలో ఐడల్, సోలో ఇన్‌స్ట్రుమెంటల్స్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, పోలరాయిడ్ ఫొటోగ్రఫీ, ఆర్ట్ థెరపీ మొదలైనవి.

ఆంధ్రజ్యోతి
హనుమకొండ సిటీ
HANUMAKONDA CITY ■ శనివారం 1 మార్చి 2025 V 8



లింగ వివక్షను రూపుమాపాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్షను రూపుమాపి బాలికల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గర్భస్థ పూర్వ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ.. పీఎన్‌డీటీ చట్టం, ఎంటీపీ చట్టాలను అమలుకు కృషి చేస్తున్నామని, అయినప్పటికీ కొందరు లింగ నిర్ధారణ కోసం, అబార్షన్ల కోసం డాక్టర్లు, అర్హత లేని వైద్యులను సంప్రదిస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తెలిసిన వారు 104, 1098 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఆర్‌ఓ భానుప్రసాద్, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ మంజుల, డాక్టర్ కవి, స్వచ్ఛంద సంస్థ నుంచి పి.సంతోష్ కుమార్, టి.రాజు, వి.అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం



సైన్స్ ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ఏకశిల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజారెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తయారుచేసి ప్రదర్శించారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీవిద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించే తత్వాన్ని ప్రోత్సహించడమే సైన్స్ ఉద్దేశమన్నారు. మానవ సంక్షేమంలో శాస్త్రవేత్తల కృషి, వారి విజయాలను గుర్తించడం ఈరోజు సైన్స్ దినోత్సవ లక్ష్యమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిని అర్థం చేసుకొని అన్ని రంగాల్లో మరింత కృషి చేయాల్సిన అంశాలను అన్వేషించాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు నోబెల్ బహుమతి గ్రహీత రామన్ పరిశోధనల నుంచి ప్రేరణ పొంది కొత్త కొత్త పరిశోధనల ఆవిష్కరణలకు నాంది కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు సిరాజ్, గుర్మిత్‌కౌర్, సింగారపు స్వాతి, దీపిక, సుహాసిని, కరుణాకర్, వీరస్వామి, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షైన్ స్కూల్‌లో సింటీలెస్ సైన్స్ ఫెయిర్



షైన్ స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ హంటర్ రోడ్డులోని షైన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'షైన్ సింటీలెస్ సైన్స్ ఫెయిర్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞాన, సాంకేతిక శక్తిని రేపటి తరాలకు అందించే విధంగా వారిలో విజ్ఞానం, పరిశోధన పెంపొందించేందుకు ఎగ్జిబిట్స్ ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మూగల రమ, డైరెక్టర్ పి.రాజేంద్రకుమార్, షైన్ ఐఐటీ కోఆర్డినేటర్ మూగల రమేష్ యాదవ్, షైన్ స్కూల్ హంటర్‌రోడ్డు ప్రిన్సిపాల్ పి.విశాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గురుకుల్‌లో సైన్స్‌డే



హనుమకొండలోని శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న పాఠశాల సిబ్బంది

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సోమ రత్నం సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఎగ్జిబిట్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యుగంధర్, ఉపాధ్యాయులు రజినీకాంత్, అనూషా, అస్మా, వినయ్‌కుమార్, విజయ్‌కుమార్, అఫీజా, రాజేష్, మధు, గీతా, లావణ్య, నవ్య స్ఫూర్తి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రెడ్డికాలనీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని సమత హైస్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శనలను ఎంతో పోటీతత్వంతో ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాసాగర్‌రావు, భారతి అభినందించారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

▸▸ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మార్చి 21 నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 12,010 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఇందుకుగాను 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 67 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 6,339 మంది బాలురు, 5,671 మంది బాలికలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఎల్‌పీవో గంగా భవాని, పోస్టల్ అధికారి పాపాజీ, ఆర్టీసీ ఆర్‌ఎం ధరంసింగ్, ఏటీవో అన్వర్ హుస్సేన్, విద్యుత్ శాఖ అధికారి గంగారెడ్డి, ఎంవీఐ వేణుగోపాల్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఎల్‌బీ కళాశాల వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్ ధర్నా



ధర్నా చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధ

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్‌బీ కళాశాల భవనం వద్ద ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ ధర్నాకు దిగారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధ శుక్రవారం ధర్నాకు దిగారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్వతంత్ర అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిని టీచర్ సమస్యలపై ప్రశ్నించినందుకు కళాశాల యాజమాన్యం వేధిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్ సమస్యలు తీర్చాలని అడిగినందుకు కళాశాల నోటీసులు ఇవ్వగా తాను తీసుకోకపోవడంతో కళాశాల నుంచి వెళ్లిపోవాలని ప్రిన్సిపాల్ హుకుం జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఏడేళ్లుగా ఫిలాసఫీ సబ్జెక్టులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నానని, పలు అభివృద్ధి కార్యక్రమాల పేరిట ప్రిన్సిపాల్ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని, కళాశాలలు ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్‌కు భయపడి ఎవరూ ముందుకు రావడం లేదని అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధ ఆవేదన వ్యక్తం చేశారు.

మెళకువలను మేళవించి బోధించాలి

▸▸ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు వారి బోధనాపరమైన మెళకువలను వారి బోధనలో మేళవించి విద్యార్థులకు బోధించాలని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి సీఎస్, డీవోలను ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఏమరపాటు వహించకుండా నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అవకతవకలు జరుగకుండా పరీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈవో డి.వాసంతి, ఏసీజీఈ బి.భువనేశ్వరి, డీఎస్‌వో శ్రీనివాసస్వామి, ఎంఈవో నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామగిరి ప్యాసింజర్ రద్దు

కాజీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల దృష్ట్యా శనివారం నుంచి (17035) కాజీపేట - బల్లార్షా మధ్య నడిచే రామగిరి రైలు అప్ అండ్ డౌన్ మార్చి 1 నుంచి 6 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా (17033) భద్రాచలం నుంచి బల్లార్షా మధ్య నడిచే సింగరేణి రైలు అప్అండ్‌డౌన్ రద్దును మార్చి 31 వరకు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఆర్‌ఆర్‌ఆర్ సదస్సుకు బల్దియా అధికారులు

● నాలుగు రోజుల పాటు రాజస్థాన్‌లో సదస్సు

● తెలంగాణ రాష్ట్రం నుంచి వరంగల్‌కు దక్కిన అవకాశం

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ నగరంలో మార్చి 2 నుంచి 5 వరకు జరుగనున్న 12వ రీజినల్ ఆర్‌ఆర్‌ఆర్, సామాచార్ ఫోరం జాతీయ సదస్సులో పాల్గొనేందుకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అధికారులకు అరుదైన అవకాశం లభించింది. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క వరంగల్ నగరం నుంచి ముగ్గురు అధికారులతో పాటు హైదరాబాద్ నుంచి సీడీఎంఏ శ్రీదేవి పాల్గొంటారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, బల్దియా శానిటేషన్ విభాగం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బొమ్మన రాజిరెడ్డిని జాతీయ సదస్సులో హాజరు కావాలని రెండు రోజుల కిందట సమాచారం అందింది. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో అవలవుతున్న వివిధ అభివృద్ధి పనులు, చెత్త శుద్ధీకరణ, స్వచ్ఛ వరంగల్ కార్యక్రమాలపై కమిషనర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తారని బల్దియా అధికారులు వెల్లడించారు. రాజస్థాన్ వెళుతున్న అధికారులకు బల్దియా సిబ్బంది శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి : డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని డీఈవో డి.వాసంతి అన్నారు. ఇటీవలే డీఎస్సీ-2024లో ఎంపికైన ఎస్జీటీ ఉపాధ్యాయులకు హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధన పట్ల మక్కువ చూపుతూ విద్యార్థుల అభివృద్ధి తమ అభివృద్ధిగా భావిస్తూ విద్యాబోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎ.శ్రీనివాస్, సీఎంవో బి.సుదర్శన్‌రెడ్డి, ఆర్పీలు చంద్రయ్య, పున్నం చందర్, శ్రీపాల్‌రెడ్డి, శ్యాంసుందర్, శ్రీధర్ తదితరులుపాల్గొన్నారు.

కేయూలో గద్దర్ సినిమా షూటింగ్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాయుద్ధనౌక గద్దర్ బయోగ్రఫీ సినిమా షూటింగ్ శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగింది. దూరవిద్య కేంద్రం వద్ద సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. గద్దర్ పాత్ర వేషధారణలో ఉన్న నటుడు వర్సిటీ విద్యార్థుల దీక్షల్లో పాల్గొని ఉద్యమ గీతాలను ఆలపిస్తుండగా పోలీసులు అడ్డుకుని గద్దర్‌ను నిర్బంధించే సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా వర్సిటీ విద్యార్థి ఉద్యమ నేతలు ఉత్సాహంగా సినిమా సన్నివేశాల్లో పాల్గొన్నారు. షూటింగ్‌లో పీడీఎస్‌యూ నేత బి.నరసింహరావు, బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జి అరెగంటి నాగరాజుగౌడ్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నేత బొచ్చు తిరుపతితో పాటు ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యాన్ని చేరలేదంటే చర్యలు తప్పవు

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

▸▸ రెవెన్యూ వసూళ్ల పురోగతిపై సమీక్షా సమావేశం

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బల్దియా పన్నుల వసూళ్లలో నిర్దిష్ట లక్ష్యాన్ని చేరకుంటే చర్యలు తప్పవని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో రెవెన్యూ వసూళ్ల పురోగతిపై ఆర్‌ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వార్షిక సంవత్సరంలో ఇప్పటివరకు వసూళ్లు చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లపై ఇటీవల సీడీఎంఏ సూచనల మేరకు ప్రజల నుంచి వసూళ్లు తేవాలని అన్నారు. ప్రతీ వార్డు ఆఫీసర్ నుంచి అదనపు కమిషనర్ వరకు సూచించిన లక్ష్యాలను చేరుకోవాలని, ఎవరైనా విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్ల తీరును తేలికగా తీసుకుంటే శాఖాపరమైన వేటు తప్పదని హెచ్చరించారు. ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు ప్రతీరోజు 300 గృహాలను సందర్శించి పన్నులు వసూళ్లు చేయాలని అన్నారు. బిల్ కలెక్టర్లు, ఆర్‌ఐలపై ఆర్‌వోలు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. బకాయిదారులకు టాక్స్ చెల్లించే విధంగా బల్క్ మెసేజ్‌లు పంపించాలని అన్నారు. బల్దియా నుంచి పంపించే మెసేజ్‌లను ఓపెన్ చెస్తే పన్నులు చెల్లించే విధంగా ఆప్షన్ కలిగి ఉండాలన్నారు. పన్నుల చెల్లింపులపై నగర వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, రాజేశ్వర్‌లతో పాటు ఆర్‌వోలు యూసుఫ్, శ్రీనివాస్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

న్యాయవాదులకు వ్యక్తిగత రుణాల మంజూరు

యునైటెడ్ వరంగల్ న్యాయవాదుల సొసైటీ సమావేశంలో తీర్మానం

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ వరంగల్ జిల్లా న్యాయవాదులకు ఇక నుంచి వ్యక్తిగత రుణాలను మంజూరు చేయడానికి నిర్ణయించినట్లు యునైటెడ్ వరంగల్ న్యాయవాదుల పరస్పర సహకార సొసైటీ అధ్యక్షుడు కె.విజయ్‌భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టులోని అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2023- 24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశామని, ప్రధానంగా యునైటెడ్ వరంగల్ జిల్లా న్యాయవాదులందరికీ వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. రుణాల మంజూరు విధి విధానాలు త్వరలో ప్రకటిస్తామని విజయ్‌భాస్కర్‌రావు తెలిపారు. అదేవిధంగా వెల్ఫేర్ టికెట్ ధర రూ.110 నుంచి రూ.130 వరకు పెంచడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. మరణానంతరం ఇచ్చే నగదును రూ.లక్ష నుంచి రూ.లక్షా 50వేలకు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో రూ.2లక్షలకు పెంచడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నట్లు సర్వసభ్య సమావేశంలో తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్, హనుమకొండ జిల్లాల జడ్జిలు నిర్మలగీతాంబ, సీహెచ్. రమేష్‌బాబు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, బార్ కౌన్సిల్ మెంబర్ బైరపాక జయాకర్, సొసైటీ కార్యదర్శి సల్లా కుమార్, చంద్రశేఖర్, పి.రాము, సురేష్, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారం, సరైన నిద్రతోనే సంపూర్ణ ఆరోగ్యం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారంతో పాటు సరైన నిద్రతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కేయూ సమ్మక్క- సారమ్మ లేడీస్ హాస్టల్‌లో మహిళా విద్యార్థులకు స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్, వరంగల్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బీపీ చెక్ చేసుకున్నారు. వైద్యులు విద్యార్థులకు బీపీ, షుగర్, పల్స్ ఈసీజీ, వైటల్ చెకప్, బీఎంఐ తదితర పరీక్షలన్నీ ఉచితంగా చేశారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని కేయూ స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి.శ్రీనివాస్ నిరంజన్ నేతృత్వంలో నిర్వహించగా గైనకాలజీ స్పెషలిస్టు డాక్టర్ అమతుల్ హస్నా ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వాగ్దేవి ఫార్మసీ కళాశాల వారు ఉచితంగా మందుల పంపిణీ చేశారు.

18, 19 తేదీల్లో జాతీయ సదస్సు

మార్చి 18, 19 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ నేతృత్వంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ టి.రాజమణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కేయూ కమిటీ హాల్‌లో జాతీయ సదస్సు పోస్టర్‌ను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం చేతుల మీదుగా ఆవిష్కరించారు. '75 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్- మైల్‌స్టోన్స్- ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, తాళ్ళపల్లి మనోహర్, ఎం.శ్రీనివాస్, ఎన్.రాంనాథ్ కిషన్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పుల్లూరి సుధాకర్, డాక్టర్ చిర్రా రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జాతీయ సదస్సు వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ https://kakatiyaలో చూడాలని పేర్కొన్నారు.

యునాని వైద్యం మానవాళికి ఎంతో ప్రయోజనం

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : యునాని వైద్యం సహజసిద్ధమైన వైద్యమని, మానావళి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజకరమని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ ప్రమీలదేవి అన్నారు. అయేషా మజీద్ కమిటీ, సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 53వ డివిజన్‌లోని లష్కర్‌సింగారంలో ఉచిత యునాని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగేందర్, అయేషా మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎం.డి. హైదర్ అలీఖాన్, వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

కాజీపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మానసికస్థితి బాగాలేక ఓ రైల్వే ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట రైల్వే కానిస్టేబుల్ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మడికొండ వినాయక నగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి పెనుకుల తిరుపతి (41)కి గతంలో తలకు దెబ్బతాకడంతో అప్పటినుంచి మానసిక స్థితి స్థిరంగా లేదు. శుక్రవారం పెండ్యాల - కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నాడు.

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులను, ఉద్యోగులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి విలీనం చేయాలని ఆర్టీసీ వరంగల్ జాక్ చైర్మన్ ఇ.వెంకన్న డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకన్న హాజరై మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ 2021 వేతన సవరణ చేసి రిటైర్డ్ అయిన కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించి గతంలో ఉన్న యూనియన్లను పునరుద్ధరించడంతోపాటు ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు ఇవ్వాలని కోరారు. రిక్రూట్‌మెంట్ చేసి డ్రైవర్లను, కండక్టర్లను నియమించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాక్ వైస్ చైర్మన్ ధామస్‌రెడ్డి, నాయకులు మౌలానా, యాదయ్య, దేవేందర్‌రావు, ఎం.శ్రీనివాస్, సీహెచ్. యాకస్వామి, జీఎస్. ఫాణి, ఆర్.కృష్ణ, కె.స్వామి, కె.ఎల్లయ్య, ఎం.రవీందర్, కుమార్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడిగా రుద్రేశ్వరుడు

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవ పర్వం శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజ, నిత్య విధులు నిర్వహించిన తర్వాత రుద్రేశ్వరుడికి అభిషేకం నిర్వహింపజేసి అన్నసూక్త మంత్రపఠనంతో 51 కిలోల పెరుగన్నంతో రుద్రేశ్వరుడిని శోభాయమానంగా అర్ధ నారీశ్వరుడిగా అలంకరింపజేసి పూజాదికాలు నిర్వహించారు. అమెరికన్ కన్సల్టెంట్ జనరల్ జెన్నీఫర్ లాక్సన్ ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించి ఈ విశేష పూజల్లో పాల్గొన్నారు. ఇదే పూజా కార్యక్రమంలో సీపీ అంబర్ కిశోర్ ఝా కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో సీపీ కూడా భక్తులకు వడ్డన చేయడం విశేషం. ఆలయ ఈవో అనిల్‌కుమార్ వేడుకలను పర్యవేక్షించారు.

మెట్టురామలింగేశ్వర స్వామికి త్రిశూల స్నానం

● మడికొండ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మడికొండలోని మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గవ్యాంత పూజలు, నిత్యోపాసన, నవగ్రహ రుద్రహోమ సహిత చండీ హోమం, నిత్య బలిహరణ, మహాపూర్ణాహుతి, ధ్వజారోహనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, త్రిశూల స్నానం, స్వామి వారికి అన్నపూజ చేశారు. సాయంత్రం పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవలు, నీరాజన మంత్రపుష్పం, అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులుపాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

● సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా

హసన్‌పర్తి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ ఎస్‌కే.సలీమా పోలీసులకు సూచించారు. కేయూ పోలీసు స్టేషన్ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డుపై ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాద స్థలాలను కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్‌తో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే సమస్యలను సత్వరమే సమన్య పరిష్కారం అయ్యే దిశగా ప్రయత్నం చేయాలని సూచించారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు పెట్రోలింగ్ పెంచాలన్నారు. నగరంలో వరుస చోరీలతో పాటు భూకబ్జాదారులు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అంతేకాకుండా వైన్‌షాపుల ఎదుట వాహనాల పార్కింగ్ వల్ల ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. నిత్యం పోలీసులు అప్రమత్తంగా ఉంటేనే ప్రజా రక్షణ సాధ్యమన్నారు. ఈ సమావేశంలో కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్‌తో పాటు ఎస్సైలు మాధవ్, రవిందర్, శ్రీకాంత్, ప్రొబేషనరీ ఎస్సై అర్చనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాద స్థలాలను పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ ఎస్‌కే.సలీమా

వంటిల్లు



పండుమిర్చితో వేడివేడిగా...

పండుమిర్చి అనగానే కమ్మని పచ్చడి గుర్తుకువస్తుంది. టమాటా, గోంగూర, చింతకాయలను చేర్చి కూడా పచ్చళ్లు చేస్తూ ఉంటారు. ఇవి కాక పండుమిర్చితో తయారుచేసే సరికొత్త వంటకాలు మీకోసం...



పండుమిర్చి పులిహోర

కావాల్సిన పదార్థాలు

- బియ్యం- ఒక గ్లాసు, పండు మిర్చి- అయిదు, చింతపండు- కొద్దిగా, నూనె- మూడు చెంచాలు, ఆవాలు- ఒక చెంచా, జీలకర్ర- అర చెంచా, మినప గుండ్లు- ఒక చెంచా, పచ్చి శనగపప్పు- ఒక చెంచా, పల్లీలు- మూడు చెంచాలు, ఎండు మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఇంగువ- చిటికెడు, పసుపు- అర చెంచా, ఉప్పు- తగినంత, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

- ముందుగా బియ్యం కడిగి అన్నం వండి పెట్టుకోవాలి.
- మిక్సీ గిన్నెలో పండు మిర్చి ముక్కలు, పది నిమిషాలు నీళ్లలో నానబెట్టిన చింతపండు, అరచెంచా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పల్లీలు, పచ్చిశనగపప్పు, మినప గుండ్లు, ఎండు మిర్చి ముక్కలు, పసుపు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ఇందులో పండు మిర్చి పేస్టు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత అన్నం, చెంచా ఉప్పు వేసి కలపాలి. తరవాత సన్నగా తరిగిన కొత్తిమీర వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. వేడి వేడిగా తింటే చాలా రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- తాలింపులో పల్లీలు, పప్పులను ముదురు గోధుమ రంగు వచ్చే వరకూ వేపాలి.
- పండు మిర్చి పేస్టులో చింత పండు ఎక్కువగా వేసుకోకూడదు. పులిహోర స్పైసీగా కావాలనుకుంటే మరో రెండు పండు మిర్చీలు వేసుకోవచ్చు.

పండుమిర్చి ఫ్రైడ్‌రైస్

కావాల్సిన పదార్థాలు

- పండుమిర్చి- ఏడు, ఉడికించిన అన్నం- రెండు కప్పులు, నూనె- ఒక చెంచా, సన్నగా తరిగిన వెల్లుల్లి ముక్కలు- అర చెంచా, సన్నగా తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, ఉల్లిపాయ- ఒకటి, ఉప్పు- తగినంత, మిరియాల పొడి- అర చెంచా, ఆరోమాటిక్ పొడి- అర చెంచా, కొత్తిమీర- కొద్దిగా



తయారీ విధానం

- పండుమిర్చిని ముక్కలుగా కోసి చిటికెడు ఉప్పు వేసి కచ్చాపచ్చాగా నూరి పెట్టుకోవాలి. ఉల్లిపాయని, ఒక పండుమిర్చిని సన్నగా తరగాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇందులో వెల్లుల్లి ముక్కలు, అల్లం ముక్కలు వేసి బాగా వేపాలి. తరవాత పండుమిర్చి ముక్కలు, ఉల్లిపాయ తరుగు వేసి రెండు నిమిషాలు మగ్గించాక పండు మిర్చి పేస్టు, ఉప్పు వేసి కలపాలి. ఇది వేగాక అన్నం, మిరియాల పొడి, ఆరోమాటిక్ పొడి, సన్నగా తరిగిన కొత్తిమీర వేసి బాగా కలిపి రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. స్పైసీగా వేడిగా తినాలనుకునేవారికి ఈ వంటకం బాగా నచ్చుతుంది.



జాగ్రత్తలు

- ఇందులో కావాలనుకుంటే క్యారెట్, బీన్స్, ఉల్లికాడలు, పచ్చి బఠానీలను చేర్చుకోవచ్చు.
- కమ్మదనం కోసం వేయించిన పల్లీలు, జీడిపప్పు కలుపుకోవచ్చు.

పండుమిర్చి పకోడి



కావాల్సిన పదార్థాలు

- శనగపిండి- ఒక కప్పు, బియ్యప్పిండి- పావు కప్పు, సోడా- చిటికెడు, వాము- ఒక చెంచా, పల్లీలు- రెండు చెంచాలు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉల్లిపాయలు- మూడు, పండు మిర్చి- అయిదు, నీళ్లు- తగినన్ని, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, ఉప్పు- తగినంత



తయారీ విధానం

- పల్లీలను నూనె లేకుండా వేయించి పొట్టు తీసి కచ్చాపచ్చాగా దంచి పెట్టుకోవాలి. పండుమిర్చి, ఉల్లిపాయలను చీలికల మాదిరి కోయాలి.
- ఒక గిన్నెలో శనగపిండి, బియ్యప్పిండి, సోడా, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత వాము, పల్లీల పొడి, సన్నగా తరిగిన కరివేపాకు, ఒక చెంచా నూనె, ఉల్లిపాయ ముక్కలు, పండు మిర్చి చీలికలు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత దీనిలో కొద్దికొద్దిగా నీళ్లు చల్లుతూ పకోడీల పిండి మాదిరి కలపాలి. స్టవ్‌మీద మూకుడు పెట్టి నూనె పోసి వేడిచేయాలి. తరవాత పిండిని పకోడీల్లా నూనెలో వేస్తూ దోరగా వేపాలి. బంగారు రంగులోకి వచ్చిన పకోడీలను టిష్యూ పేపర్ వేసిన పళ్లెంలోకి తీయాలి. ఇవి కారంగా క్రిస్పీగా చాలా రుచిగా ఉంటాయి.

జాగ్రత్తలు

- ఉల్లిపాయలను మరీ సన్నగా కాకుండా కొద్దిగా లావుపాటి చీలికల్లా కోయాలి. పండు మిర్చిని అడ్డంగా రెండు ముక్కలు చేసిన తరవాత నిలువుగా సన్నని చీలికల్లా కోయాలి.
- పకోడీలు మెత్తగా కావాలనుకుంటే బియ్యప్పిండికి బదులు కార్న్‌ఫ్లోర్ కలుపుకోవచ్చు.

అరటి దుంప పెరటి మందు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

అరటిలోని ఆకులు, కాండం, పళ్లు, దూట- ఇలా ప్రతి భాగం మనకు ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుంది. అయితే అరటి దుంపను తినే వాళ్లు తక్కువ మందే! దీనిని చాలా మంది తవ్వి బయట పారేస్తారు. దీనికి కారణం- అరటి దుంప ఉపయోగాలు తెలియకపోవటమే! అరటి దుంప ఉష్ణ మండల వాసులకు ముఖ్యంగా తెలుగువారికి వర ప్రసాదమనే చెప్పాలి. అందుకే భోజన కుతూహలం గ్రంథంలో అరటి దుంప గుణాలను విపులంగా చర్చించారు. ఈ గ్రంథంలో

"బల్యః కదల్యాః కందస్స్యాత్ కఫపిత్తహరో గురుః
వాతలో రక్తశమన్ కషాయో రూక్షశీతలః" అని పేర్కొన్నారు.


ఈ శ్లోక అర్థాన్ని గమనిస్తే

బల్యః కదల్యః కందస్స్యాత్: అరటి దుంప బలకరమైన ఆహార ద్రవ్యం.

కఫపిత్తహరో: కఫ వ్యాధులు దీనితో తగ్గుతాయి. పైత్యవ్యాధులు అదుపులోకి వస్తాయి. వేడి తగ్గి శరీరంలో ఉద్రేకం శాంతిస్తుంది.

గురుః: ఆలస్యంగా అరుగుతుంది. కడుపులో దండిగా ఉంటుంది. అలూతోనో కందదుంపతోనో మనం వండుకునేవన్నీ అరటి దుంపతోనూ వండుకోవచ్చు. అరటి దుంపని ఇలా వండుకుని కొద్దిగా తిన్నా చాలు, ఎక్కువ ఫలితం కనిపిస్తుంది.

వాతల: ఆలస్యంగా అరిగే ద్రవ్యాలను పరిమితంగా తినాలి. జీర్ణశక్తి మందంగా ఉన్నవారికి ఇది వాతాన్ని కలిగించే అవకాశం ఉంది. కాబట్టి జీర్ణశక్తి ననుసరించి దీన్ని వండుకునే విధానం ఉండాలి.



అరటి దుంప గుణధర్మాల్ని అనుసరించి దాన్ని వండుకునే విధానం ఉండాలి. ఇది చలవ నిచ్చే ద్రవ్యం కాబట్టి వేడి చేసే పదార్థాలతో కలిపి వండితే విరుద్ధాహారం అవుతుంది. అలాగే ఇది ఆలస్యంగా అరుగుతుంది. కాబట్టి దీన్ని తేలికగా అరిగించే ధనియాలు, జీలకర్ర, మిరియాలు, అల్లం లాంటి వాటితో కలిపి వండుకోవాలి. ఇది వాతస్వభావం కలిగింది కాబట్టి దీన్ని చింతపండు రసం పోయకుండా వండాలి.

రక్తశమన: రక్తంలో ఉద్రేకాన్ని ఉపశమింపచేస్తుంది. దీనివల్ల రెండు రకాల ప్రయోజనాలు నెరవేరుతాయి. మొదటిది బీపీ పెరుగుదలను అరికడుతుంది. రెండోది రక్త స్రావాన్ని అరికడుతుంది.

కషాయో: దీనికి వగరు రుచి ఉంటుంది. అందువల్ల దీనిని మధుమేహం, స్థూల కాయం ఉన్నవారు తినవచ్చు.

రూక్షా: శరీరానికి బిరుసుదనాన్నిస్తుంది.

శీతల: శరీరానికి చలవనిస్తుంది. వేడిని తగ్గిస్తుంది.

ప్రయోజనాలెన్నో!

అరటి దుంప కడుపులో ఎసిడిటిని నియంత్రిస్తుంది. పేగుపూత వంటి వ్యాధులను నివారిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను కరిగించే శక్తి దీనికుంది. పురుషుల్లో జీవకణాల్ని పెంచుతుంది. అరటి దుంపను తరచూ తినేవారికి జుత్తు ఏపుగా పెరుగుతుంది. స్త్రీ సంబంధిత వ్యాధుల్లో దీని ప్రభావం ఎక్కువ. గర్భాశయపోషకాల్లో ఇది ముఖ్యమైంది. రక్తంతో కూడిన వాంతుల్ని అరికడుతుంది. పళ్లలో నుంచి రక్తం కారటం తగ్గుతుంది. మూత్రం ఫ్రీగా అయ్యేలా చేస్తుంది. కడుపులో తిష్ట వేసుకుని ఉంటున్న ఎలిక పాముల్ని చంపి బయటకు తోసేస్తుంది. దీని వేర్లకు క్రిమిసంహారక గుణం ఉంది.

ఇలా వండుకోవచ్చు...

అరటి దుంపల్ని పిలకలు, వేర్లతో సహా వండుకుని తినవచ్చు. ముందుగా అరటి దుంపను వేర్లతో సహా పెకలించి, మట్టి పోయేలా కడిగి పైన పెచ్చు తీసేసి సన్నని ముక్కలుగా తరిగి దానిలో కొద్దిగా నూనె వేసి.. దానిపై నీళ్ల మూత పెట్టి మగ్గనివ్వాలి. ఇలా మగ్గిన ముక్కలతో కూర చేసుకోవచ్చు. పచ్చడి కూడా చేసుకోవచ్చు.

• గంగరాజు అరుణాదేవి

రాగి వస్తువులు మెరవాలంటే...

రాగితో తయారుచేసిన పాత్రలు, బిందెలు, గ్లాసులు, వాటర్ బాటిల్స్ లాంటివి ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో జరిగే ఆక్సీకరణ చర్యల వల్ల ఇవి నల్లగా మారుతుంటాయి. వీటిని కొత్తవాటిలా మెరిపించే చిట్కాలివి.

- ఒక గిన్నెలో నాలుగు చెంచాల ఉప్పు, రెండు చెంచాల నిమ్మ రసం వేసి బాగా కలపాలి. పలుచని వస్త్రం లేదా స్క్రబ్బర్‌తో ఈ మిశ్రమాన్ని అద్ది దాంతో రాగి వస్తువులను తోమాలి. రెండు నిమిషాల తరవాత మంచినీటితో శుభ్రం చేసి పొడిగుడ్డతో తుడిస్తే అవి కొత్తవాటిలా మెరుస్తాయి.
- గిన్నెలో మూడు చెంచాల వెనిగర్, రెండు చెంచాల బేకింగ్



సోడా వేసి పేస్టులా కలపాలి. దూది ఉండ లేదా పలుచని వస్త్రం సహాయంతో ఈ మిశ్రమాన్ని రాగి వస్తువులకు పూతలా పట్టించాలి. పావుగంటసేపు అలాగే ఉంచాలి. తరవాత తడిగుడ్డతో శుభ్రంగా తుడిస్తే వాటిపై పేరుకున్న నలుపుదనం తొలగిపోతుంది.
- టమాటా రసంలో స్క్రబ్బర్ ముంచి దాంతో రాగి వస్తువులను తోమితే వాటిపై పేరుకున్న నలుపుదనం, దుమ్ము, ధూళి తొలగిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల ముల్తానీమిట్టి, మూడు చెంచాల నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. దీనిని రాగి వస్తువులకు పట్టించాలి. మెత్తని బ్రష్‌తో రెండు నిమిషాలు సున్నితంగా రుద్ది తరవాత నీటితో కడిగితే వాటి నలుపుదనం మొత్తం పోతుంది. ఈ చిట్కా వల్ల వస్తువుల ఉపరితలంపై గీతలు పడకుండా ఉంటాయి.

సంకల్పం

సహజ పోషకాల కోసం... ఓ అమ్మ ప్రయత్నం

వ్యాపారంలో లాభం కంటే వినియోగదారుల ఆరోగ్యమే ముఖ్యం అనుకున్నారు. దాని కోసం తనయుడితో కలిసి అంకుర సంస్థకు శ్రీకారం చుట్టారు. పోషక విలువలు గల స్వచ్ఛమైన వెగాన్ స్మూతీని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు. అదికూడా... ఎలాంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ తీపి పదార్థాలు లేకుండా..! ప్రయోగాత్మకంగా మొదలుపెట్టి... నేడు మరికొందరికి ఉపాధి మార్గంగా మార్చిన 'టాన్స్' కంపెనీ వ్యవస్థాపకురాలు తేజశ్రీ షా ప్రయాణం ఇది...



"మా కుటుంబానికి వ్యాపారం కొత్తేమీ కాదు. మా తాత స్టీల్ గిన్నెలు, స్టవ్‌లు తయారీలో ఒకప్పుడు దేశంలోనే పేరు మోసిన వ్యాపారి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ మా నాన్న స్టీల్ ఫ్యాక్టరీలు నడిపించారు. మామిడి తోటలు చూసుకొనేవారు. దేనికీ లోటు ఉండేది కాదు. కానీ విధి మా రాతను మార్చేసింది. కుటుంబ కలహాలతో మా నాన్న కట్టుబట్టలతో ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన... తను పోయేలోపే నాకు స్థిరమైన జీవితం ఇవ్వాలనుకున్నారు. దాంతో చిన్న వయసులోనే నాకు పెళ్లి చేశారు. తరువాత కొద్ది కాలానికే నాన్న మరణించారు. మాకంటూ ఏ ఆధారం లేకుండాపోయింది. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ మాది. మా నాన్న పోయిన సమయంలోనే గట్టిగా నిర్ణయించుకున్నాను... బాగా చదువుకోవాలని. నా కాళ్లపై నేను నిలబడాలంటే అదొక్కటే మార్గమని అర్థమైంది. నాకు మొదటి నుంచీ ఇంగ్లీష్ బాగా వచ్చు. అందుకే బీఏ- ఇంగ్లీష్ చేశాను. డిగ్రీ అవ్వగానే రాజస్థాన్ సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో ఎంబీయే చదివాను. అప్పటి నుంచి ఎంబీయే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చేదాన్ని. కొద్ది రోజుల్లోనే నా సాయం కోరే విద్యార్థులు రెట్టింపు అయ్యారు. దీనికి ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో 'విన్నింగ్ ఎడ్జ్' పేరిట ఒక సంస్థ ప్రారంభించాను. అందులో ఇంగ్లీష్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో తర్ఫీదు ఇచ్చాను. విద్యార్థులను కేంబ్రిడ్జ్ ఈఎస్‌ఓఎల్ పరీక్షలకు సన్నద్ధం చేశాను. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్గదర్శనం చేశాను. ప్రభుత్వం తరుపున కూడా నైపుణ్య శిక్షణ శిబిరాలు నిర్వహించాను.

ఊహించని మలుపు...

ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు నా శిక్షణ కార్యక్రమాలు కొనసాగించాను. అలా వచ్చిన డబ్బుతో మహారాష్ట్ర రత్నగిరిలో కొంత భూమి కొన్నాను. అందులో ఆల్ఫాన్సో మామిడి పండ్లు పండించాలన్నది నా ఉద్దేశం. అయితే నా జీవితం అనుకోని మలుపు తీసుకుంది. అప్పట్లో 'ఐక్రియేట్' (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ టెక్నాలజీ) సదస్సుకు హాజరయ్యాను. స్టార్టప్ అంటే ఏమిటో అప్పుడే నాకు తెలిసింది. అప్పటికే నేను శిక్షణ ఇస్తుండడంతో... ఐక్రియేట్ వారు తమతో కలిసి పని చేయమని అడిగారు. కొంతకాలానికి అక్కడ ఫుల్‌టైమ్ ట్రైనర్‌ను అయ్యాను. ఎంతోమంది ఉద్యోగార్థులను ఉద్యోగాలు కల్పించేవారిగా తీర్చిదిద్దగలిగాను. అది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది.

కొవిడ్‌తో కొత్త దారి...

ఇదిలావుంటే కొవిడ్ మహమ్మారి నన్ను మరోమారు అప్రమత్తం చేసింది. నాకు హృదయ సంబంధిత సమస్యలున్నట్టు వైద్య పరీక్షల్లో తేలింది. ఎక్కువ శ్రమించకూడదు. అతిగా ఆలోచించకూడదు. మానసిక ఒత్తిడికి లోనుకాకూడదు. నా గురించి నేను శ్రద్ధ తీసుకోకపోతే ప్రమాదమని వైద్యులు చెప్పారు. అదే సమయంలో మా అబ్బాయి శాశ్వత్ బయోటెక్నాలజీ డిగ్రీ కూడా పూర్తయింది. వాడు పోషకాలున్న ఆహారం అందించే వ్యాపారం ప్రారంభించాలని పట్టుదలగా ఉన్నాడు. తను ఫుట్‌బాల్ క్రీడాకారుడు. ఫిట్‌నెస్, ఆరోగ్యం గురించి ఎంతో శ్రద్ధ తీసుకొంటాడు. వాడి ఆలోచనలకు తగినట్టే ఫుడ్ బిజినెస్ మొదలుపెడదామని అనుకున్నాం.



ఎంతో పరిశోధించి...

దాని కోసం ఎంతో పరిశోధించాం. భారతీయుల ఆహారపు అలవాట్ల గురించి పరిశోధిస్తున్నప్పుడు మాకు తెలిసిందేంటంటే... మనం ఉడకబెట్టిన ఆహారం ఎక్కువగా తీసుకొంటామని. రోజులో ఒకటో అరో మాత్రమే పండ్లు తింటామని. కానీ పోషకాలు పూర్తి స్థాయిలో శరీరానికి అందాలంటే ఆ మోతాదు సరిపోదు. ఈ క్రమంలోనే ఐదు రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో ఒక స్మూతీ తయారు చేశాం. తద్వారా ఎలాంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ తీపి పదార్థాలు లేని స్వచ్ఛమైన ఆహారం వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మా స్టార్టప్‌కు 'టాన్స్' అనే పేరు నిర్ధారించాం. గ్రాంట్ కోసం ఓ యూనివర్సిటీని సంప్రతిస్తే వారు కుదరదన్నారు. దాంతో మేమే నిధులు సమకూర్చుకుని సంస్థను నెలకొల్పాం. ప్రస్తుతం ఆరు రకాల వెగాన్ స్మూతీలు విక్రయిస్తున్నాం. అమెజాన్‌తో పాటు మా వెబ్‌సైట్‌లో కూడా ఇవి అందుబాటులో ఉన్నాయి. రెండేళ్ల కిందట ప్రారంభించిన మా కంపెనీ ఇప్పుడు లాభాల బాటలో పయనిస్తోంది. అన్నిటికంటే సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చేదేంటంటే... మా సంస్థ ద్వారా మరికొందరికి, ముఖ్యంగా మహిళలకు ఉపాధి కల్పించగలగడం. రాబోయే రోజుల్లో మరిన్ని తాజా ఉత్పత్తులతో సంస్థను మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నాం."

మేకప్

అందానికి అందలం

మేకప్‌లో భిన్నమైన ధోరణులు పుట్టుకొస్తూనే ఉంటాయి. కాలానుగుణంగా మారిపోతున్న ఈ ధోరణులను సందర్భానికి తగ్గట్టు అనుసరిస్తూ ఉండాలి. ప్రస్తుతం వాడుకలో ఉన్న మేకప్ ధోరణులు ఇవే!

గ్లామర్ మేకప్

మందపాటి పెదవులు, మెరుపులీనే చర్మం, తీర్చిదిద్దిన కళ్లు గ్లామర్ మేకప్ రహస్యాలు. ప్రత్యేకించి సంప్రదాయ వస్త్రధారణకు అద్భుతంగా నప్పే ఈ తరహా మేకప్‌లో ఐషాడోల కోసం భిన్నమైన రంగులను ఎంచుకుంటూ ఉంటారు. ఎమరాల్డ్ గ్రీన్, శాఫైర్ బ్లూ, రూడీ రెడ్ రంగుల ఐషాడోలు ఈ తరహా మేకప్‌లో ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటాయి. అయితే కళ్లకు బంగారం లేదా రాగి రంగు ఐషాడో అద్దుకోవడం వల్ల కళ్ల ఆకర్షణ రెట్టింపవుతుంది.

లిప్‌స్టిక్స్ ఇలా...

ముదురు రంగు లిప్‌స్టిక్స్‌కు ఆదరణ పెరిగింది. డీప్ ప్లమ్, క్లాసిక్ రెడ్, వైబ్రెంట్ కోరల్ రంగుల లిప్‌స్టిక్‌లతో మేకప్‌కు రెట్టింపు ఆకర్షణ దక్కుతుంది. సంప్రదాయ వేడుకలకు ఇవెంతో చక్కగా నప్పుతాయి. అంతకంటే లేత రంగులను ఇష్టపడేవారు టింటెడ్ లిప్‌బామ్ లేదా గ్లాస్ వాడుకోవచ్చు.



కలలు కనే కళ్ల కోసం...

నల్లని కాటుక కళ్లకు రోజులు చెల్లాయి. టీల్, పర్పుల్, గోల్డ్ లైనర్ల హవా మొదలైంది. ఈ లైనర్లకు మందపాటి కృత్రిమ కనురెప్పలను జోడించి కవ్వించే కళ్లను తీర్చిదిద్దుకునే ధోరణి మొదలైంది. అయితే ఈ లైనర్ల అందం చెక్కుచెదరకుండా ఉండడం కోసం తడికి కారిపోకుండా ఉండే ఐలైనర్స్‌నే ఎంచుకోవాలి.

టైల్స్ మురికిని ఇలా వదిలించండి!

నేల మీద తెల్లగా మెరుస్తూ ఉండే టైల్స్... ఇంటి శోభను పెంచుతాయి. వీటిని శుభ్రం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అవి ఎప్పటికీ కొత్తవాటి లాగే కనిపిస్తాయి.

- టైల్స్‌ని వ్యాక్యూమ్ క్లీనర్ లేదా మెత్తని చీపురుతో ప్రతిరోజూ శుభ్రం చేయాలి. దుమ్ము, ధూళి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే టైల్స్ చక్కగా మెరుస్తూ కనిపిస్తాయి.
- ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల కల్లు ఉప్పు వేసి కరిగించాలి. ఇందులో పలుచని వస్త్రాన్ని ముంచి గట్టిగా పిండి దాంతో ఇల్లంతా తుడవాలి. టైల్స్ మీద మరకలు ఉంటే వాటి మీద కొన్ని ఉప్పు నీళ్లు చల్లి గట్టిగా రుద్ది తుడవాలి. ప్రతిరోజూ ఇలా చేస్తూ ఉంటే టైల్స్ మీద చేరే బ్యాక్టీరియా పూర్తిగా నశిస్తుంది.
- బకెట్ నీళ్లలో కొద్దిగా టూత్‌పేస్టు వేసి కలపాలి. ఇందులో ముంచిన మాప్‌తో టైల్స్‌ని తుడిస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- ఒక కప్పు వేడినీటిలో అర కప్పు వైట్ వెనిగర్, ఒక చెంచా బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక బకెట్ నీళ్లలో వేసి కలపాలి. ఇందులో ముంచిన మాప్‌తో ఇల్లంతా తుడిస్తే... టైల్స్ మీద మురికి మొత్తం తొలగిపోయి కొత్తవాటిలా మెరుస్తాయి.
- రెండు చెంచాల హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణంలో ఒక చెంచా బేకింగ్ సోడా వేసి కలపాలి. ఈ పేస్టుని టైల్స్ మధ్య కనిపించే మురికి మీద రాయాలి. రెండు నిమిషాల తరవాత పొడి వస్త్రంతో తుడిచేస్తే మురికి మొత్తం తొలగిపోతుంది. ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం వేసి కలపాలి. ఇందులో సన్నని వస్త్రం లేదా మాప్ ముంచి దానితో టైల్స్‌ని రుద్దుతూ తుడిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక కప్పు వేడి నీటిలో ఒక కప్పు వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. దీన్ని టైల్స్‌పై చేరిన మురికి లేదా మరకలపై కొద్దిగా స్ప్రే చేసి పాత టూత్‌బ్రష్‌తో రుద్ది వెంటనే కాగితం లేదా వస్త్రంతో తుడవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే టైల్స్ రంగు మారకుండా ఉంటాయి.
- టైల్స్‌ని శుభ్రం చేయడానికి బజార్లో దొరికే రసాయన ద్రావణాలను ఉపయోగించకపోవడమే మంచిది. వీటి వల్ల అవి మెరుపుని కోల్పోతాయి.



అది సజ్జల స్క్రిప్ట్!

- దాని ప్రకారమే నేను మాట్లాడాను
- పోలీసుల ముందు అంగీకరించిన పోసాని
- అన్నీ తెలిసే విద్వేషపూరిత వ్యాఖ్యలు
- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి
- రెండు వారాల కస్టడీ విధించిన కోర్టు
- పోలీసులతో 'లవ్ యూ రాజా.. అంటూ చిత్రాలు


పోసానిని అన్నమయ్యజిల్లా రాజంపేట సబ్‌జైలుకు తరలిస్తున్న పోలీసులు

రాయచోటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ముఖ్య నాయకుడు, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి పంపిన 'స్క్రిప్టు' ప్రకారమే తాను మాట్లాడానని సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి పోలీసుల ముందు అంగీకరించినట్లు తెలిసింది. ఆ వీడి యోలను అప్పటి వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డి వైరల్ చేశారని పోసాని పేర్కొన్నట్లు సమాచారం. తాను వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నట్లు... అవి కులాల మధ్య విభేదాలు సృష్టించే అవకాశమున్నట్లు తెలినా... ఉద్దేశపూర్వకంగానే అలా మాట్లాడినట్లు అంగీకరించినట్లు ఆయన 'కన్‌ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. గురువారం రాత్రి పొద్దుపోయాక అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరు పరిచారు. అంతకుముందు పోలీసులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సరిగా బదులివ్వకుండా 'ఐ లవ్ యూ రాజా' అని వింతగా ప్రవర్తించిన పోసాని... కోర్టు హాలులో న్యాయాధికారిని 'అన్నా' అని సంబోధించారు. ఆయన తరఫున వైసీపీ లీగల్ సెల్ నుంచి పొన్నవోలు సుధాకర్ రెడ్డితోపాటు ఏకంగా 15 మంది న్యాయవాదులు కోర్టుకు హాజరయ్యారు. ప్రభుత్వం తరఫున రైల్వేకోడూరు కోర్టు ఏపీపీ చిన్నబాబు, మరో ఇద్దరు న్యాయవాదులు వాదనలు వినిపించారు. రాత్రి 10.30 గంటల నుంచి అర్ధరాత్రి దాటాక 2.30 వరకు వాదనలు జరిగాయి. "పోసాని ఒక సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడారు. సినీ పరిశ్రమలో ఓ రెండు సామాజికవర్గాల పెత్తనమే ఉందంటూ పోసాని కులాల మధ్య చిచ్చుకు ప్రయత్నించారు" అని చిన్నబాబు తెలిపారు. పోలీసులు పెట్టిన సెక్షన్లలో పస లేదని పోసాని తరఫు న్యాయవాది పొన్నవోలు పేర్కొన్నారు. కోర్టులో పోసాని మాట్లాడుతూ జడ్జిని పలుమార్లు అన్నా.. అని సంబోధించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తేజసాయి పోసానికి మార్చి 12 వరకు రిమాండ్ విధిస్తూ... శుక్రవారం తెల్లవారుజాము 5.40 గంటలకు తన తీర్పును వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు పోసానిని శుక్రవారం ఉదయం రాజంపేట సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనకు రిమాండ్ ఖైదీ నంబరు 2261 కేటాయించారు. జైలులో పోసాని కొద్దిపాటి అస్వస్థతకు గురయ్యారు.

రిమాండ్ రిపోర్టులో కీలక వివరాలు...

రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక వివరాలను పొందుపరిచారు. "కులాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టేలా పోసాని మాట్లాడారు. విభేదాలు సృష్టించి, అల్లర్లకు దారితీసేలా... ఉద్దేశపూర్వకంగానే మాట్లాడారు. ఒక ప్రముఖ నటుడిని కించపరిచేలా, ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా దూషణలు చేశారు. ఇంకో వీడియోలో దళితులను అవమానించారు. తన పిల్లలకు దళితులతో వివాహం చేయబోనంటూ వ్యాఖ్యానించారు. తన 'పొలిటికల్ మాస్టర్స్'ను సంతృప్తి పరచడమే లక్ష్యంగా ఇలా మాట్లాడారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉన్నందున... పోసానిని జ్యూడీషియల్ కస్టడీ విధించండి" అని పోలీసులు కోర్టును కోరారు.

మామునూరు విమానాశ్రయానికి పచ్చ జెండా



(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. జీఎంఆర్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఎట్టకేలకు ఆ సంస్థ అంగీకారం తెలపడంతో మామునూరు విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్‌కుమార్ ఝా.. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చైర్మన్‌కు లేఖ రాశారు. ఆ లేఖను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్(హెచ్‌ఐఏఎల్)కు జత చేశారు. ఈ విషయాన్ని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం కూడా ధ్రువీకరించింది. వరంగల్‌లోని మామునూరులో ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసి, అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు లేఖలో అమిత్‌కుమార్ ఝాపేర్కొన్నారు. హెచ్‌ఏఐఎల్ తన బోర్డు ఆఫ్ డైరక్టర్స్ సమావేశంలో మామునూరు విమానాశ్రయానికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధన నుంచి తప్పుకొంటూ ఇచ్చిన నిరభ్యంతర పత్రాన్ని కేంద్రం ఇప్పుడు ఆమోదించిందని తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంపిన లేఖలను కూడా ప్రస్తావించారు. ఈ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కావాల్సిన 253 ఎకరాల అదనపు భూమిని ఏఏఐకి అప్పగించేందుకు తెలంగాణ ప్రభుత్వం గతంలోనే రూ.205 కోట్లను విడుదల చేసిన విషయాన్నీ గుర్తు చేశారు.

నిరభ్యంతర పత్రం సమర్పణతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. కాగా, ఆ సమయంలోనే కేంద్రం, హెచ్‌ఐఏఎల్ మధ్య ఒప్పందం కుదిరినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. ఈ ఒప్పందంలోని క్లాజ్ 5.2 ప్రకారం.. శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల పరిధిలో 25 ఏళ్లపాటు కొత్తగా దేశీయ లేదా అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుమతించరాదనే షరతు ఉన్నట్లు పేర్కొంది. దీంతో ఈ పరిధిలో తెలంగాణలో మరో విమానాశ్రయం నిర్మాణం జరగలేదని వెల్లడించింది. ఈ ఒప్పందంపై హెచ్‌ఐఏఎల్ ఇచ్చిన నిరభ్యంతర పత్రాన్ని ఈ ఏడాది జనవరి 15న తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిందని తెలిపింది. కాగా, మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంషాబాద్‌లోని విమానాశ్రయ సంస్థ (జీఎమ్మార్) నిరభ్యంతర పత్రం ఇచ్చేందుకు సిద్ధమైందని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి' గతేడాది అక్టోబరు 25న "మామునూరుకు మోక్షం" శీర్షికన కథనాన్ని ప్రచురించింది.

ఏ-320 విమానాలు తిరిగేలా..



మామునూరులో ఏ-320 (ఎయిర్‌బస్-320) లాంటి పెద్ద విమానాలు తిరిగేలా విమానాశ్రయం నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన డిజైన్లు, వివిధ సాంకేతిక అంశాల విషయం ఇప్పటికే ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. ఏ-320 స్థాయి విమానాలు అంటే.. ఒక్కో దానిలో ఒకేసారి 180 మంది ప్రయాణికులు ప్రయాణించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో వివిధ కంపెనీలకు సంబంధించి దేశ విదేశాల నుంచి వచ్చే సామగ్రి, ముడి పదార్థాలను తీసుకొచ్చే పెద్ద పెద్ద కార్గో విమానాలు కూడా ఇక్కడ దిగేందుకు వీలుగా రన్‌వేలను ఏర్పాటు చేయనున్నారు. పెద్ద విమానా లు తిరిగేందుకు వీలుగా 2,800 మీటర్ల పొడవు, 75 మీటర్ల వెడల్పుతో రన్‌వేను నిర్మించనున్నారు. ఇక మామునూరు ఎయిర్‌పోర్టును భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయంగానూ మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టుకు కేటాయించిన, భూ సేకరణ చేసి కేటాయించబోతున్న భూముల విస్తీర్ణం 949.44 ఎకరాలు. అంతర్జాతీయ విమానాశ్రయాల ఏర్పాటు నిబంధనల మేరకే భూమి కేటాయింపు జరిగిందని అధికారిక వర్గాలు అంటున్నాయి. కాగా 2023 జూలై, 2024 ఏప్రిల్‌లో ఏఏఐ నిర్వహించిన భూ పరీక్షలు, టెక్నో ఎకనామికల్ ఫీజబిలిటీ స్టడీ రిపోర్టును కేంద్రానికి సమర్పించింది. వివిధ పరీక్షల కోసం మూడు విమానాలతో ఎయిర్‌వ్యూను కూడా చేపట్టి, విమానాల రాకపోకలకు వాతావరణం ఏయే సమయాల్లో ఎలా ఉందనే అంశాన్ని కూడా పరిశీలించారు.

1930లోనే వరంగల్‌లో ఎయిర్‌పోర్టు..

మామునూరులో విమానాశ్రయం 1930లో నిజాం హయాంలోనే ఏర్పాటు కాగా.. వివిధ కారణాలతో 1980లో మూతపడింది. ఎయిర్‌పోర్టు కోసం నిజాం కాలంలోనే 1,875 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ భూమిలో నుంచే నవోదయ విద్యాలయానికి 23.20 ఎకరాలు, పోలీసు శిక్షణ కేంద్రానికి 59 ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10 ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101 ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్‌కు 241.24 ఎకరాలతోపాటు మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ వర్సిటీకి కేటాయించారు. ప్రస్తుతం ఏఏఐ పరిధిలో 696.14 ఎకరాల భూమి ఉంది. అయితే ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అదనంగా 253 ఎకరాల భూమి కావాలని ఏఏఐ ప్రభుత్వాన్ని కోరడంతో.. ప్రభుత్వం ఆ భూముల సేకరణకు నిధులు కూడా మంజూరు చేసింది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే..ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరగడంతోపాటు పరిశ్రమల స్థాపనకు పెద్ద కంపెనీలు ముందుకువచ్చే అవకాశాలుంటాయి.

సీఎం రేవంత్ కృతజ్ఞతలు..

మామునూరు విమానాశ్రయానికి అనుమతి ఇచ్చినందుకు ప్రధాని నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరఫున సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడుకు, ఏఏఐకి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణకు ఇదో గేమ్ చేంజర్



తెలంగాణ రాష్ట్రానికి వరంగల్ విమానాశ్రయం గేమ్ చేంజర్‌గా, రాష్ట్రాభివృద్ధికి కీలక మైలురాయిగా మారుతుంది. ఇదో విమానాశ్రయం మాత్రమే కాదు.. తెలంగాణ అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుంది. వరంగల్ ప్రధాన ప్రాంతీయ కేంద్రంగా మారడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. మామునూరు విమానాశ్రయం పనులు వేగంగా ముందుకు సాగేందుకు కట్టుబడి ఉన్నాం.

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

సీఎం ప్రత్యేక చొరవతోనే..



సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పదేళ్లలో రాష్ట్రానికి ఒక్క ఎయిర్‌పోర్టు కూడా రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలల్లోనే మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు సాధించింది. సహకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు.

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

దశాబ్దాల కల నెరవేరింది



మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్రం అనుమతినివ్వడంతో వరంగల్ జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరినట్లయింది. విమానాశ్రయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అవసరమైన అదనపు భూముల సేకరణ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకారం అందించాలి. విమానాశ్రయం పూర్తయితే జిల్లా అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది.

- మంత్రి కొండా సురేఖ

మోదీ సహకారంతోనే..



ప్రధాని మోదీ సహకారంతో వరంగల్ గడ్డపై విమానాశ్రయం ఏర్పాటు కాబోతోంది. ఈ ప్రగతినే తెలంగాణ కోరుకుంటోంది. ప్రతీ తెలంగాణ గుండె.. మోదీకి ధన్యవాదాలు చెబుతోంది. తెలంగాణ ప్రజానీకం మోదీకి రుణపడి ఉంటుంది.

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మామునూరు ఎయిర్‌పోర్టు ప్రాంతం





టైటిల్‌కు తగ్గట్లు రెట్టింపు వినోదం

నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. చిత్రబృందం శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నాగవంశీ మాట్లాడుతూ "మార్చి 28న 'హరిహర వీరమల్లు' చిత్రం రిలీజ్ అయితే మా 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం విడుదలను కొత్త తేదీకి మార్చుకుంటాం. లేదంటే 29న విడుదల చేస్తాం. మంచి సినిమా తీశాం. మీరందరూ థియేటర్‌కు వచ్చి బాగా నవ్వుకునేలా ఉంటుంది. కథని ఆశించి సినిమాకు రావొద్దు. లాజిక్‌లు వెతక్కండి. కథలేదని మేమే చెబుతున్నాం కాబట్టి మళ్లీ విమర్శించొద్దు' అన్నారు. కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ 'తొలి భాగంతో పోల్చితే రెండో భాగంలో పదింతల వినోదం ఉంటుంది. ప్రేక్షకులందరూ తమ స్నేహితులను గుర్తు చేసుకుంటారు' అని అన్నారు. 'మ్యాడ్ స్క్వేర్' టైటిల్‌కు తగ్గట్లు రెట్టింపు వినోదం ఉంటుందని హారిక సూర్యదేవర చెప్పారు. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుందని సంతోశ్ శోభన్ చెప్పారు. సినిమా పక్కా ఎంటర్‌టైన్ చేస్తుంది అని నార్నె నితిన్ అన్నారు.

ద్వితీయార్థంలోనే బన్నీ-త్రివిక్రమ్ చిత్రం

"అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుందంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. ఈ ఏడాది ద్వితీయార్థంలోనే ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు.

నటి జయప్రద సోదరుడు రాజబాబు కన్నుమూత



సీనియర్ నటి జయప్రద అన్నయ్య రాజబాబు(69) అనారోగ్యంతో గురువారం సాయంత్రం కన్ను మూశారు. కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్న ఆయన ఐదు రోజుల క్రితం హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చేరి, డయాలసిస్ చేయించుకుంటున్నారు. గురువారం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. రాజమండ్రికి చెందిన రాజబాబు గతంలో 'రాజమండ్రి రోమియో' అనే చిత్రంలో హీరోగా నటించారు. జయప్రద తమ్ముడు శ్రీరామ్‌కుమార్ కూడా నటుడే. అక్క నిర్మించిన 'చిన్నా' చిత్రంలో హీరోగా నటించారు. సోదరుడు రాజబాబు మరణంతో భావోద్వేగానికి గురైన జయప్రద ఈ కష్ట కాలంలో తమ కుటుంబానికి అండగా ఉండాలనీ, ఆయన గురించి ప్రార్థనలు చేయాలని కోరుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

సముద్రంలో సాహసాలు



సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా నటిస్తూ, నిర్మించిన చిత్రం 'కింగ్స్టన్'. కమల్ ప్రకాశ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 7న ఈ చిత్రం విడుదలవుతోంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత మహేశ్వర్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. చిత్ర బృందం శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. సముద్ర తీర గ్రామాన్ని కాపాడేందుకు హీరో చేసిన సాహసాల నేపథ్యంలో కథ సాగుతుందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. తొలి భారతీయ సీ అడ్వెంచర్ ఫాంటసీ చిత్రమిదని ఈ సందర్భంగా యూనిట్ పేర్కొంది.

చిత్రజ్యోతి

SINCE 1965

'నేను చెప్పే వరకు ఆట పూర్తవదు'



శ్రీవిష్ణు హీరోగా హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో రూపొందుతోన్న పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'మృత్యుంజయ్'. రమ్య గుణ్ణం సమర్పణలో లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్నారు. రెబా జాన్ హీరోయిన్. 'సామజవరగమన' తర్వాత శ్రీవిష్ణు, రెబా జాన్ కలయికలో రాబోతున్న చిత్రమిది. శుక్రవారం శ్రీవిష్ణు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. టీజర్ చివర్లో 'నేను చెప్పే వరకు గేమ్ ఫినిష్ కాదు' అంటూ శ్రీవిష్ణు చెప్పే డైలాగ్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. కాగా, శ్రీవిష్ణు తన కొత్త సినిమాను అనౌన్స్ చేశారు. కొత్త దర్శకుడు యదునాథ్ మారుతీరావు దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నం.3గా సుమంత్ నాయుడు నిర్మించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రం ఒంగోలు పట్టణం నేపథ్యంలో సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది.

మూడేళ్ల కష్టం ఫలించింది



- జీవా

'వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్స్‌కు ప్రాధాన్యమున్న చిత్రం కావడంతో గత మూడేళ్లుగా 'అగత్యా' చిత్రం కోసం కష్టపడుతున్నాను. ఇప్పుడు ప్రేక్షకులు మా చిత్రాన్ని అమితంగా ఆదరిస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని హీరో జీవా అన్నారు. ఆయన కథానాయకుడిగా పా. విజయ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. అర్జున్, సర్జా, రాశిఖన్నా కీలకపాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం విడుదలను పురస్కరించుకొని జీవా మీడియాతో మాట్లాడుతూ 'దర్శకుడు గొప్ప స్క్రిప్ట్‌తో అద్భుతమైన సినిమా ఇచ్చారు. చాలా కొత్త టెక్నాలజీని వాడాం. ఇంటర్నేషనల్ టెక్నికల్ టీమ్‌తో పనిచేశాం. హీరోగా మంచి సినిమా చేశాననే తృప్తి నిచ్చింది' అని చెప్పారు.

సెమీస్‌లో ఆస్ట్రేలియా


హెడ్ (59 నాటౌట్)



హెడ్ అజేయ హాఫ్ సెంచరీ
వరుణుడి ఆటంకం
అఫ్ఘాన్‌తో మ్యాచ్ రద్దు
ఇరుజట్లకూ చెరోపాయింట్
చాంపియన్స్ ట్రోఫీ

సెదిఖుల్లా (85)

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ కూడా వర్షం కారణంగా పూర్తిగా సాగకుండానే రద్దయ్యింది. దీంతో నాలుగు పాయింట్లతో గ్రూప్ 'బి' నుంచి కంగారూలు నాకౌట్‌లోకి అడుగుపెట్టారు. మరోవైపు మూడు పాయింట్లతో ఉన్న అఫ్ఘాన్ సాంకేతికంగా మాత్రమే రేసులో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్ 207 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడిస్తే రన్‌రేట్ పరంగా అఫ్ఘాన్‌కు అవకాశం ఉంటుంది. పాక్‌లో వర్షం కారణంగా వరుసగా మూడో మ్యాచ్ రద్దు కావడం గమనార్హం. అయితే వరుణుడు అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌కు ఆటంకం కలిగించలేదు. దీంతో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈ జట్టు 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ గుర్బాజ్ తొలి ఓవర్‌లోనే డకౌట్ కాగా, చివరి మ్యాచ్‌లో శతక హీరో జద్రాన్ (22) త్వరగానే అవుటయ్యాడు. ఈ దశలో సెదిఖుల్లా (85) సంయమనం చూపాడు. ముందుగా జద్రాన్‌తో కలిసి రెండో వికెట్‌కు 67, నాలుగో వికెట్‌కు హస్మతుల్లా (20)తో కలిసి 68 పరుగులు జత చేశాడు. అయితే సెంచరీకి చేరువలో సెదిఖుల్లాను జాన్సన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత అజ్మతుల్లా ఒమర్జాయ్ (67) బాధ్యత తీసుకున్నాడు. ఐదు సిక్సర్లతో చెలరేగిన అతడి ఆట తీరుతో అఫ్ఘాన్ స్కోరు 199/7 నుంచి 270 దాటగలిగింది.

12.5 ఓవర్ల ఆటే..: ఓ మాదిరి ఛేదనలో ఆసీస్ ఆట వర్షంతో కేవలం 12.5 ఓవర్ల పాటే సాగింది. కానీ ఓపెనర్ హెడ్ (59 నాటౌట్) దూకుడుతో అప్పటికే జట్టు వికెట్ నష్టానికి 109 పరుగులు చేసింది. వరుస ఫోర్లతో చెలరేగిన హెడ్ ఇన్నింగ్స్‌తో జట్టు పవర్‌ప్లేలోనే 90 పరుగులు సాధించింది. అటు 34 బంతుల్లోనే తన ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. అతడికి షార్ట్ (20), స్మిత్ (19నాటౌట్) సహకరించారు. మరోవైపు వీరి ఇన్నింగ్స్ 12.5 ఓవర్ల సమయంలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌కు బ్రేక్ పడింది. గంటన్నర తర్వాత వర్షం తెరిపినిచ్చినా అవుట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

సంక్షిప్త స్కోర్లు
అఫ్ఘానిస్థాన్: 50 ఓవర్లలో 273 ఆలౌట్ (సెదిఖుల్లా 85, అజ్మతుల్లా 67, జద్రాన్ 22; డ్వార్షుస్ 3/47, జంపా 2/48, జాన్సన్ 2/49); **ఆస్ట్రేలియా:** 12.5 ఓవర్లలో 109/1. (హెడ్ 59 నాటౌట్, షార్ట్ 20, స్మిత్ 19 నాటౌట్; ఒమర్జాయ్ 1/43)

1 చాంపియన్స్ ట్రోఫీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (29 బంతుల్లో) సాధించడంతో పాటు పవర్ ప్లేలో ఎక్కువ పరుగులు (90) సాధించిన జట్టుగా ఆసీస్.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
దక్షిణాఫ్రికా X ఇంగ్లండ్
మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఇంగ్లండ్ కెప్టెన్సీకి బట్లర్ రాజీనామా



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ జట్టు దారుణ వైఫల్యంతో పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి జోస్ బట్లర్ గుడ్‌బై చెప్పాడు. సారథ్యాన్ని వదులుకుంటున్నట్టు బట్లర్ శుక్రవారం ప్రకటించాడు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగే తమ చివరి గ్రూప్ మ్యాచే కెప్టెన్‌గా తనకు ఆఖరిదని తెలిపాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా బుధవారం అఫ్ఘానిస్థాన్ చేతిలో ఓడడంతో ఇంగ్లండ్ జట్టు సెమీఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. సఫారీలతో శనివారం జరిగే పోరులో గెలిచినా ఇంగ్లండ్‌కు ప్రయోజనం లేదు. ఈ నేపథ్యంలో టోర్నీలో జట్టు పరాభవానికి నైతిక బాధ్యత వహిస్తూ కెప్టెన్సీ నుంచి బట్లర్ తప్పుకొన్నాడు. 'ఇంగ్లండ్ కెప్టెన్‌గా వైదొలుగుతున్నా. ఈ టోర్నీలో రెండు ఓటములతో సెమీస్‌కు దూరమయ్యాం. గత టోర్నీల పరాజయాలు కూడా నన్ను వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కెప్టెన్సీ నుంచి వైదొలగడమే మంచిది. ఇక, జట్టులో ఆటగాడిగా కొనసాగుతా' అని 34 ఏళ్ల బట్లర్ వెల్లడించాడు. 2022లో ఇయాన్ మోర్గాన్ నుంచి పరిమిత ఓవర్ల కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్న బట్లర్.. ఆ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టును గెలిపించాడు. ఆ తర్వాత 2023 వన్డే ప్రపంచకప్‌తో పాటు గతేడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టు విఫలమైంది. ఇటీవల భారత్‌తో సిరీస్‌లోనూ ఇంగ్లండ్ చెత్తగా ఆడింది. వైస్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ జట్టు సారథిగా ఎంపికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా ఇంగ్లండ్ టెస్టు జట్టుకు బెన్‌స్టోక్స్ కెప్టెన్‌గా ఉన్న సంగతి తెలిసిందే.


మెగ్ లానింగ్ (60 నాటౌట్)

ముంబై జోరుకు బ్రేక్

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x బెంగళూరు
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

రాణించిన లానింగ్, షఫాలీ
ఢిల్లీ ఘనవిజయం
మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు: హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళుతున్న ముంబై ఇండియన్స్ మహిళల జట్టుకు బ్రేక్ పడింది. ఆల్‌రౌండ్ షో కనబర్చిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మెగ్ లానింగ్ (60 నాటౌట్), షఫాలీ (43) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగారు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 123 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22), హేలీ మాథ్యూస్ (22) మాత్రమే రాణించారు. స్పిన్నర్లు మిన్ను మణి (3/17), జొనాస్సెన్ (3/25) ధాటికి 23 రన్స్ వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లు నేలకూలాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో ఢిల్లీ 14.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 124 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు లానింగ్, షఫాలీ తుఫాన్ ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించారు. నాలుగో ఓవర్‌లో 6,4,4తో 16 రన్స్ రాబట్టిన షఫాలీ.. తొమ్మిదో ఓవర్‌లో రెండు సిక్సర్లతో మరింత జోరు చూపింది. అయితే తొలి వికెట్‌కు 85 పరుగులు జత చేశాక అమన్‌జోత్‌కు చిక్కింది. ఆ తర్వాత లానింగ్ చెలరేగి అర్ధసెంచరీ పూర్తి చేసుకోవడంతో పాటు, మరో 33 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

సంక్షిప్త స్కోర్లు:
ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 123/9 (హర్మన్‌ప్రీత్ 22, మాథ్యూస్ 22, బ్రంట్ 18, అమన్‌జోత్ 17 నాటౌట్; మిన్ను మణి 3/17జొనాసెన్ 3/25).
ఢిల్లీ క్యాపిటల్స్: 14.3 ఓవర్లలో 124/1 (మెగ్ లానింగ్ 60 నాటౌట్, షఫాలీ 43; అమన్‌జోత్ 1/12).



డబ్బుతో సంబంధం లేదు.. అందరూ ఆడొచ్చు!

- ప్రతిభ ఉంటే చాలు
- పిల్లలపై నమ్మకముంచాలి
- గోపీచంద్ వ్యాఖ్యలతో విభేదించిన సింధు తండ్రి రమణ

న్యూఢిల్లీ: ఆర్థిక వెసులుబాటు ఉన్నవారే క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని బ్యాడ్మింటన్ దిగ్గజం, జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో స్టార్ షట్లర్ సింధు తండ్రి పీవీ రమణ పరోక్షంగా విభేదించారు. ఆదాయంతో సంబంధం లేదనీ, అందరూ ఆటలాడొచ్చని రమణ అన్నారు. క్రీడల్లో అత్యున్నతస్థాయికి ఎదిగేందుకు ప్రతిభ ఉంటే చాలన్నారు. దిగువ మధ్య తరగతి నుంచి వచ్చిన తాను కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వాలీబాల్ క్రీడలో జాతీయస్థాయిలో రాణించగలిగానని, ఆ క్రీడవల్లే నాకు రైల్వేస్‌లో ఉద్యోగం వచ్చిందని అర్జున అవార్డు గ్రహీత అయిన రమణ వెల్లడించారు. అన్నారు. 'నా ఇద్దరు కుమార్తెల్లో పెద్దమ్మాయి దివ్య చిన్నతనంలో నెట్‌బాల్ ఆడేది. కానీ, ఆమె చదువుపై ఎక్కువగా ఆసక్తి కనబర్చడంతో ఆ దిశగా ప్రోత్సహించా. ఆమె వైద్యురాలైంది. చిన్నమ్మాయి సింధు పదో తరగతికి వచ్చేసరికి బ్యాడ్మింటన్‌లో మంచి ఫామ్‌లో ఉంది. దీంతో స్పాన్సర్లు దొరికారు. ఆ తర్వాత సింధు కెరీర్ గురించి మీకు తెలిసిందే. కెరీర్ ఎదుగుదలలో కొన్ని అవాంతరాలు ఎదురవ్వొచ్చు. కానీ, వాటిని అధిగమించి ముందుకెళ్లాలి. తల్లిదండ్రులు పిల్లలపై నమ్మకముంచాలి. వారి ప్రతిభను గుర్తించి ఆ దిశగా ముందుకు తీసుకెళ్లాలి' అని 1986లో ఆసియా క్రీడల్లో పతకం గెలిచిన భారత జట్టులో సభ్యుడైన రమణ వివరించారు.


దూబే (3/88)

దూబే కొత్త చరిత్ర

రంజీల్లో అత్యధిక వికెట్లతో రికార్డు
కేరళతో ఫైనల్ విదర్భకు ఆధిక్యం

నాగ్‌పూర్: కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భకు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 131/3తో మూడోరోజు ఆటను కొనసాగించిన కేరళ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. దీంతో మొదటి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేసిన విదర్భకు 37 పరుగుల ఆధిక్యం లభించినట్టయింది. కేరళ కెప్టెన్ సచిన్ బేబీ (98) రెండు పరుగులతో సెంచరీని మిస్సయ్యాడు. ఆదిత్య సర్వాటే 79 రన్స్ చేశాడు. దర్శన్ నల్కండే, పార్థ్ రెఖాడే, హర్ష్ దూబే (3/88)తలా మూడేసి వికెట్లు పడగొట్టారు. 22 ఏళ్ల విదర్భ బౌలర్ హర్ష్ దూబే రంజీ చరిత్రలో ఒక సీజన్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. దూబే ఈ సీజన్‌లో 69 వికెట్లు సాధించాడు. ఈ క్రమంలో 2018-19 సీజన్‌లో బిహార్‌కు చెందిన అషుతోష్ అమన్ నెలకొల్పిన 68 వికెట్ల రికార్డును హర్ష్ దూబే అధిగమించాడు.

టైటిల్ దిశగా తనీషా జోడీ

జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: మిక్స్‌డ్ డబుల్స్ స్టార్ జోడీ తనీషా క్యాస్ట్రో/ధ్రువ్ కపిల జర్మనీలోని ముల్హైమ్ ఆన్ డెర్ రుహ్‌లో జరుగుతున్న జర్మన్ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో టైటిల్ సాధించే దిశగా దూసుకెళుతోంది. ఈ భారత ఏస్ ద్వయం సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ క్వార్టర్‌ఫైనల్లో ఎనిమిదో సీడ్ తనీషా/ధ్రువ్ జంట 21-14, 21-17తో చైనాకు చెందిన గావో జియా గ్జువాన్/వు మెంగ్ యింగ్‌పై వరుస గేముల్లో గెలుపొందింది. ఫైనల్లో బెర్త్ కోసం ఇండోనేసియా ద్వయం రేహన్ నౌఫాల్/గ్లోరియా ఎమాన్యుయెల్‌తో భారత జోడీ తలపడనుంది. ఇక, మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత షట్లర్ రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ 12-21, 12-21తో వియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్) చేతిలో, పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో తరుణ్ మన్నెపల్లి 21-16, 17-21, 8-21తో తోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమిపాలయ్యారు.

మూడోరౌండ్లో ప్రజ్ఞానంద గెలుపు



ప్రేగ్: భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ మాస్టర్స్ విభాగంలో తొలి విజయాన్ని అందుకున్నాడు. ఇప్పటిదాకా వరుసగా రెండు గేమ్‌లను డ్రాగా ముగించిన ప్రజ్ఞానంద.. శుక్రవారం జరిగిన మూడోరౌండ్లో గెలుపు నమోదు చేశాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద కేవలం 29 ఎత్తుల్లోనే చెక్ రిపబ్లిక్ గ్రాండ్ మాస్టర్ తాయ్ గుయెన్‌ను చిత్తుచేశాడు. మూడురౌండ్ల అనంతరం 2 పాయింట్లతో కొనసాగుతున్న ప్రజ్ఞానంద.. శనివారం జరిగే నాలుగో రౌండ్లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. వింగతా గేముల్లో డేవిడ్ నవార (చెక్ రిపబ్లిక్)తో అనీష్ గిరి (నెదర్లాండ్స్), లియెమ్ లె (వియత్నాం)తో ఎడిజ్ గురెల్ (తుర్కియే) డ్రా చేసుకున్నారు.

బిజినెస్

మార్కెట్లకు ఫిబ్రవర్రీ

ట్రంప్ దెబ్బకు సూచీలు ధమాల్
గత నెల అంతా 'బేర్' పట్టులోనే
సెన్సెక్స్ ఏకంగా 4,300 పాయింట్లు పతనం
రూ.85 లక్షల కోట్ల సంపద హాంఫట్
మదుపరుల కంట రక్తకన్నీరు



ముంబై: ఈక్విటీ మార్కెట్‌కు ఫిబ్రవరి నెల ఒక పీడకలగా మిగిలిపోయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బెదిరింపులు, అంతర్జాతీయ అస్థిరతల కారణంగా ప్రపంచ మార్కెట్లలో ఆటుపోట్లు, విదేశీ ఇన్వెస్టర్ల నిధుల తరలింపు నేపథ్యంలో ఈక్విటీ సూచీలు భారీ పతనాలు చవి చూశాయి. దేశీయంగా చూసినట్టయితే కార్పొరేట్ల బలహీన ఆర్థిక ఫలితాలు, జీడీపీ గణాంకాలపై నెలకొన్న ఆందోళనలు దీనికి ఆజ్యం పోశాయి. గత నెల 20వ తేదీన ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రారంభమైన బేరిష్ ట్రెండ్ ఫిబ్రవరిలో కూడా కొనసాగింది. సుమారు 40 రోజులుగా ఒకటి రెండు సందర్భాల్లో తప్పితే భారత్ సహా ప్రపంచ మార్కెట్ల ధోరణి ప్రతికూలంగానే ఉంది. ఫలితంగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల ప్రధాన సూచీ అయిన సెన్సెక్స్ ఫిబ్రవరిలో 4,300 పాయింట్ల (5.5%) మేరకు నష్టపోయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.40.6 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. మొత్తం మార్కెట్ అంతటినీ పరిగణనలోకి తీసుకుంటే సంపద నష్టం రూ.85 లక్షల కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాలంటున్నాయి.

వరుసగా ఐదో నెలా నిఫ్టీ నష్టాల్లోనే

ఎన్ఎస్ఈ నిఫ్టీ అయితే వరుసగా ఐదో నెల కూడా నష్టాల్లో ముగిసింది. 19 సంవత్సరాల చరిత్రలోనే కనివిని ఎరుగని భారీ నష్టం ఇది. 1996 తర్వాత నిఫ్టీ ఇంత సుదీర్ఘకాలం నష్టాల్లో ట్రేడ్ కావడం ఇదే ప్రథమం. 2024 సెప్టెంబరులో జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరిన సెన్సెక్స్, నిఫ్టీ తదుపరి ఏర్పడిన కరెక్షన్‌లో 15-16% వరకు నష్టపోయాయి. మార్కెట్లోని ఇతర సూచీలు అంతకన్నా భారీ నష్టాలనే నమోదు చేశాయి. నిఫ్టీ నెక్ట్స్ ఇండెక్స్ 26%, నిఫ్టీ మిడ్ క్యాప్ 150 ఇండెక్స్ 21%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 26-27% నష్టపోయాయి. నిఫ్టీలోని 50 షేర్లలో 30 ఇప్పటికే బేర్ గుప్పిట్లోకి జారుకున్నాయి. నిఫ్టీ షేర్లలో టాటా మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్, హీరో మోటో కార్ప్ షేర్లు గరిష్ఠ స్థాయిల నుంచి 40% వరకు దిగజారాయి.

ఎఫ్‌పీఐల నిధుల తరలింపు

మార్కెట్ ఇంత భారీగా నష్టపోవడానికి ప్రధాన కారణం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) నిధుల తరలింపు. గత రెండు నెలల కాలంలో అంటే 2025 ప్రారంభం నుంచి ఎఫ్‌పీఐలు నికరంగా 1,220 కోట్ల డాలర్లు (రూ.1.06 లక్షల కోట్లు) తరలించుకుపోయారు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే రూ.47,349 కోట్లు ఉపసంహరించారు. 2024 సంవత్సరం నాలుగో త్రైమాసికంలో విక్రయించిన 1,230 కోట్ల డాలర్ల (రూ.1.07 లక్షల కోట్లు) విలువ గల ఈక్విటీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఐదు నెలల కాలంలో వారి అమ్మకాల మొత్తం విలువ 2,450 కోట్ల (రూ.2.13 లక్షల కోట్లు) డాలర్లకు చేరింది.

"పెరిగితే అమ్ముకో" వ్యూహం బెటర్

ప్రస్తుతం భారత మార్కెట్ గమనాన్ని పరిగణనలోకి తీసుకుంటే మార్కెట్లో ఏదైనా ర్యాలీ ఏర్పడినప్పుడల్లా అమ్ముకునే వ్యూహం అనుసరించడం మంచిదంటున్నారు. అమెరికా సుంకాల బెదిరింపుల నేపథ్యంలో కొంతకాలం పాటు మన మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉండవచ్చని ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ మహేశ్ పాటిల్ అన్నారు. అయితే ఓవర్‌సోల్డ్ స్థితి కారణంగా అప్పుడప్పుడూ స్వల్ప ర్యాలీలు ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే రాబోయే రెండు నెలల కాలంలో ఇన్వెస్టర్ల నుంచి బలమైన కొనుగోళ్ల మద్దతు ఉండకపోవచ్చని ఆయన అన్నారు. దేశంలో స్థూల ఆర్థిక గణాంకాలు మెరుగుపడే వరకు పెద్దఎత్తున కొనుగోళ్లకు పాల్పడకపోవడం మంచిదని మిరే అసెట్ క్యాపిటల్ మార్కెట్స్ ప్రతినిధి మనీష్ జైన్ సలహా ఇస్తున్నారు. ఇంత ప్రతికూల పరిస్థితుల్లో కూడా దేశీయ సంస్థల కొనుగోళ్లు మార్కెట్‌ను ఆదుకుంటున్నాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ సీఈఓ ప్రతీక్ గుప్తా అన్నారు.

22,800 వద్ద నిరోధం

నిఫ్టీకి 22,800 నిరోధ స్థాయి అని నువామా ఆల్టర్నేటివ్స్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత స్థితిలో మరి కొంత దిగజారవచ్చని, ఆ క్రమంలో నిఫ్టీ 21,800 వరకు దిగజారవచ్చని ఐఐఎఫ్ సెక్యూరిటీస్ ప్రతినిధి శ్రీరామ్ వేలాయుధన్ అంచనా. మార్చిలో నిఫ్టీ 22,000-22,900 పాయింట్ల మధ్యన కదలాడవచ్చని నువామా ప్రతినిధి అభిలాష్ పగారియా అంటున్నారు.

ఇది టెక్నికల్ కరెక్షన్ మాత్రమే

అయితే ఇది టెక్నికల్ కరెక్షన్ మాత్రమేనని జెఫ్రీస్ ఈక్విటీ స్ట్రాటజిస్ట్ క్రిస్ వుడ్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాల ధోరణి చూస్తుంటే అవకాశం వచ్చినప్పుడు అమ్మేసుకుని లాభాలు మూటగట్టుకోవాలన్న దురాశ కొందరిదైతే, భవిష్యత్తులో ఏం జరగబోతోందో అన్న భయోత్పాతానికి గురై మరి కొందరు అమ్మకాలకు తెగబడుతున్నారనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మార్కెట్ దిద్దుబాటుకు గురవుతున్న వేగం కారణంగా ఇన్వెస్టర్ సెంటిమెంట్ దెబ్బ తిన్నదని, అదే ఈ అమ్మకాలకు ప్రధాన కారణమని ఆల్కెమీ క్యాపిటల్ ప్రతినిధి అలోక్ అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం మార్కెట్ తిరోగమనం చివరి దశలో ఉన్నదని, ఇప్పటికే మార్కెట్లో లిక్విడిటీ ఆవిరైపోయినందు వల్ల ట్రెండ్ మారే అవకాశాలున్నాయని మార్కెట్ విశ్లేషణ సంస్థ మెరిసిస్ అంటోంది. వచ్చే 4-6 నెలల కాలంలో బలమైన బౌన్స్‌బ్యాక్‌కు ఆస్కారం ఉన్నదన్నది ఆ సంస్థ విశ్లేషకుల అంచనా.

నామినేషన్లపై సెబీ కొత్త మార్గదర్శకాలు

డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఫోలియోల నామినేషన్లకు సంబంధించి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి శుక్రవారం కొన్ని కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఉమ్మడి ఖాతాకు సంబంధించి ఒకరు లేదా అంతకు మించిన ఖాతాదారులు చనిపోతే అదనపు కేవైసీ వివరాలు లేకుండానే ఆ ఖాతాలోని సెక్యూరిటీలు మిగిలిన ఖాతాదారుకు బదిలీ అవుతాయి. మిగిలిన ఖాతాదారులు తమ కాంటాక్ట్ వివరాలను, నామినీల మార్పు లేదా అదనపు నామినీల చేర్పు వివరాలను ఎప్పుడైనా అప్‌డేట్ చేయవచ్చని కూడా సెబీ తెలిపింది. ఒకవేళ ఖాతాదారులు దివ్యాంగులైతే తమ ఖాతాల నిర్వహణ బాధ్యత నామినీలకు కూడా అప్పగించేందుకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

బ్లాక్ ఫ్రైడే

బేర్ దెబ్బకు విలవిల
ఒక్కరోజే సెన్సెక్స్ 1,414 పాయింట్లు, నిఫ్టీ 420 పాయింట్లు డౌన్
రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి

జీడీపీ గణాంకాలపై నెలకొన్న భయాలతో పాటు సుంకాలపై ట్రంప్ తాజా వ్యాఖ్యలు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం శుక్రవారం ఈక్విటీ మార్కెట్లో మంటలు రేపాయి. భారీ స్థాయిలో జరిగిన అమ్మకాల ప్రభావంతో సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు నష్టపోయి 73,198.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 420.35 పాయింట్లు నష్టపోయి 22,124.70 వద్ద క్లోజైంది. ఫలితంగా బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ (ఇన్వెస్టర్ల సంపద) ఒక్క రోజులోనే రూ.8.9 లక్షల కోట్ల మేరకు దిగజారి రూ.384.22 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. కీలక సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంక్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలన్నీ కూడా భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అవి 0.7 శాతం నుంచి 6.5 శాతం మధ్యన నష్టపోయాయి.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణులు దేశీయ మార్కెట్లో అమ్మకాలకు ఆజ్యం పోశాయి. ఏఐలో అగ్రగామిగా ఉన్న ఎన్‌విడియా షేర్లలో భారీ అమ్మకాలు దేశీయ ఐటీ షేర్లలో కూడా అమ్మకాలకు దారి తీశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.2 శాతం మేరకు నష్టపోయింది. టెక్ మహీంద్రా, విప్రో, ఎంఫసిస్ షేర్లు గరిష్ఠంగా 6.5 శాతం వరకు నష్టపోయాయి.

ట్రంప్ చర్యల ప్రభావం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం కెనడా, మెక్సికోలపై 25% సుంకాలు విధించడంతో పాటు చైనాపై 10% అదనపు సుంకాలు విధిస్తూ తీసుకున్న చర్యలు శుక్రవారం మార్కెట్లో ప్రకంపనలు రేపాయి. ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత అస్థిరతకు గురి చేస్తోంది. వాణిజ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చవచ్చన్న భయాల కారణంగా డాలర్ ఇండెక్స్ 107.36 పాయింట్లకు దూసుకుపోయింది. డాలర్ ఇండెక్స్ ఎంత బలపడితే భారత్ సహా వర్ధమాన మార్కెట్లకు అంత నష్టం అంటున్నారు.

- ఈక్విటీ మార్కెట్లలో బలహీనత కారణంగా అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి శుక్రవారం 19 పైసల మేరకు క్షీణించి 87.37 వద్ద ముగిసింది.

ఏడాది కనిష్ఠానికి 148 స్టాక్స్
శుక్రవారం నాటి బేర్ దెబ్బకు నిఫ్టీ 500 ఇండెక్స్‌లోని 140 స్టాక్స్ 52 వారాల కనిష్ఠానికి చేరాయి. ఈ షేర్లలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ ఇండియా, టాటా టెక్నాలజీస్, సొనాటా సాఫ్ట్‌వేర్ సహా మరి కొన్ని ఉన్నాయి. మరోవైపు నిఫ్టీ 50లోని 45 షేర్లు నష్టాల్లోనే ముగిసాయి.

జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతం

- డిసెంబరు త్రైమాసికంలో ఆశాజనకంగా వృద్ధి
- 2024-25లో వృద్ధి రేటు 6.5%

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ గాడినపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతంగా నమోదైంది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో సవరించిన 5.6 శాతంతో పోలిస్తే ఇది 0.6 శాతం ఎక్కువ. అయితే ఈ కాలానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసిన 6.8 శాతంతో పోలిస్తే ఇది 0.6 శాతం తక్కువ. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ), కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ వివరాలు విడుదల చేశాయి. మరోవైపు మార్చితో ముగిసే 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి గాను జీడీపీ వృద్ధి అంచనాలను ప్రభుత్వం 6.4 శాతం నుంచి 6.5 శాతానికి సవరించింది. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి వృద్ధి రేటు అవుతుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) నమోదైన 9.2 శాతంతో పోల్చినా ఇది 2.7 శాతం తక్కువ.

రూ.331 లక్షల కోట్ల జీడీపీ: ప్రస్తుత ధరల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సర జీడీపీ రూ.331.03 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఎన్ఎస్ఓ అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.29.8 లక్షల కోట్లు (9.9 శాతం) ఎక్కువ. ప్రస్తుత ధరల ప్రకారం డిసెంబరు త్రైమాసిక జీడీపీ కూడా రూ.47.17 లక్షల కోట్ల వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 6.2 శాతం (రూ.2.73 లక్షల కోట్లు) ఎక్కువ.


జియో గేమ్స్‌తో 7సీస్ జట్టు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్.. జియో గేమ్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ద్వారా జియో ఖాతాదారులకు 7సీస్‌కి చెందిన క్యాజువల్, అడ్వెంచర్, పజిల్, స్పోర్ట్స్ టైటిల్స్‌తో కూడిన అన్ని రకాల గేమ్స్ తమ స్మార్ట్‌ఫోన్లు, సెట్ టాప్ బాక్స్ (ఎస్‌టీబీ) ద్వారా అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం జియోగేమ్స్ లైబ్రరీలో ఏడు గేమ్స్ అందుబాటులో ఉండగా త్వరలో మరిన్ని గేమ్స్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

బీమా కంపెనీలకూ డెరివేటివ్స్

న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ).. బీమా కంపెనీలకు మరో వెసులుబాటు కల్పించింది. క్యాపిటల్ మార్కెట్ ఆటుపోట్లతో ఏర్పడే నష్టభయాలను తట్టుకునేందుకు ఈ సంస్థలకు కూడా ఈక్విటీ డెరివేటివ్స్‌ను అనుమతించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి శుక్రవారం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	485
వరంగల్	447	గోదావరి	480
చిత్తూరు	493	విశాఖపట్నం	482


డజను గుడ్లు రూ. 60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	86
వరంగల్	85	గుంటూరు	86
కరీంనగర్	85	ఒంగోలు	86
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	77
కర్నూలు	85	నెల్లూరు	82
విశాఖపట్నం	85	అనంతపురం	82
గోదావరి	86		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,840 ▼	79,600 ▼	1,05,000 ▼
విజయవాడ	89,000 ▲	84,500 ▲	96,500 ▼
విశాఖపట్నం	84,940 ▼	77,860 ▼	94,680 ▼
రాజమండ్రి	86,730 ▼	79,500 ▼	97,500 ▼
ప్రొద్దుటూరు	87,700 ▼	81,120 ▼	96,500 ▼
ముంబై	85,056 ▼	77,911 ▼	93,480 ▼

విందులు, వినోదాల్లో మంత్రులు

» శివరాత్రినాడు హాస్టల్ విద్యార్థులకు పస్తులు: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలన పరాకాష్టకు చేరిందని, ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో 8 మంది చిక్కుకుపోయిన విషాద సమయంలో మంత్రులు హెలికాప్టర్ యాత్రలు.. చేపకూర విందులు, వినోదాలతో గడుపుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వ పెద్దలు సరిగా స్పందించడం లేదని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. కాగా "నాగర్‌కర్నూల్ జిల్లా కొండనాగులలోని ఎస్టీ బాలుర హాస్టల్లో శివరాత్రి నాడు విద్యార్థులకు అన్నం పెట్టకుండా పస్తులు ఉంచారు. అన్నం వండలేదని, మధ్యాహ్నం గుడిబండ శివాలయంలో అన్నదానానికి వెళ్లి తినాలని, రాత్రి భోజనం వీరంరామాజిపల్లిలోని గంగమ్మ దేవాలయంలో తినాలని హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు చెప్పడం దుర్మార్గం. హాస్టల్‌లోని 380 మందిలో 200 మంది పస్తులున్నారు. విద్యార్థులకు కనీసం తిండి పెట్టలేని దుస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం ఉంది" అని కేటీఆర్ విమర్శించారు.

జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు: సీపీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బీసీల వెనుకబాటు తనం పోవాలంటే వారికి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రభుత్వాలు చేయూతనందించాల్సిన అవసరం ఉందని, ఇందుకు ఏకైక మార్గం జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభలతో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇందు కోసం జరిగే ప్రతి పోరాటంలో సీపీఐ మద్దతు ఇస్తుందన్నారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం 'దేశ జనగణనలో కులగణన- బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు-జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టాలని బీసీ సంఘాల నేతలు, రాజకీయ నాయకులు, బీసీ మేధావులు డిమాండ్ చేశారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తుర్క‌యంజాల్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం బహిరంగ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా కూనంనేని మాట్లాడుతూ సీపీఐ ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటూ పోరాటం చేస్తుందన్నారు.

హరీశ్‌పై బాచుపల్లి పీఎస్‌లో కేసు నమోదు

» ఫిర్యాదు చేసిన చక్రధర్ గౌడ్.. మరో ముగ్గురిపైనా కేసు

హైదరాబాద్/నిజాంపేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావుపై హైదరాబాద్ బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. గతంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేసిన తనకు హరీశ్‌తోపాటు మరో ముగ్గురి నుంచి ప్రాణహాని ఉందని, చంపేస్తామని బెదిరిస్తున్నారని చక్రధర్‌గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఏ-1గా వంశీకృష్ణ, ఏ-2గా హరీశ్‌రావు, ఏ-3గా సంతోష్‌కుమార్, ఏ-4గా పరశురామ్‌లపై కేసు నమోదు చేశారు.

హరీశ్‌పై ఎన్ని కేసులు పెడతావ్ రేవంత్: ఎర్రోళ్ల శ్రీనివాస్

'ప్రజల తరపున నిన్నూ, నీ ప్రభుత్వాన్ని అనుక్షణం నిలదీస్తున్న హరీశ్‌రావుపై అక్రమ కేసులు పెడతావా? ప్రశ్నించే స్వేచ్ఛపై, ప్రజాస్వామ్యంపై దాడిచేస్తావా? ఎన్ని పోలీస్‌స్టేషన్లలో కేసులు పెడతావ్ రేవంత్ రెడ్డి..' అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎల్ఎల్‌బీసీ వద్ద మాట్లాడినందుకు బాచుపల్లి పోలీసు స్టేషన్‌లో హరీశ్‌రావుపై కేసు పెట్టడం ఏంటని ఆయన నిలదీశారు.

రాజలింగమూర్తి హత్యపై అనుమానాలు

» కేసును సీబీసీఐడీకి ఇవ్వాలి: పౌర హక్కుల సంఘం

భూపాలపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ కేసు విచారణకు ఒక రోజు ముందే రాజలింగమూర్తి హత్య జరగడంపై అనుమానాలున్నాయని, ప్రభుత్వం దీనిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం భూపాలపల్లిలోని రాజలింగమూర్తి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ముఖ్యమంత్రి ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ కార్యకర్తల్ని వేధిస్తే ఊరుకోం: కవిత

కొల్లాపూర్/నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): "జూపల్లి కృష్ణారావు ముందు నియోజకవర్గానికి రావాలి. ఆయన టూరిజం మంత్రిలా కాకుండా టూరిస్టు మంత్రిలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే ఎంత పెద్ద నాయకులనైనా, అధికారులనైనా వదిలిపెట్టం. సీఎం సొంత జిల్లా నుంచి చెబుతున్నా కచ్చితంగా పింక్ బుక్ మెయింటెన్ చేస్తాం. అందరి చిట్టా రాసుకుంటాం" అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా ఆమె సింగోటం, నాగర్‌కర్నూలులలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను మంత్రి జూపల్లి తీవ్రంగా వేధిస్తున్నారని, చిన్న విమర్శ చేసినా, ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ నేత హత్య కేసు.. నలుగురికి జీవిత ఖైదు

ధారూరు, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా ధారూరు మండలంమైలారంలో బీఆర్ఎస్ నాయకుడు పెండ్యాల శ్రీనివాస్ హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ శుక్రవారం జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించిన పూర్వపరాలను ఎస్పీ నారాయణ రెడ్డి వివరించారు. 2018 ఏప్రిల్ 22న శ్రీనివాస్‌ను భూతగాదాలు, పాతకక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు దారుణంగా కొట్టి హతమార్చారు. శ్రీనివాస్ భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన సెషన్సు కోర్టు జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి.. నిందితులైన మదులపల్లి దాసు, మదులపల్లి ప్రశాంత్ కుమార్, మదులపల్లి అరుణ్‌కుమార్, మదులపల్లి భాస్కర్‌లకు జీవిత ఖైదు విధించారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా వేశారు. జరిమానా చెల్లించకపోతే మరో నాలుగు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు.

మెదక్ జిల్లాలో 9 వేల కోళ్ల మృతి

కౌడిపల్లి/నర్సాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో 9 వేల కోళ్లు మృతి చెందాయి. కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామంలో బర్డ్ ఫ్లూతో 8 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన లింబాద్రి అనే రైతు రూ.20 లక్షలతో తన సొంత స్థలంలో పది వేల కోళ్లతో పౌల్ట్రీఫాం నడుపుతున్నారు. శుక్రవారం ఒక్కసారిగా 8 వేల కోళ్లు చనిపోయాయి. దీంతో రైతు బోరున విలపించాడు. తనను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. అయితే, కోళ్లు ఎందుకు చనిపోయాయనే విషయాన్ని నిర్ధారించుకునేందుకు వెటర్నరీ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు. మరోవైపు.. నర్సాపూర్ మండలం అచ్చంపేటలోని ఓ కోళ్లఫాంలో సుమారు వెయ్యి కోళ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాపయ్య కోళ్లఫాం నడుపుతుండగా, నాలుగు రోజులుగా సుమారు వెయ్యి కోళ్లు చనిపోయాయి. శుక్రవారం సాయంత్రం వాటిని ఖననం చేశారు.

ఒత్తిడి తట్టుకోలేక ఇంటర్ విద్యార్థి బలవన్మరణం!

» ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య

చందానగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి తట్టుకోలేక ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చందానగర్‌లో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో రాజేశ్వరి కుటుంబం నివాసముంటోంది. శుక్రవారం డ్యూటీకి వెళ్లిన రాజేశ్వరి సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత గదిలోకి వెళ్లి చూడగా.. ఆమె కొడుకు దీక్షిత్‌రాజు (17) ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఆమె గట్టిగా అరవడంతో చుట్టు పక్కల వారు వచ్చి చూశారు. అప్పటికే బాలుడు మృతిచెందాడు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

చేసింది చెప్పుకోవట్లేదు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి అనుకూల వాతావరణం తీసుకురానుంది. ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను నేతలే తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా జరగని కులగణనను పూర్తి చేయడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తు చేశారు. వంద శాతం పారదర్శకత, కచ్చితత్వంతో కులగణన చేసినందునే.. దీనిని ఎవరూ కోర్టుల్లో సవాల్ చేయలేకపోతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సైతం శాశ్వత పరిష్కారం చూపగలిగామని చెప్పారు. 55,163 ఉద్యోగాల భర్తీతో పాటు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 50 లక్షల కుటుంబాలకు ఉచిత కరెంటు, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.. వంటి పథకాలను ఏడాదిలోనే అమలు చేశామన్నారు. ఇలా.. అన్ని విధాలుగా తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. "మంచిని మైక్‌లో, చెడును చెవిలో చెప్పాలని పెద్దలు చెబుతుంటారు. కానీ.. మనోళ్లు నా దగ్గరకు వచ్చినప్పుడు పథకాలు బాగున్నాయంటూ తలుపులు మూసి చెవిలో చెబుతున్నారు. బయట మైకులో మాత్రం ఎలా చెప్పాలో.. అలా చెబుతున్నారు. ఇది పార్టీకి తీవ్ర నష్టాన్ని తెచ్చి పెడుతోంది. అలా కాకుండా మంచిని మైకులో చెప్పి.. చెడును తన చెవిలో చెప్పాలి. పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే ప్రయత్నం చేద్దాం" అని వ్యాఖ్యానించారు.

కష్టపడ్డ వారికే పదవులు ఇచ్చాం

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ సూచన మేరకు రేణుకాచౌదరికి, యువతకు అవకాశం ఇవ్వాలన్న రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సీట్లు ఇచ్చామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు రాని వారికి, పార్టీ కోసం కష్టపడ్డ వారికే తొలి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇచ్చామని, దాదాపు 80 శాతం మంది డీసీసీ అధ్యక్షులకు నామినేటెడ్ పదవులు దక్కాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. నామినేటెడ్ నియామకాల్లో ఏ ఒక్కటీ పైరవీకారులకు దక్కలేదని, కష్టపడ్డ వారికే దక్కాయన్నారు. అయితే, పార్టీ జెండాను మోసిన వారిలో అవకాశాలు దక్కాల్సిన వారు ఇంకా చాలా మంది ఉన్నారని, వీరికి రానున్న రోజుల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. జిల్లా స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులను మార్చి 10లోపు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వాటిలోనూ అవకాశాలు రాని వారికి జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. "అవకాశం వచ్చిన వారిలో కొందరు.. పదవి వచ్చేసింది కదా పని చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నారని, అవకాశం రాని వారు.. పదవి రానప్పుడు ఎందుకు పనిచేయాలని అడుగుతున్నారు... వీటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే నామినేటెడ్ పోస్టులు దక్కించుకున్న వారి పని తీరును నిశితంగా పరిశీలిస్తున్నామని, సరిగ్గా పని చేయని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ రెన్యువల్ చేయబోమని స్పష్టం చేశారు. "అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీ నేతలు, కార్యకర్తలు కసితో పని చేశారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఆ కసి, పట్టుదల ఇప్పుడు ఏమైంది? రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాల్సిన బాధ్యత తెలంగాణ నాయకులపై లేదా? బీజేపీ ఓటమి.. తెలంగాణ నుంచే ప్రారంభం కావాలి. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యే వరకూ కసిగా పని చేయాలి" అని పిలుపునిచ్చారు.

ఫ్లెక్సీలు పెడితే గెలవరు

ఫ్లెక్సీలు పెట్టినంత మాత్రాన ఎన్నికల్లో గెలవరని, నాయకులు ప్రజల్లో ఉంటేనే గెలుస్తారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ అన్నారు. పేద వారి మొహంలో నవ్వు చూసినప్పుడే ప్రభుత్వం పని చేసినట్లని పేర్కొన్నారు. కార్యకర్తల పోరాటాల వల్లే ఈ రోజు తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ప్రతి కార్యకర్త ఈ ప్రభుత్వం తమదనుకునే పరిస్థితి ఉండాలన్నారు. పదవులు పొందిన వారు ప్రజల కోసం పని చేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కులగణన చేశామని, ఇది గొప్ప విషయమన్నారు. పాత అలవాట్లను విడిచిపెట్టి, నేతలందరూ పార్టీ కోసం శ్రమించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఏఐసీసీ ఇచ్చిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పకడ్బందీగా చేశామన్నారు. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం కూడా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడి పని చేస్తే తప్పనిసరిగా అవకాశాలు వస్తాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం పని చేసే వారు అధైర్య పడాల్సిన అవసరం లేదని, అవకాశాలు వాటంతటవే తలుపు తడతాయని భరోసా ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై కేసీఆర్, హరీశ్, కేటీఆర్ లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, దీపాదాస్ మున్షీకి ధన్యవాదాలు తెలుపుతూ, కొత్త ఇన్‌చార్జిమీనాక్షికి స్వాగతం పలుకుతూ తీర్మానంచేసి.. ఆమోదించారు.

కేంద్రంలో ఏక వ్యక్తి ప్రభుత్వం

కేంద్రంలో ఏక వ్యక్తి ప్రభుత్వం ఉండాలని, దేశమంతా తన గుప్పిట్లో ఉండాలని ప్రధాని మోదీ ఆలోచిస్తుండగా.. ప్రజలకు మరిన్ని అధికారాలు ఉండాలని, ప్రభుత్వంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ అత్యవసర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కులగణన చాలా బాగా జరిగిందని దేశంలోని సామాజిక శాస్త్రవేత్తలు ప్రశంసిస్తున్నారని తెలిపారు. వచ్చే ఏడాది పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయంపైనా సమావేశంలో చర్చించామని ఆమె వెల్లడించారు.

6న క్యాబినెట్ సమావేశం!

» ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులు, అసెంబ్లీ నిర్వహణపైన చర్చ

» బడ్జెట్ తేదీలపై స్పష్టత వచ్చే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 6న రాష్ట్ర మంత్రి మండలి భేటీ జరగనుంది. ఆ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులపై చర్చించనున్నారు. ఈ బిల్లులను ఆమోదించేందుకు నిర్వహించ తలచిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు సమాచారం. అలాగే బడ్జెట్ సమావేశాలను ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై చర్చించి, తేదీలను నిర్ణయించనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఎస్సీలను ఏ, బీ, సీ గ్రూపులుగా వర్గీకరించి మొత్తం 15 శాతం రిజర్వేషన్‌ను 59 కులాలకు కేటాయించడంపై ఏర్పాటైన ఏక సభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదికను ఇచ్చింది. ఆ నివేదికను ఆమోదించి, ఎస్సీ వర్గీకరణను చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లకు ఒక బిల్లు, విద్య, ఉపాధి రంగాల్లో 42శాతం రిజర్వేషన్లకు మరో బిల్లును అసెంబ్లీలో చర్చకు పెట్టి చట్టం చేయాలని నిర్ణయించింది. అనంతరం ఆ చట్టాలను పార్లమెంటుకు పంపి ఆమోదించాలని కేంద్రాన్ని కోరనుంది. ఒకవేళ ఆమోదించకపోతే కేంద్రంతో లడాయికి దిగైనా సరే వాటిని ఆమోదించేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశాలపైనా మార్చి 6న నిర్వహించే క్యాబినెట్ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే, బడ్జెట్ సమావేశాలకు సంబంధించి కూడా క్యాబినెట్ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా మార్చి ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోగా రెండు రోజులు ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించుకుని, కేంద్రానికి పంపాలని ఇటీవల ప్రభుత్వం భావించింది. కానీ ప్రస్తుతం 6న క్యాబినెట్ భేటీ నిర్వహించి, తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

రేపట్నుంచి మహిళలకు కుట్టు మెషిన్ల పంపిణీ

» వనపర్తిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఉచిత కుట్టు మెషిన్ల పంపిణీ పథకాన్ని ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాక ఆర్థిక సంస్థ (టీఎస్ఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ చెప్పారు. వనపర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హజ్‌హౌస్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి విడతలో 9 జిల్లాల్లోని 10,490 మంది పేద మహిళలకు కుట్టు మెషిన్లను పంపిణీ చేస్తున్నామని, రెండో విడతలో ఇతర జిల్లాల్లోని 31,740 మంది మహిళలకు అందిస్తామన్నారు.

అసామాన్యురాలైన సామాన్యురాలు!

(మొదటిపేజీ తరువాయి)



గాంధీభవన్‌ను అవేవీ లేకుండా చేసి సింపుల్‌గా మార్చేశారు. తద్వారా ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి ఒక లెక్క అన్న సంకేతాన్ని పరోక్షంగా రాష్ట్రంలోని పార్టీ శ్రేణులకు పంపారు. కళాశాలలో చదువుకునే సమయంలో ఎన్ఎస్‌యూఐలోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగి, ఎంపీగా పని చేసిన మీనాక్షి, రాహుల్ గాంధీ బృందంలో కీలకసభ్యురాలు. 51 ఏళ్ల మీనాక్షీ నటరాజన్ అవివాహిత. 1973 జూలై 23న మధ్యప్రదేశ్‌లోని నగ్దాలో మీనాక్షి జన్మించారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీలో సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితురాలి స్థాయికి ఎదిగినా ఆమెకు స్థిరాస్తులంటూ ఏమీలేవు. రూ.67 లక్షల చరస్తులున్నాయి. వీటిలో.. మాజీ ఎంపీగా వచ్చే పెన్షన్ డబ్బులే ఎక్కువ. మీనాక్షి ఎమ్మెస్సీలో బయోకెమిస్ట్రీ చదివారు. లా కూడా పూర్తి చేశారు. కాంగ్రెస్ నేతగానే కాకుండా.. రచయిత్రిగానూ పేరొందారు. ఆమె రాసిన రెండు నవలలు 'అప్నే అప్నే కురుక్షేత్ర', '1857 భారతీయ పరిపేక్ష' ప్రాచుర్యం పొందాయి. కాగా 1999 నుంచి 2002 వరకు ఎన్ఎస్‌యూఐ అధ్యక్షురాలిగా మీనాక్షి పనిచేశారు. ఆ వెంటనే యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికై.. ఆ పదవిలో 2005 వరకూ కొనసాగారు. ఆమె సాధారణ జీవితం, పార్టీ పట్ల ఆమె అంకిత భావాన్ని గమనించిన రాహుల్‌గాంధీ.. 2008లో ఆమెను ఏఐసీసీ కార్యదర్శిగా తన బృందంలో చేర్చుకున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని మండసోర్ నుంచి పోటీ చేసిన మీనాక్షి, బీజేపీ అభ్యర్థి లక్ష్మీనారాయణ్ పాండేపై గెలుపొందారు. తదనంతర కాలంలో పార్టీలో అత్యున్నతమైన సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితురాలి స్థాయికి ఎదిగారు. తాజాగా కీలకమైన తెలంగాణకు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆమె ఇక్కడ పార్టీ అబ్జర్వర్‌గా పని చేశారు.

రైల్లో రాక.. ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో బస

అధికార పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న మీనాక్షీ నటరాజన్.. శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్లో ఒక సాధారణ ప్రయాణికురాలిగా దిగారు. తన రాక సందర్భంగా ఎలాంటి హంగూ ఆర్భాటాలు ఉండకూడదని, ఫ్లెక్సీలు, స్వాగతతోరణాలు ఏర్పాటు చేయకూడదని ఆమె ముందే చెప్పడంతో ఆ మేరకు పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్.. రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఆమెకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కారులో ఆమె దిల్‌కుషా గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. కొద్ది సేపటికే సీఎం రేవంత్‌రెడ్డి దిల్‌కుషా గెస్ట్ హౌస్‌కు చేరుకుని ఆమెకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆమె నేరుగా గాంధీభవన్‌కు చేరుకుని టీపీసీసీ విస్తృత సమావేశంలో పాల్గొన్నారు.

నా బ్యాగ్‌లు మోయ్యాల్సిన అవసరం లేదు

విస్తృత సమావేశంలో మీనాక్షీ నటరాజన్ మాట్లాడుతూ తన దృష్టిలో పడేందుకు నేతలెవ్వరూ ప్రయత్నాలు చేయొద్దని.. ముఖస్తుతి, ఆర్భాటాలు తన వద్ద పనిచేయవని గట్టిగా చెప్పారు. తన కోసం రైల్వే స్టేషన్‌కు ఎవరూ రావొద్దని, తన బ్యాగ్‌లు ఎవరూ మోయాల్సిన అవసరం లేదని, ఒకవేళ మోసే బలం లేకుంటే తానే సాయం అడుగుతానని వ్యాఖ్యానించారు. కార్యకర్తలకు ఏమైనా సమస్యలుంటే తనకు ఫోన్ చేస్తే మాట్లాడతానని చెప్పారు. ఆ క్షణంలో ఫోన్ లిఫ్ట్ చేయకపోతే.. మిస్డ్ కాల్ చూసుకునైనా తర్వాతైనా మాట్లాడతానని చెప్పారు. కాగా, తన రాక సందర్భంగా హంగూ ఆర్భాటాలు వద్దంటూ మీనాక్షీ నటరాజన్ ముందుగానే తేల్చి చెప్పడంతో పార్టీ నాయకత్వమూ అలాగే నడుచుకుంది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షీ నటరాజన్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు గాంధీభవన్‌లో సమావేశమైనా అక్కడ ఎలాంటి హడావుడి కనిపించలేదు.

'మీ సేవ'లో విజిలెన్స్ సోదాలు

» అత్యధిక ఫీజులు తీసుకుంటున్నట్లు గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా మీ సేవ కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మీ సేవ నిర్వాహకులు నిర్ణీత రుసుము కన్నా ఎక్కువ వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చిన క్రమంలో.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. మునిసిపల్ శాఖ జారీ చేసే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు.. రెవెన్యూ శాఖ జారీ చేసే నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరగా కావాలంటే ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడైంది. ఈ క్రమంలో మీ సేవ నిర్వాహకుల బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీలను అధికారులు పరిశీలించారు. తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారని సమాచారం.

ఎఫ్ఈఓ సీఈవోను ప్రశ్నించిన ఏసీబీ

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసులో మళ్లీ కదలిక మొదలైంది. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఫార్ములా ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈఓ) సీఈవోను శుక్రవారం వర్చువల్‌గా గంట పాటు విచారించారు. గతంలో ఒకసారి విచారణ జరిగినప్పటికీ, కొన్ని అనుమానాలు ఉండటంతో మరోసారి ఏసీబీ అధికారులు ఎఫ్ఈఓ ఉన్నతాధికారిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం, ప్రమోటర్ కంపెనీ వైదొలగిన తర్వాత తీసుకున్న న్యాయపరమైన చర్యలు, ఫీజు డబ్బు ఎఫ్ఈఓ ఖాతాల నుంచి ఇతర ఖాతాలకు మళ్లిందా? అనే విషయాలపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్-బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ప్రకటించండి

» 'రక్షణ'లో మరిన్ని పెట్టుబడులు ఖాయం

» విజ్ఞాన్ వైభవ్-2025లో సీఎం రేవంత్

» దేశ ఆర్థికాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

» కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగంలో దేశం మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు హైదరాబాద్- బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌ను ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ సంయుక్తంగా హైదరాబాద్, గచ్చిబౌలి స్టేడియంలో 'విజ్ఞాన్ వైభవ్-2025' పేరిట ఏర్పాటు చేసిన రక్షణ రంగ ఉత్పత్తుల ప్రదర్శనను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి సీఎం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ హైదరాబాద్, బెంగళూరు మధ్య డిఫెన్స్ కారిడార్ ప్రకటిస్తే పెద్దఎత్తున పెట్టుబడులు వస్తాయని అన్నారు. రక్షణ రంగ ఉత్పత్తుల అంశంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. యువతకు దేశభక్తి పట్ల అవగాహన కల్పించడానికి సైన్స్ ఎగ్జిబిషన్ దోహదపడుతుందని తెలిపారు. దేశానికి సాంప్రదాయక ఇంజనీర్ల అవసరం ఉందని, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ పట్టభద్రులను దేశానికి అందించేందుకు తమ వంతుగా ప్రయత్నిస్తున్నామని వివరించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధిలో సైన్స్ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజా జీవితంలోకి రాక ముందు తాను భౌతికశాస్త్ర అధ్యాపకునిగా పని చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, వారిని వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనల వైపు ప్రోత్సహించడమే జాతీయ విద్యా విధానం-2020లక్ష్యమని తెలిపారు. యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. ఇక, 2024లో రూ.245 లక్షల కోట్ల విలువైన 171 బిలియన్ యూపీఐ లావాదేవీలు జరిగాయని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆధునిక యుద్ధాల్లో సాఫ్ట్‌వేర్ ప్రధాన పాత్ర పోషిస్తోందని అన్నారు.



క్షిపణులను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

అస్త్రాలు.. ఆవిష్కరణలు

యువతకు విజ్ఞాన్ వైభవ్-2025 ఎగ్జిబిషన్ ఓ గొప్ప అనుభూతి ఇస్తోంది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్) సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు, రక్షణ రంగానికి చెందిన పలు కంపెనీలు తమ ఉత్పత్తులు, ఆవిష్కరణలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నాయి. హైదరాబాద్‌లోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన వారితోపాటు సమీప జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సినిమాలు, పత్రికలు, పుస్తకాల్లో చూసే క్షిపణులు, రాకెట్ లాంచర్లు, టార్పిడోలను ప్రత్యక్షంగా చూసి సంబరపడిపోయారు. ఈ ప్రదర్శనను తిలకించిన తర్వాత తమకు దేశ రక్షణలో భాగం కావాలని ఉందని, ఈ రంగంలో ఆవిష్కరణలు చేయాలనే ప్రేరణ కలిగిందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. తమ పర్యటన వృథా కాలేదని, ప్రదర్శనకు రాకపోయి ఉంటే ఎంతో కోల్పోయేవాళ్లమని ఖమ్మం న్యూఎరా స్కూల్ విద్యార్థులు పేర్కొన్నారు. అగ్ని-5 ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ క్షిపణి, రుద్రఎం-2 క్షిపణి, పినాకా- మల్టీ బారెల్ రాకెట్ లాంచర్, గైడెడ్ పినాకా(ఆర్టిలరీ మిస్సైల్ వ్యవస్థ), లాంగ్ రేంజ్ హైపర్‌సోనిక్ గ్లైడ్ మిస్సైల్, మౌంటెడ్ గన్ సిస్టమ్, అర్జున్ ఎంకె 1 ఏ యుద్ధట్యాంక్, మరిన్ని ఆయుధాలు ఈ ప్రదర్శనలో విద్యార్థులను అమితంగా ఆకట్టుకున్నాయి. అలాగే, ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు పంపే చిత్రాలను విశ్లేషించి సమాచారం ఇచ్చే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ స్టాల్, భారత వాయుసేనకు దన్నుగా నిలిచే హిందుస్థాన్ ఏరోనాటికల్స్ సంస్థ స్టాల్, చంద్రయాన్ స్టాల్‌లు ఆకట్టుకున్నాయి. ఇక, యుద్ధ ట్యాంకులు శత్రువుల ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు అభివృద్ధి చేసిన ఎలక్ట్రోమాగ్నటిక్ షీల్డ్ సాంకేతికతను డీఆర్‌డీవో ప్రదర్శించింది.

91 పీజీ వైద్య సీట్ల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ కటాఫ్ స్కోర్‌ను ఐదు శాతానికి తగ్గించిన నేపథ్యంలో రాష్ట్రంలో అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకుగాను కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీచేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 3 సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వర్సిటీ పేర్కొంది. క్లినికల్ సీట్లన్నీ ఇప్పటికే భర్తీ అయ్యాయని, ప్రస్తుతం 91 నాన్ క్లినికల్ విభాగంలో సీట్లే ఉన్నట్టు తెలిపింది. గతంలో కన్వీనర్ కోటా సీట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఇప్పుడు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరంలేదని పేర్కొంది.

15 మంది ఆర్ఎంపీలపై కేసులు: మెడికల్ కౌన్సిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిధి దాటి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కఠినంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా స్థాయి దాటి వైద్యం చేసిన 15 మంది ఆర్ఎంపీలపై కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు, జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఐదు, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నాలుగు, గౌరారంలో ఒక కేసు నమోదు అయ్యాయని పేర్కొంది. ఈ ఆర్ఎంపీలంతా తమ పరిధికి మించి వైద్యం చేస్తున్నట్లు కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. తెలంగాణవ్యాప్తంగా నకిలీ వైద్యులైన 400 మంది ఆర్ఎంపీ, పీఎంపీలపై కేసులు పెట్టామని చెప్పారు.

1,532 కేంద్రాలు.. 9,96,971 మంది విద్యార్థులు

- ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు :ఇంటర్ విద్య కార్యదర్శి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి 5 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 1,532 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని, పరీక్షల పర్యవేక్షణకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వైద్యశాఖ, ఆర్టీసీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా పరీక్షల ఏర్పాట్ల గురించి కృష్ణ ఆదిత్య వివరించారు.

నేటి నుంచి ఎప్‌సెట్ దరఖాస్తులు షురూ..

- స్థానికేతర కోటాపై తొలగిన సందిగ్ధత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీజీఎప్‌సెట్-2005కు దరఖాస్తుల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభంకానుంది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 25 నుంచే దరఖాస్తు ప్రక్రియ మొదలు కావాల్సి ఉండగా.. స్థానికేతర కోటాపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే కన్వీనర్ కోటాలో మొత్తం సీట్లన్నీ స్థానికులకే కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎప్‌సెట్ నిర్వాహకులు తెలిపారు.

నేడు జేఎన్‌టీయూలో మెగా జాబ్ ఫెయిర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నిపుణ, సేవా ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా శనివారం జేఎన్‌టీయూలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నాయి. దీని ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులకు ఐటీ, ఐటీయేతర ఫార్మా, ఇంజనీరింగ్, బ్యాంకింగ్, రిటైల్, తయారీ, మేనేజ్‌మెంట్ రంగాల్లో సుమారు 10వేలకుపైగా ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. 100కు పైగా ఐటీ, ఐటీయేతర సంస్థలు ఈ జాబ్ ఫెయిర్‌లో పాల్గొనే అవకాశం ఉంది. జాబ్ ఫెయిర్‌కు రిజిస్ట్రేషన్ ఉచితం. 2016నుంచి 2025లోగా టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఎస్సీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చని జేఎన్‌టీయూ ఇండస్ట్రియల్ ఇంటరాక్షన్ సెల్ డైరెక్టర్ రజిని తెలిపారు.

కులగణన రీ-సర్వేకు స్పందన కరువు!

- సర్వేకు దూరంగా 3,44,417 కుటుంబాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మిగిలిపోయిన కుటుంబాల కోసం రెండో దఫా చేపట్టిన కులగణన సర్వేకు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. ఫిబ్రవరి 16న ప్రారంభించిన రీ-సర్వే శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 3,56,323 కుటుంబాల వివరాలు సేకరించాల్సి ఉండగా కేవలం 11,906 కుటుంబాలు మాత్రమే సర్వేకు సహకరించినట్టు అధికారులు తెలిపారు. సుమారు 3,44,417 కుటుంబాలు కులగణన సర్వే-2024కు దూరంగా ఉన్నాయి. కాగా, అందుబాటులో ఉన్న వివరాలను పరిగణలోకి తీసుకుని తదుపరి కార్యాచరణ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ఎర్రవల్లిలో కబ్రిస్తాన్‌ను నిర్మించండి

- మృతదేహంతో ఆర్డీవో ఆఫీసు ముందు ఆందోళన

గజ్వేల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక(కబ్రిస్తాన్)కు స్థలం కేటాయించాలని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఎర్రవల్లికి చెందిన ముస్లింలు ఆర్డీవో కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన నజియా మృతి చెందడంతో దహన సంస్కారాలు ఎక్కడ చేయాలో తెలియక పలువురు శుక్రవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. గతంలో తమ గ్రామాలను ఖాళీ చేయించిన సమయంలో అధికారులు అనేక హామీలు ఇచ్చారని.. నాలుగేళ్లుగా కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. సమస్యలను పరిష్కరించడం లేదని వాపోయారు. ఎర్రవల్లిలో కబ్రిస్తాన్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఓ ఐఏఎస్ ఎలా ఉండాలో చూపిన మహనీయుడు శంకరన్

- ప్రముఖ గాంధేయవాది హర్షమందర్
- మావోయిస్టులతో శాంతి చర్చల్లో శంకరన్‌ది కీలకపాత్ర
- పద్మ భూషణ్ పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించారు
- ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'జవాబుదారీతనం, దయాగుణం, నిజాయితీ, నైతిక స్థైర్యం ప్రతి ఐఏఎస్‌కు తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణాలు. ఈ విలువలను ఎస్ఆర్ శంకరన్ విశ్వసించి ఆచరించారు. ఓ సివిల్ సర్వీస్ అధికారి ఎలా ఉండాలో జీవించి చూపారు' అని ప్రఖ్యాత గాంధేయవాది హర్ష మందర్ పేర్కొన్నారు. తెలంగాణ పల్లె పల్లెకూ తిరిగి వెట్టి చాకిరీ విముక్తిని ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడు అని కొనియాడారు. తాను నమ్మిన విలువల కోసం రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయలేదన్నారు. సఫాయి కర్మచారీ ఆందోళన్, స్కూల్ ఫర్ డెమొక్రసీ సంయుక్తంగా ప్రజల ఐఏఎస్‌గా చరితార్థుడైన ఎస్ఆర్ శంకరన్ సంస్మరణ సభ శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హర్ష మందర్ మాట్లాడుతూ.. ఇవాళ్టి పరిస్థితుల్లోనూ శంకరన్‌లా ఐఏఎస్‌లు రాజ్యాంగ విలువలు ప్రామాణికంగా ప్రజల కోసం పని చేయొచ్చు కానీ చాలామంది సివిల్ సర్వీసెస్ అధికారులు వ్యక్తిగత ప్రయోజనాలు, అధికార పీఠాలకు లొంగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామిక వాతావరణం, శాంతి, సామరస్యం కోసం చర్చల ఆవశ్యకత' అంశంపై ప్రముఖ సామాజికవేత్త ఆచార్య హరగోపాల్ కీలకోపన్యాసం చేశారు. ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య శాంతి చర్చలు జరగడంలో శంకరన్ ముఖ్యపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించినా శంకరన్ సున్నితంగా తిరస్కరించారని గుర్తుచేశారు. బహుశా శాంతి చర్చలు విఫలమవడమే అవార్డు స్వీకరించకపోవడానికి ప్రధాన కారణమని తాను భావిస్తున్నట్లు హరగోపాల్ చెప్పారు. రాజ్యహింస పెచ్చరిల్లుతున్న ప్రస్తుత సమయంలో శంకరన్ స్ఫూర్తితో ప్రాణ నష్టం జరగకుండా చర్చించడం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, ఉద్యమకారిణి వసంత కన్నబిరాన్, ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి అరుణారాయ్, సఫాయి కర్మ చారి ఆందోళన్ ఉద్యమ కారుడు బెజవాడ విల్సన్, మానవ హక్కుల వేదిక జాతీయ నాయకుడు జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి సైంధవుడు



తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు.. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు రాకుండా చేస్తున్నారు

- మోదీ ఆస్తిని, మీ ఆస్తిని అడుగుతున్నామా?
- మీరు అడ్డుపడటం వల్లే మెట్రోరైలు ఆగింది
- ఆర్ఆర్ఆర్ ను క్యాబినెట్ ఆమోదించలేదు
- ఎజెండాలో రాకుండా చేస్తున్నదే మీరు
- ఆరేళ్లుగా తెలంగాణకు ఏదైనా కావాలని ప్రధానిని అడిగారా?
- రాష్ట్రానికి మీరు చేసిందేంటి?: రేవంత్
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగకుండా సైంధవుడిలా అడ్డుపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు తెప్పించాల్సిందిపోయి.. ఆయా అంశాలు కేంద్ర క్యాబినెట్‌లో చర్చకు రాకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారికి కావాల్సిన వ్యక్తి అయిన కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయారనే బాధతోనే ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం పట్ల ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి వెంటనే అనుమతులు తీసుకురావాలని సవాల్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడటంతోపాటు కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. " కేంద్ర ప్రభుత్వ అనుమతుల విషయంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతున్న విధానం చూస్తుంటే.. ప్రధాని మోదీ గుజరాత్ నుంచి రైళ్లు, విమానాలు, లారీల్లో నోట్ల కట్టలను తెలంగాణకు పంపిస్తున్నారని బాధపడి పోతున్నట్లుగా ఉంది. మోదీ ఆస్తిని, మీ ఆస్తిని మేము అడగడం లేదు. రాష్ట్రం నుంచి మేం కట్టిన పన్నుల్లో తగిన వాటా ఇవ్వాలని మాత్రమే కోరుతున్నాం. మీరు(కిషన్‌రెడ్డి) అడ్డుపడడం వల్లే మెట్రో రైలు ఆగింది. మూసీకి నిధులడిగితే అవహేళన చేస్తున్నాడు, మూసీ నది వద్ద నిద్ర చేస్తానంటున్నాడు. గుజరాత్‌లో నర్మదా, ఉత్తరప్రదేశ్‌లో గంగానదిని వాళ్ల ప్రక్షాళన చేసుకోవచ్చు. ఢిల్లీ ఎన్నికల్లో యమునా నదిని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. ఆ రాష్ట్రాలకు ఒక నీతి, తెలంగాణకు మరో నీతా? కిషన్‌రెడ్డి నూటికి నూరు శాతం సైంధవ పాత్ర పోషిస్తున్నాడు. బీజేపీ జాతీయ మండలి సమావేశానికి వచ్చినప్పుడు తెలంగాణకు 360 కిలోమీటర్ల రీజినల్ రింగు రోడ్డును ఇచ్చానని నరేంద్రమోదీ ప్రకటించిన మాట వాస్తవమా? కాదా?" అని సీఎం రేవంత్ అన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు క్యాబినెట్ ఆమోదమే లేదు..

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ఈరోజు వరకూ క్యాబినెట్ ఆమోదమే పొందలేదని సీఎం అన్నారు. దాంతో ఉత్తర భాగానికి టెండరు పిలిచినా తేదీలు వాయిదా పడుతున్నాయన్నారు. "మెట్రోకు, రీజినల్ రింగ్ రోడ్డుకు తానే కృషి చేశానని కిషన్‌రెడ్డి అంటున్నాడు. మరి.. కేంద్ర మంత్రిగా ఆరేళ్లుగా పని చేస్తూ ఈ రెండు అంశాలను కేంద్ర క్యాబినెట్ ఎజెండాలో ఎందుకు పెట్టడంలేదు? ఎజెండాలో పెట్టకుండా సంబంధిత మంత్రులపై ఒత్తిడి తెస్తున్నది ఎవరు? నేను ఢిల్లీకి వెళ్లి ఇవే అంశాలపై కిషన్‌రెడ్డికి వినతి పత్రాలు ఇచ్చి వచ్చాను. డీపీఆర్‌లతో సహా అన్ని వివరాలను అందజేశాం. మోదీతో మాట్లాడి వీటిని క్యాబినెట్ ఎజెండాలో పెట్టించాలని కోరాం. మీరు తెచ్చిన ఒక్క ప్రాజెక్టు పేరు చెప్పండి. మీరు బెదిరిస్తే.. బెదిరేవారు ఎవరూ లేరు. సెమీ కండక్టర్ల ఫ్యాక్టరీ తెలంగాణకు వస్తుంటే.. దానిని బెదిరించి గుజరాత్‌కు తీసుకెళ్లావు. ఉత్తరప్రదేశ్‌కు, అసోంకు ఇచ్చారు. తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదని అడుగుతున్నా. కేంద్రం నుంచి అదనంగా ఒక్క రూపాయి కూడా రాలేదు. రావాల్సిన నిధులు మాత్రమే వచ్చాయి. పదుల సార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలిశాం. మీరు ఇన్నిసార్లు వస్తున్నారు కానీ.. మీ రాష్ట్రం నుంచి ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒక్కసారి కూడా వీటి గురించి మాట్లాడడం లేదని ఆ మంత్రులను అంటున్నారు" అని రేవంత్ పేర్కొన్నారు.

ఏనాడైనా తెలంగాణ కోసం అడిగావా?

"ఆరేళ్ల కేంద్ర మంత్రిగా తెలంగాణకు ఏదైనా కావాలని ప్రధాని మోదీని అడిగారా? కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రయోజనాల గురించి ఏనాడైనా ప్రస్తావించారా? పార్లమెంటు సమావేశాల్లోనైనా మాట్లాడారా? మీకు చిత్తశుద్ధి లేదు. మీ కేసీఆర్ దిగిపోయాడన్న బాధలో మాకు అడ్డం పడుతున్నారు. హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు బండి సంజయ్... ఆటోలు పోతే ఆటోలు ఇస్తాం, లారీలు పోతే లారీలు ఇస్తాం, బైక్ పోతే బైక్ ఇస్తామన్నాడు. ఇచ్చింది గుండు సున్నానే. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 2014లో మోదీ చెప్పారు. ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారు? ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తామన్నారు. ఎన్ని ఇళ్లు ఇచ్చారు? రాష్ట్రంలో బీసీ కులగణన చేపడితే.. బీసీల్లో మైనారిటీలను చేర్చినందున.. బీసీ రిజర్వేషన్ల బిల్లును తిరస్కరిస్తామని, రద్దు చేస్తామని అంటున్నారు. గుజరాత్‌లో 29 ముస్లిం ఉప కులాలు బీసీ రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయి. బిహార్‌లో 26 ముస్లిం బీసీ కులాలు రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో కూడా ఉన్నాయి. మీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. వీటిని మండల్ కమిషన్ సిఫారసు చేసింది. దూదేకుల, నూర్‌బాషా వంటి బీసీ కులాలు ఉన్నాయి. కుల గణన జరిగితే అధికారం కోల్పోతామనేభయంతో కిషన్‌రెడ్డి బీసీ కుల గణనపై అడ్డం పడుతున్నాడు. మా మందకృష్ణ మాదిగను బాగానే కౌగిలించుకున్నాడు. మరి ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు ఎస్సీ వర్గీకరణ చేయడం లేదు? పక్క రాష్ట్రంలో బీసీల్లోని ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను చంద్రబాబును డిమాండ్ చేసి రద్దు చేసే ధైర్యం ముందా?" అని రేవంత్ ప్రశ్నించారు.

బెదిరిస్తామంటే కుదరదు..

కేంద్రంలో వారి ప్రభుత్వం ఉన్నందున బెదిరిస్తామని కిషన్‌రెడ్డి అనుకుంటున్నారని, కానీ.. ఈ విధానం ఎక్కువ కాలం నడవదని సీఎం రేవంత్ అన్నారు. "బాధ్యత గల సీఎంగా ప్రధానిని కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులు ఇవ్వాలని అడగుతున్నాం. ఒక్క రోజన్నా మాతో కలిసి వచ్చావా? మెట్రోలో రెండో స్థానంలో ఉండే హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయింది. నిర్మలా సీతారామన్ తమిళనాడు మెట్రోకు అనుమతి ఇప్పిస్తారు కానీ.. కిషన్‌రెడ్డి తెలంగాణకు ఇప్పించరు. అవసరమైతే... ప్రధానికి ఇచ్చిన అన్ని వివరాలను, డీపీఆర్‌లను కిషన్‌రెడ్డి ఇస్తా. ఎప్పటిలోగా వీటికి కిషన్‌రెడ్డి అనుమతులు తెస్తారో తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలి. బీసీ కులాలు, ఎస్సీ కులాల కోసం మేము చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించడం ఇష్టం లేకపోతే... వదిలేయండి. బీఆర్ఎస్‌ను ఓడిస్తామంటూ ప్రగల్భాలు పలికే మీరు.. కులగణనలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును ఒక్కరోజైనా డిమాండ్ చేశారా? మీ ఇద్దరి పీఆర్వోలు ఒక్కరే కదా? తప్పు తప్పు అంటున్నారు. ఎక్కడ తప్పు జరిగిందో చెప్పాలి కదా ? మీకు ఏ వివరాలు కావాలన్నా.. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సెక్రటరియేట్‌కు రండి. అన్ని వివరాలు చూపిస్తాం. బీసీ కులాలకు అన్యాయం జరగాలని కిషన్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు కుదరవు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాన్ని, వాళ్ల తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తాం' అని రేవంత్ అన్నారు.

రాష్ట్రంపై మీ ముద్ర ఏదీ?

రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహించిన జైపాల్‌రెడ్డి హైదరాబాద్‌కు మెట్రో రైలు, వెంకటస్వామి సింగరేణి కార్మికులకు పింఛన్ వంటి సౌకర్యాలు తెచ్చి.. తమవంతు ముద్ర వేశారని సీఎం రేవంత్ తెలిపారు. కానీ, కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి తెలంగాణ కోసం చేసిందేంటని, రాష్ట్రంపై ఆయన ముద్ర ఏముందని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. "రాష్ట్రంలో ప్రాజెక్టులపై ప్రధానమంత్రిని, కేంద్రమంత్రులను, మిమ్మల్ని కూడా కలిసి, అన్నీ వివరించిన తర్వాత కూడా అవగాహన రాహిత్యంతో సీఎం మాట్లాడుతున్నారని మీరు మాట్లాడటం బాధ్యతారాహిత్యం. కేంద్రమంత్రిగా ఉంటూ ఏ ఒక్కటీ సాధించలేని మీరు, ఒత్తిడితో మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేయడం ఏమాత్రం సమంజసం కాదు. తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు అనుమతులు సాధించినిధులు మంజూరు చేయించడం కేంద్ర మంత్రిగా మీ నైతిక బాధ్యత" అని సీఎం అన్నారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

"హైదరాబాద్ చరిత్ర, సంస్కృతితో ముడిపడి ఉండడంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే మూసీ నది పునరుజ్జీవంపైనా మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుకు సహకరించాలని 2024 జూలై 22న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి లేఖ అందజేశాం. మీతోపాటు, తాజాగా ప్రధాని మోదీకి లేఖ అందజేశా. సబర్మతి, గంగానది పునరుజ్జీవంపై మీరు పలుమార్లు ప్రకటనలు చేశారు. పత్రికల్లో వ్యాసాలు రాశారు. కానీ, తెలంగాణలో మూసీ నది పునరుజ్జీవంపై విషం చిమ్ముతున్నారు. ఇది పూర్తిగా ద్వంద్వ వైఖరి. ఆర్ఆర్ఆర్ కోసం 2024 ఫిబ్రవరి 20, జూన్ 26న, డిసెంబరు 12 జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై ప్రాధాన్యాన్ని వివరించాను. ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని చేపట్టాలని కోరాను. ఒకేసారి రెండు భాగాలు పూర్తికాకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొనే వ్యయప్రయాసలను వివరించాను. ఆ తర్వాతనే కేంద్ర ప్రభుత్వం ఉత్తర భాగానికి టెండర్లు పిలిచింది. కానీ, కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించకపోవడంతో టెండర్లను మళ్లీ పొడిగించాల్సి వచ్చింది. ఆర్ఆర్ఆర్ అనుమతులు, మంజూరుకు (రూ.34,367.62 కోట్లు) సంబంధించిన వివరాలను, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణంపై (రూ.45 వేల కోట్లు) వివరించి మీకు లేఖ అందజేశా. తాజాగా ప్రధానికి లేఖ అందజేశా. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు నిర్మించాలని లేఖ అందజేశా. హైదరాబాద్ ఓఆర్ఆర్ సమీపంలో నిర్మించనున్న డ్రైపోర్ట్‌ను ఆంధ్రప్రదేశ్లోని బందరు పోర్ట్‌కు అనుసంధానించేలా గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాలని గడ్కరీని కలిసిన ప్రతిసారీ కోరాను. వీటితో హైదరాబాద్ సీవరేజీ మాస్టర్ ప్లాన్ (రూ.17,212.69 కోట్లు), వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్ (4,170 కోట్లు)కు సంబంధించి మీతో చర్చించాను. మొత్తంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రూ.1,63,559.31 కోట్ల ప్రాజెక్టుల అనుమతులు, మంజూరుపై చర్చించి పూర్తి వివరాలతో మీకు లేఖను అందజేశాను అని గుర్తు చేశారు. ఇకనైనా మీరు ప్రాజెక్టుల అనుమతులు, నిధుల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి" అని లేఖలో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



గోల్కొండ క్రాఫ్ట్స్ అండ్ టెక్స్‌టైల్స్ మేళాలో స్టాల్స్‌ను తిలకిస్తున్న మంత్రి తుమ్మల

బ్యాంకర్లు తీరు మార్చుకోవాలి

- ఆశించినమేరకు పంట రుణాలివ్వడంలేదు
- అధిక మొత్తంలో రుణాలిచ్చి రైతులను ప్రోత్సహించాలి: తుమ్మల

హైదరాబాద్/కవాడిగూడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ రుణాలను ఇచ్చే విషయంలో బ్యాంకర్లు తీరు మార్చుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం నిర్దేశించుకుంటున్న స్థాయిలో బ్యాంకర్లు పంట రుణాల లక్ష్యాన్ని చేరుకోలేకపోవడం వ్యవసాయ రంగానికి మంచిదికాదని పేర్కొన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఆర్థిక ఏడాదిలో రూ.90,795 కోట్ల వ్యవసాయ రుణాలను లక్ష్యంగా పెట్టుకోగా.. 2024 డిసెంబరు వరకు రూ.58,791 కోట్లను మాత్రమే బ్యాంకులు రైతులకు అందించాయని చెప్పారు. రుణాల అందజేత విషయంలో బ్యాంకుల వారీ, శాఖల వారీగా పనితీరును సమీక్షించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, మిర్చి, పసుపు, మొక్కజొన్న, అపరాలు, పండ్లకు సంబంధించి ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు ఇచ్చి రైతులను ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు.

తెలంగాణ హస్తకళలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

హస్తకళాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణ హస్తకళలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన గోల్కొండ క్రాఫ్ట్స్ అండ్ టెక్స్‌టైల్స్ మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2022 సంవత్సరానికి గాను తెలంగాణ హస్తకళల్లో అత్యున్నత నైపుణ్యాన్ని ప్రదర్శించిన 11 మంది కళాకారులకు అవార్డులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి కింద రుకియాబాయికి రూ.51వేలతో పాటు మెమెంటో అందించి సత్కరించారు.

దక్షిణాది రాష్ట్రాల తిరుగుబాటు తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. డీలిమిటేషన్‌లో లోక్‌సభ సీట్లు తగ్గబోవని చెబుతున్న అమిత్‌షా దామాషా పద్ధతిలో ఎన్నిసీట్లు పెంచబోతున్నారో ఎందుకు చెప్పడం లేదని రేవంత్ ప్రశ్నించారు. లోక్‌సభ సీట్ల పెంపులో కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రాతిపదిక ఏమిటని అడిగారు. ఇప్పుడున్న సీట్ల దామాషానా? జనాభా దామాషానా? చెప్పకుండా తగ్గవంటూ స్పష్టత లేని సమాధానం అమిత్‌షా ఎలా ఇస్తారన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బీమారు రాష్ట్రాల సీట్లు పెంచుకుని, దక్షిణాది రాష్ట్రాల సీట్లు, ఓట్లతో పని లేకుండా శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇది దేశంలో తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టించబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో సీట్ల దామాషా ప్రకారం 17 సీట్లకు ఇంకా 9 సీట్లు కలిసి మొత్తం 26 సీట్లు రావాలన్నారు. సీట్ల దామాషా కాదంటే 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని సీట్ల పెంపును ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. గత యాభై ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటించడంతో జనాభా బాగా తగ్గిందని చెప్పారు. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలు పాటించకపోవడంతో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. ప్రస్తుత జనాభాను ప్రాతిపదికగా తీసుకొని, దక్షిణాది రాష్ట్రాలను ఆర్థికంగా, రాజకీయంగా నిర్వీర్యం చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దక్షిణాదిలో బీజేపీకి బలం లేనందున ఇక్కడి రాష్ట్రాలకు కేంద్రంలో న్యాయమైన వాటా ఇవ్వకూడదన్నదే ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పన్నుల వాటాల్లో జనాభా తక్కువైన కారణంగా తెలంగాణ తీవ్రంగా నష్టపోతోందని చెప్పారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో రూపాయి పంపిస్తే రాష్ట్రానికి 42 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి వస్తున్నాయని చెప్పారు. జనాభా, పేదరికం ఎక్కువగా ఉన్న కారణంగా బిహార్‌కు రూపాయికి 7.6 రూపాయలు, ఉత్తరప్రదేశ్‌కు రూపాయికి 3 రూపాయలు ఇస్తున్నారని ప్రస్తావించారు. భాష అనేది ఇష్టంతో నేర్చుకునేదని, బలవంతంగా ఏదైనా భాషను రుద్దాలని ప్రయత్నిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. తెలంగాణలో నిర్బంధంగా తెలుగు భాషను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. జీవోలను కూడా తెలుగులో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. తెలుగు భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగు ప్రజలందరి మీద ఉందని చెప్పారు. ఈ ప్రాచీన భాషను కనుమరుగు చేసే ప్రయత్నాలను ఏ మాత్రం ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. యూపీఎస్సీ పరీక్షలను తెలుగులో కూడా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ భాషలకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. వివిధ భాషలు, సంస్కృతుల సమ్మేళనమే భారత దేశమని, ఒక భాషను ఇతరులపై రుద్ది, రాజకీయ ప్రయోజనాలు పొందాలని ఎవరైనా చూస్తే ప్రజలు తిప్పికొడతారని అన్నారు.

పదేళ్లలో కేసీఆర్ కదల్లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే వరంగల్ ఔటర్ రింగు రోడ్డు, విమానాశ్రయం ముందుకు కదిలాయని రేవంత్ చెప్పారు. కేసీఆర్ తన పదేళ్ల కాలంలో ఎప్పుడూ ఈ పని చేయలేదన్నారు. ఇలాంటి వాటి కోసమే పలుమార్లు ఢిల్లీకి వెళుతున్నామని చెప్పారు. కోచ్ ఫ్యాక్టరీని తామే సాధించుకువచ్చామన్నారు. రాష్ట్రానికి అవసరమైన అనుమతులు, నిధుల కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళతామని రేవంత్ స్పష్టం చేశారు. తాము ప్రత్యేక విమానాల్లో దుబాయ్‌కు, ఇతర దేశాలకు వెళ్లలేదని, ఢిల్లీకి వెళ్లి లిక్కర్ దందా చేయలేదని ఎద్దేవా చేశారు.

డాక్టర్లలో తొలి భారతరత్న నాగేశ్వర్‌రెడ్డే కావాలి!

రాష్ట్ర ప్రభుత్వం తన ప్రయత్నం చేస్తుంది.. ఫ్యామిలీ డాక్టర్ విధానం కొనసాగాలి

- ఆత్మీయంగా మాట్లాడితే రోగం నయం
- తెలంగాణలో వైద్య విధానం తెస్తున్నాం
- వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్
- ఏఐజీ చైర్మన్ సన్మానంలో రేవంత్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ఇప్పటి వరకూ ఎవరికీ భారతరత్న రాలేదని, ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి ఆ మహత్తర అవకాశం దక్కడం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఇటీవల పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డికి శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం త్వరలో వైద్య పర్యాటక విధానాన్ని తీసుకురానుందని ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు హైదరాబాద్ నుంచి అన్ని రకాల వైద్య సేవలు అందించేలా విధానాన్ని తెస్తామని చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, 10 లక్షల రూపాయల వరకూ ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచే ఏటా 900 కోట్ల రూపాయలను పేదల వైద్యానికి ఖర్చు పెడుతున్నామని చెప్పారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం వైద్యంతో పాటు అసలు రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తల మీద కూడా దృష్టి పెట్టాలని నిర్ణయించిందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న కొద్దీ డాక్టర్ రోగితో సంభాషించే సమయం తగ్గిపోతోందని రేవంత్ ప్రస్తావించారు. తన దృష్టిలో ఇప్పటికీ వైద్యంలో ఫ్యామిలీ డాక్టర్ పాత్రే కీలకమని చెప్పారు. కుటుంబ సభ్యుడిలా మాట్లాడి వైద్యం అందిస్తే మెరుగైన ఫలితం ఉంటుందన్నారు. డాక్టర్ పలకరించే విధానంతోనే సగం రోగాలు నయమవుతాయని వ్యాఖ్యానించారు. అయితే, వైద్య వ్యవస్థలో రోజు రోజుకీ ఫ్యామిలీ డాక్టర్లు తగ్గిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యామిలీ డాక్టర్‌కు మాత్రమే రోగి సమస్త సమాచారం అందుబాటులో ఉంటుందని, చికిత్స సులభతరం అవుతుందని చెప్పారు. డాక్టర్ దగ్గరకు వెళ్లినప్పుడల్లా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని డిజిటల్ హెల్త్ కార్డును తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో నాగేశ్వర్‌రెడ్డి ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని కోరారు. గల్ఫ్ నుంచి హైదరాబాద్‌కు రోగులు ఎక్కువగా వస్తున్నారని, వారి కోసం మరిన్ని విమానయాన సేవలను ప్రారంభించాలని కేంద్రాన్ని కోరారు. 1000 ఎకరాలలో పూర్తి స్థాయి హెల్త్ క్యాంపస్‌ను సృష్టిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. వైద్యపరంగా ఎలాంటి సహాయమైనా చేయగలిగే స్థాయికి హైదరాబాద్ ఎదగాలని, అందుకు నాగేశ్వర్‌రెడ్డి లాంటి వారి సలహాలు కావాలని అన్నారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఒక తెలుగు డాక్టర్‌కు మొట్టమొదటి సారిగా పద్మ విభూషణ్ రావడం, అదీ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి గుర్తింపు రావడం తనకు సంతోషం కలిగించిందని చెప్పారు. ఉత్తమ్ మాట్లాడుతూ, 30 సంవత్సరాలుగా తాను డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి పేషంట్‌నన్నారు. నాగేశ్వర్‌రెడ్డి గొప్ప మానవతావాది అని చెప్పారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, డి.శ్రీధర్‌బాబు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఎన్నారై వైద్యులు డాక్టర్ విష్ణు, డాక్టర్ విజితారెడ్డిలు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, దామోదర రాజనర్సింహ

ప్రాణాలు తీసిన ఇసుక అక్రమ రవాణా

» నిద్రిస్తున్న ఇద్దరు కూలీలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

» తీవ్రగాయాలతో ఆ ఇద్దరి మృతి.. కొత్తగూడెం జిల్లాలో ఘటన

చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆ డ్రైవర్, వెనుకాముందూ చూసుకోకుండా లోడు ట్రాక్టర్‌ను నిద్రిస్తున్న ఇద్దరు కూలీల మీద నుంచి దూకించాడు. ఈ ఘటనలో ఆ ఇద్దరూ మృతి చెందారు. కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆ మండలంలోని రాళ్లగూడేనికి చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి మూడు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటర్‌ను సమీకరించుకొని తేగడ వద్ద గల క్వారీనుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి మూడు ట్రాక్టర్లలో ఇసుకను దండుపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి కోసం జోరుగా తరలిస్తున్నారు. ఆ ఇంటి పనుల్లో ఉన్న ఇద్దరు వలస కూలీలు, సమీపంలోనే నిద్రించారు. తెల్లవారుజామున ఓ ట్రాక్టర్, ఆ కూలీలపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో కుంజం సన్ను (24) అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కూలీ శ్యామల సన్నుకు నడుం విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన శ్యామలను చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. కుంజం, శ్యామల.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీలే. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని, ట్రాక్టర్లను చర్ల పోలీసు స్టేషన్‌కు తరలించారు. కూలీల మీద నుంచి ట్రాక్టర్‌ను దూకించిన డ్రైవర్‌ను తస్నీరు రవిగా గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

'కింగ్ ఫిషర్' తయారీని పరిశీలించిన మహిళా శిక్షణ కానిస్టేబుళ్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ బేవరేజీస్ కంపెనీలో కింగ్ ఫిషర్ బీర్ల తయారీని ఎక్సైజ్ మహిళా శిక్షణ కానిస్టేబుళ్లు శుక్రవారం పరిశీలించారు. శిక్షణ కానిస్టేబుళ్లు బీర్ తయారీని పరిశీలించడం ఎక్సైజ్ శాఖ చరిత్రలో ఇదే తొలిసారని ఉన్నతాధికారులు తెలిపారు. మంత్రి జూపల్లి ఆదేశాల మేరకు ఎక్సైజ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య.. మహిళా శిక్షణ కానిస్టేబుళ్లను మల్లేపల్లిలో బీరు కంపెనీ పరిశీలనకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీరు బాటిళ్లను శుభ్రపరచడం నుంచి బీరు తయారీ విధానం, ప్యాకింగ్ వరకు అన్ని విషయాలను కంపెనీ క్లస్టర్ హెడ్ జయతీ షెకావత్, డీస్పాచ్ ఇంచార్జ్ హీస్‌తోష్ ఇతర అధికారులు కానిస్టేబుళ్లకు వివరించారు.

మార్గదర్శిపై కేసు కొనసాగాల్సిందే: ఆర్బీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి కేసుపై శుక్రవారం హైకోర్టులో మరోసారి విచారణ జరిగింది. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లపై జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కె. సుజన ధర్మాసనం విచారణ జరిపింది. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చట్టంలోని 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించినందుకు మార్గదర్శి కేసు ఎదుర్కోవాల్సిందేనని ఆర్బీఐ తెలిపింది. ఆర్బీఐ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదిస్తూ.. మార్గదర్శి హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కర్త రామోజీరావు మరణించినప్పటికీ కేసు విచారణ కొనసాగాలని తెలిపారు. ఒకవేళ తప్పుచేసినట్లు తేలితే మార్గదర్శి సంస్థ సెక్షన్ 58 (బీ) ప్రకారం శిక్ష ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తదితరులు వాదిస్తూ.. హెచ్‌యూఎఫ్‌కు కర్త, కర్మ, క్రియ అన్నీ రామోజీరావే కాబట్టి ఆయన చనిపోయిన నేపథ్యంలో ఇక ఎవరిపైనా కేసు ఉండదని తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. రామోజీరావు చనిపోయిన నేపథ్యంలో ఇప్పుడు కేసు విచారణ చేపట్టడం వల్ల సమయం వృథా తప్ప ఏమీ ఉండదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్ పూర్తిస్థాయి వాదనల కోసం మార్చి 7కు కేసును వాయిదా వేసింది.

ఆధార్ లేకున్నా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం

» రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ.. పిల్‌ను ముగించిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్) సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధార్ కార్డు లేకపోయినా వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఆధార్ కార్డు లేదన్న పేరుతో వైద్యం నిరాకరించడం లేదని స్పష్టం చేసింది. ఓజీహెచ్‌లో ఆధార్ కార్డు లేదని చెప్పి రోగులను చేర్చుకోవడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ ఆధార్ ఉన్నా లేకపోయినా వైద్యం అందిస్తున్నామని, భవిష్యత్తులో సైతం ఇదే విధానం కొనసాగుతుందని పేర్కొన్నారు. దీంతో పిల్‌ను ముగిస్తూ ధర్మాసనం తీర్పునిచ్చింది.

భాగ్యలక్ష్మి ఆలయం స్వాధీన ఉత్తర్వులపై స్టే

చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి ఆలయాన్ని దేవాదాయశాఖ స్వాధీనం చేసుకోవాలంటూ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఆలయాన్ని స్వాధీన పరచాలంటూ ఈ నెల 21న ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ భాగ్యలక్ష్మి ఆలయ వ్యవస్థాపకుడు రాజ్‌మోహన్‌దాస్ కుమార్తె శశికళ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విని ట్రిబ్యునల్ ఉత్తర్వులపై స్టే విధించింది.

ఉన్నత విద్యా రంగానికి ఉరి శిక్షే!

» సమాఖ్య విధానాన్ని దెబ్బతీసేలా యూజీసీ ముసాయిదా

» వర్సిటీల్లో మతతత్వ అజెండాను అమలు చేసే కుట్ర

» తీవ్రంగా ఆక్షేపించిన తెలంగాణ విద్యా కమిషన్..

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్వ విద్యాలయాల్లో ఉపకులపతులు, ఆచార్యుల ఎంపికలో మార్పులకు సంబంధించి ఇటీవలే కేంద్రం ప్రకటించిన యూజీసీ ముసాయిదా బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ముసాయిదా.. ఉన్నత విద్యారంగానికి ఉరి శిక్ష లాంటిదని ఆగ్రహం వ్యక్తం చేసింది. యూజీసీ ముసాయిదాపై కేంద్రం తెలంగాణ అభిప్రాయాలను కోరిన నేపథ్యంలో రాష్ట్ర విద్యా కమిషన్ ఇప్పటికే ఓ సదస్సు నిర్వహించింది. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల ప్రతినిధులు, విద్యావేత్తలను ఆహ్వానించి వారి అభిప్రాయాలు సేకరించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత శాంతా సిన్హా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు సీనియర్ విద్యావేత్తలు ఇందులో పాల్గొన్నారు. వారు పేర్కొన్న అభిప్రాయాలతో తీర్మానం చేసిన రాష్ట్ర విద్యా కమిషన్.. శుక్రవారం దాన్ని కేంద్రానికి పంపింది. వర్సిటీల వీసీల నియామకాన్ని నేరుగా గవర్నర్ చేపట్టాలని కేంద్రం భావించడం.. రాష్ట్రాల హక్కులను హరించడమే అవుతుందని అందులో తెలిపింది. ఇది సమాఖ్య వ్యవస్థనే దెబ్బతీసే పనికిమాలిన చర్యగా అభివర్ణించింది. దేశ ఘన చరిత్రను వక్రీకరించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని పేర్కొంది. ఉన్నత విద్యా సంస్థల్లోకి తీవ్ర మతతత్వ అజెండా ఉన్న వ్యక్తులు, మతపరమైన అసమానత భావజాలంపై విశ్వాసమున్న వ్యక్తులను తెచ్చేందుకే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని మండిపడింది.

ఎంపీ నిధులతో ఇల్లు కట్టినట్లు ఒప్పుకుంది నువ్వే..!

» సోయం.. ఆ వీడియోలు ఉన్నాయి: ఎంపీ నగేశ్

తలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'ఎంపీ నిధులతో ఇల్లు కట్టుకున్నా.. కొడుకు పెళ్లి చేశానంటూ సోయం స్వయంగా ఒప్పుకుని కార్యకర్తల ముందు మాట్లాడిన వీడియోలు ఉన్నాయి' అని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ నగేశ్ వ్యాఖ్యానించారు. ఇటీవల తనపై మాజీ ఎంపీ సోయం బాపురావు చేసిన విమర్శలపై ఘాటుగా స్పందించారు. 'నేను చనిపోతే గోరి కడతా అంటావా.. మాటలు జాగ్రత్త!' అంటూ హెచ్చరించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్‌లో పర్యటించిన ఆయన.. విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో మచ్చ లేకుండా ప్రజాసేవ చూస్తూ ముందుకెళ్తున్నానని.. తన జోలికొస్తే సహించేదన్నారు.



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి

బ్రహ్మోత్సవాలు నేటి నుంచే



బ్రహ్మోత్సవాలకు విద్యుద్దీపాల వెలుగుల్లో యాదగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం

యాదాద్రి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధానాలయానికి స్వర్ణ విమాన గోపురం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు మరింత శోభను సంతరించుకోనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వస్తివాచనం, అంకురారోపణం జరగనున్నాయి. ఆదివారం నుంచి 6వ తేదీ వరకు వరుసగా ధ్వజారోహణం, దేవతాహ్వానం, వేదపారాయణ, హవన, అలంకార సేవలు జరుగుతాయి. 7న ఎదుర్కోలు, 8న లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవం, 9న దివ్య విమాన రథోత్సవం, 10న శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం, 11న శతఘటాభిషేకం, శృంగారడోలోత్సవం, ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రధానాలయాన్ని, ఆలయ మండపాలను, ముఖద్వారాలను, గోపురాన్ని విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలమాలలు, అరటి, మామిడి తోరణాలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 8న తిరుకల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వామివారిని దర్శించుకొని.. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కొండపైకి వాహనాలను ఉచితంగా అనుమతించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు వెల్లడించారు.

స్వయం ఉపాధి

పథకాలకు రుణాలివ్వండి

ప్రభుత్వం తరఫున మార్జిన్ మనీ, సబ్సిడీలిస్తాం.. 2న రూ.6000 కోట్ల విలువైన యూనిట్ల పంపిణీ

» గత ప్రభుత్వ పాలనలో ఆయా కార్పొరేషన్లపై నిర్లక్ష్యం

» మూసీ నిర్వాసితులకు ఆర్థిక చేయూత అందించాలి

» బ్యాంకర్లతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సీఐఐ విందులో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాల అమలుకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం తరఫున మార్జిన్‌మనీ, సబ్సిడీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, నిరుద్యోగ యువతకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రావాలని సూచించారు. స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా రూ.6,000కోట్ల విలువైన వివిధ యూనిట్లను వనపర్తిలో ఈ నెల 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజాభవన్‌లో శుక్రవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రైజింగ్ తెలంగాణ'లో బ్యాంకర్ల పాత్ర కీలకమని, ప్రపంచాన్ని ఆకర్షించేలా తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు. స్వయం ఉపాధి పథకాల ప్రారంభం, సంక్షేమ పథకాల అమలును ఓ పండుగలా నిర్వహించనున్నామని, ఇవి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ)ని పెంచుతాయన్నారు. స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐల ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేస్తున్నామన్నారు. ఒక్క వ్యవసాయ రంగానికే బడ్జెట్‌లో రూ.52వేల కోట్లను కేటాయించామన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలతో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయిస్తున్నామని, 1000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా సోలార్‌కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నామని వివరించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారికి బ్యాంకర్లు ఆర్థికంగా చేయూత అందించాలని కోరారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)కు ఆర్థిక చేయూత అందించేందుకు బ్యాంకర్లు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనలో కార్పొరేషన్లపై తీవ్ర నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు.

3 ఎకరాల వరకు రైతు భరోసా జమ చేయండి: భట్టి

రైతుభరోసాలో భాగంగా 3 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం సొమ్మును జమ చేయాలని సంబంధిత శాఖల అధికారులను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకులు గోపీతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా కింద లబ్ధి పొందిన రైతుల వివరాలను గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శనకు పెట్టాలని ఆదేశించారు. రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అయిందా? లేదా? అన్నది ముందుగానే నిర్ధారించుకోవాలని సూచించారు.

సీఐఐ విందు సమావేశంలో భట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ గౌరవార్థం ఢిల్లీలోని పురానా ఖిల్లాలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో తెలంగాణ తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. యూరోపియన్ కమిషన్ సభ్యులు, కేంద్ర మంత్రులు, యూరప్ దేశాల రాయబారులు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. యూరోపియన్ దేశాలు-భారత దేశ వాణిజ్యాభివృద్ధిలో తెలంగాణ పాత్రను అతిథులకు భట్టి వివరించారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అండ

» ప్రోత్సాహకాలపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

» నెలాఖరులో రూ.300 కోట్ల బకాయిల విడుదల: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమల స్థాపనలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) భవన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన బృందం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని చెప్పారు. ఆయా ప్రభుత్వాలు దళిత పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై బృందం అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 'మినీ ఇండస్ట్రియల్ పార్క్'ను మహిళల కోసం అభివృద్ధి చేస్తామని, ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10% ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. 2017 నుంచి సబ్సిడీల కింద పారిశ్రామికవేత్తలకు అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైగా ఉన్నాయని, వీటిలో రూ.2200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాలని చెప్పారు. ఈనెల చివరినాటికి రూ.300 కోట్లు చెల్లిస్తామని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సహకారం తీసుకోనుంది. ఈ మేరకు శుక్రవారం ఎఫ్‌టీసీసీఐ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఈ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. పారిశ్రామికవేత్తలకు రుణాల విషయంలో సహకరించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పరిశ్రమలశాఖ సంచాలకులు మల్సూర్ తెలిపారు.

వాహనం

ఆచూకీ ఇక పక్కా!

(మొదటిపేజీ తరువాయి)

కోరుతూ రవాణా శాఖ అధికారులు ఇటీవలే కేంద్రానికి లేఖ రాశారు. కేంద్రం నుంచి అనుమతి వచ్చిన వెంటనే రాష్ట్రంలో నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వీఎల్టీడీ అమర్చడం వల్ల ఏ వాహనంలోనైనా అనుకోని ఘటనలు జరిగితే.. క్షణాల్లో పోలీసులు వాహనాన్ని వెంబడించి పట్టుకునే అవకాశం ఉంటుంది. అయితే మహిళా ప్రయాణికులు తప్పనిసరిగా వాహనం నంబరు, కనీసం చివరి నాలుగు అంకెలు చెప్పాలి. బాధితురాలు చెప్పే వాహనం నంబరు ఆధారంగా అది ఎక్కడ ఉంది? ఎటువైపు వెళ్తుందనేది గుర్తించి స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి పట్టుకుంటారు. భద్రతా చర్యల్లో భాగంగా అవసరమైతే ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి అత్యవసర సమయంలో వీఎల్టీడీ అమర్చిన వాహనం కదలికలపై నిఘా ఉంచే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రతి ట్యాక్సీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, గూడ్స్ వాహనాలతో పాటు ఇప్పటికే తిరుగుతున్న ఈ తరహా వాహనాలకు వీఎల్టీడీలను అమర్చనున్నారు. కేంద్ర అనుమతులు వచ్చిన తర్వాత ఈ తరహా వాహనాల తయారీ కంపెనీలు, సరుకు రవాణా వాహనాల తయారీ సంస్థలే వీఎల్టీడీ అమర్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే వాడుకలో ఉన్న వాహనాల్లో వీఎల్టీడీ పరికరాన్ని అమర్చేందుకు సుమారు రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందని, ప్రజా భద్రతకు ఇది తప్పనిసరని అధికారులు చెబుతున్నారు. కొత్త వాహనాలకు ఈ పరికరం లేకపోతే రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని నిర్ణయించారు. రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో లొకేషన్ ట్రాకింగ్ పరికరం లేనట్లు గుర్తిస్తే అలాంటి వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తారు. "వీఎల్టీడీ విధానం అమల్లోకి తేవడం వల్ల మహిళా ప్రయాణికుల భద్రతకు పూర్తి భరోసా ఏర్పడుతుంది. తెలంగాణతోపాటు మరో ఒకటి, రెండు రాష్ట్రాలు నూతన విధానం అమలుపై దృష్టి సారించాయి. మహిళా ప్రయాణికుల్ని దృష్టిలో ఉంచుకుని ఈ విధానం ఏర్పాటు చేస్తున్నాం. ఇదివరకే చట్టం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే సరిపోతుంది. నిర్వహణ నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తాయి. ట్రాకింగ్ పరికరాలు అమర్చడం, నిర్వహణ అంశం ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉంది. పూర్తిస్థాయిలో వాడుకలోకి వచ్చేందుకు మరికొంత సమయం పడుతుంది" అని రవాణా శాఖ కీలక అధికారి ఒకరు తెలిపారు.

ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది. గోషామహల్‌లో అత్యాధునిక వసతులతో నిర్మించనున్న కొత్త భవనానికి రూ. 2,700 కోట్లు అవసరమని నిపుణుల కమిటీ ఇటీవలే తేల్చింది. ఈ మేరకు ప్రభుత్వం అనుమతులిచ్చింది.

షాపులో మంటలు.. భవనమంతా వ్యాప్తి!

» 4ఏళ్ల చిన్నారి సహా ముగ్గురి మృతి.. ఒకరికి గాయాలు

» రెండు కార్లు దగ్ధం.. ఒక కారులో పేలిన సిలిండర్



గాయపడిన వారిని బయటకు తీసుకువస్తున్న సహాయక సిబ్బంది

నార్సింగ్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణంలో షాట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలకు అక్కడ పార్క్ చేసిన రెండు కార్లు తగులబడ్డాయి. ఆ రెండింటిలో ఒక వాహనంలోని గ్యాస్ సిలిండర్ పేలింది. ఫలితంగా తీవ్రత పెరగడంతో మంటలు భవనంలోని రెండు అంతస్తులకూ పాకాయి. ఆ ఇళ్లలోని ఆరు సిలిండర్లలో రెండు పేలడంతో మంటలు మరింత ఉధృతమయ్యాయి. ఎగిసిపడ్డ అగ్నికీలలు.. దట్టమైన పొగకు ఊపిరాడక ఆ భవనంలో నివసిస్తున్నవారిలో నాలుగేళ్ల చిన్నారి సహా ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఒకరు గాయపడ్డారు. నార్సింగ్ పరిధిలో ఈ ఘటన జరిగింది. మృతులు, గాయపడ్డవారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నార్సింగ్‌లోని పాషా కాలనీలో ఉస్మాన్ ఖాన్ అనే వ్యక్తి.. తన ముగ్గురు తమ్ముళ్లతో కలిసి ఉండేందుకు జీ ప్లస్ 2 భవనం నిర్మించుకున్నాడు. ఆ భవనంలోని రెండు ఫ్లోర్లలో ఉస్మాన్‌ఖాన్, ఆయన సోదరులు, వారి భార్యాపిల్లలు అంతా కలిసి 15 మంది నివసిస్తున్నారు. శుక్రవారం గ్రౌండ్ ఫ్లోర్‌లోని కిరాణాషాపులో మంటలు చెలరేగి.. కొద్దిసేపటికే భవనం రెండు అంతస్తులకూ వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎనిమిది మంది ఉన్నారు. మంటలను గమనించి ఉస్మాన్‌ఖాన్ బయటకు పరిగెత్తుకొచ్చారు. మంటలు అంతటా వ్యాపించాక పైనున్నవారికి మెట్లపై నుంచి దిగే అవకాశం లేకపోయింది. స్థానికులు దిండ్లు తెచ్చి వేయడంతో కొందరు బిల్డింగ్ నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఖాన్ కుటుంబసభ్యుల్లో మహిళలు మంటలను చూసి భయభ్రాంతులకు గురై బెడ్ రూంలోకి వెళ్లి తలుపులు బిగించుకున్నారు. వారిలో కొందరు పొగకు ఊపిరాడక స్పృహ కోల్పోయారు. నార్సింగ్ పోలీసులు, అగ్నిమాపకశాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికొచ్చి సహాయక చర్యలు చేపట్టారు. మహిళలు లోపల చిక్కుకుపోయారని తెలుసుకొని.. తాళ్లు, నిచ్చెన సాయంతో బెడ్‌రూంలో ఉన్న మహిళలను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే వారు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో 108లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జమీల్ ఖాటూన్ (75), సహానా కాటూన్ (40), షిజ్రా కాటూన్ (4) మృతి చెందినట్లు నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ వెల్లడించారు. ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో యూనస్‌ఖాన్ (45) బిల్డింగ్‌పై నుంచి దూకడంతో అతడి కాలు విరిగింది. ఉస్మాన్‌ఖాన్ కుటుంబసభ్యుల రోదనలతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది.

సండే నుంచి మంటలే..!!

మార్చి ప్రారంభంలోనే మండనున్న సూరీడు

36 డిగ్రీలకు మించనున్న పగటి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్



హైదరాబాద్, విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఎండల తీవ్రతతో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజానీకానికి మరింత చమట పట్టనుంది. మార్చి నెల ప్రారంభంలోనే భూవిని నిప్పులకొలిమి చేసేందుకు సూరీడు సిద్ధమైపోతున్నాడు. ఇక్కడా, అక్కడా అనే తేడా లేకుండా ఆదివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తన ప్రతాపం చూపెట్టబోతున్నాడు. రాష్ట్రంలో ఆదివారం నుంచి ఎండలు మరింత పెరగనున్నాయి. మార్చి 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 36-38.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుక్రవారం హెచ్చరించింది. ఈ మేరకు ఎండ తీవ్రతను సూచించే యెల్లో అలెర్ట్‌ను అన్ని జిల్లాలకు జారీ చేసింది. మంచిర్యాల, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో 38 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మరోపక్క, రాష్ట్రంలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ సగటున 15-20 డిగ్రీల మధ్య నమోదు అవుతున్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా, శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో అత్యధికంగా 38.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన వడగాలులు

మార్చి నుంచి మే వరకూ దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత క్రమేపీ పెరగనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అలాగే దేశంలో ఐదింట నాలుగొంతుల ప్రాంతం వడగాడ్పుల ప్రభావానికి గురికానుందని తెలిపింది. తెలంగాణ, ఏపీలోనూ వడగాలుల తీవ్రత ఉండనుందని శుక్రవారం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. గతేడాది కంటే ఎండలు, వడగాలుల తీవ్రత అధికంగా ఉండనుందని హెచ్చరించింది. దక్షిణాదిలో కొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతం, ఉత్తరాదిలో కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కానున్నాయని ఐఎండీ అంచనా వేసింది. దేశ వ్యాప్తంగా ఫిబ్రవరిలో వర్షపాతం సాధారణం కంటే 50 శాతం తగ్గిందని, దీంతో భూమిలో, గాలిలో తేమశాతం తగ్గాయని.. దేశంలో వేడి పెరగడానికి ఇదో కారణమని నిపుణులు చెబుతున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మహిళలను శక్తిమంతం చేయాలి

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్య, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల ద్వారా మహిళలను శక్తిమంతం చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్(సీఓడబ్ల్యూఈ) నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ బీ2బీ ఎక్స్‌పో- 2025ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలను అందించడమే లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. వ్యాపారాలను విస్తృత పరుచుకునేందుకు డిజిటల్ టెక్నాలజీ ఉపయోగ పడుతుందన్నారు. టెక్నాలజీ ద్వార లింగ అసమానతలు తగ్గుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ టెక్నాలజీతో మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందాలన్నారు. మహిళా సాధికారత ఇప్పుడు ఆర్థిక అభివృద్ధికి ప్రేరక శక్తిగా మారిందని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.